గురువారం
4•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 9
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



Lalithaa
కూకట్‌పల్లి & సోమాజిగూడ





## మీరే నా దేవుడు

విగ్రహ రూపంలో, చిత్రలేఖనం రూపంలో దేవున్ని చూసేవిధంగా, వినియోగదారులైన మీ రూపంలో నేను దేవున్ని చూస్తున్నా! నేను తినే తిండి, వేసుకునే దుస్తులు, నడిపే కారు, నివసించే ఇల్లు.. ఇవన్నీ మీరిచ్చినవే. మీ ఆదరణకు నేను నిజాయితీగా ఉండటమే నా కర్తవ్యం. అందువల్లే మరెక్కడా లభించని తక్కువ ధరకే, నాణ్యమైన నగల రూపంలో దేవుళ్లైన మీకు తిరిగి చెల్లించడమే కదా సముచితం. మీ ఆశిస్సులతో ఇప్పుడు హైదరాబాద్‌లో లలితా జ్యువెల్లరి రెండో షోరూంను కూకట్‌పల్లిలో ప్రారంభిస్తున్నాం. మీ సేవలో ఇది మా 23వ షోరూం. వ్యాపార ఉద్దేశంతో మాత్రమే దీన్ని ప్రారంభించడం లేదు. వినియోగదారులకు పెట్రోలు, బస్సు ఛార్జీలు వంటి ప్రయాణ ఖర్చులు తగ్గించడమే ప్రధాన ఉద్దేశం. సోమాజిగూడ, కూకట్‌పల్లి.. ఈ రెండింటిలో మీకు దగ్గరగా ఉన్న షోరూంలో నగలు కొని మీరు కష్టపడి సంపాదించిన డబ్బును ఆదా చేయాలని వినమ్రంగా కోరుకుంటున్నా.

డబ్బులెవరికీ ఊరికే రావు!

## బ్రహ్మాండమైన ప్రారంభోత్సవం
## కూకట్‌పల్లి!

**నేడు, ఉ॥10.30 గంటలకు.**

2-22-298, PNR ఎంపైర్, కళామందిర్ పక్కన, KPHB మెట్రో స్టేషన్ సమీపం.
ఫోన్: 040 - 2384 2277 / 2384 2200 / 2384 2299. సుస్వాగతం!

ప్రారంభోత్సవ ఆఫర్ కోసం తదుపరి పేజీ చూడండి!

సోమాజిగూడ: SBR సౌక్, రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా. ఫోన్: 040 - 6748 6677.





**పోల్చి చూడండి**
ఎస్టిమేట్ స్లిప్ & మొబైల్‌లో ఫొటో తీసుకుని ధరలు పోల్చి కొనండి.

**తయారీ ధరకే.. బంగారు, వజ్రాభరణాలు!**
అంతులేని కలెక్షన్లు!
మీరు మునుపెన్నడూ చూడని ఆకట్టుకునే లక్షలాది డిజైన్లు.

**లలితా జ్యువెల్లరి** మార్ట్ ప్రై. లిమిటెడ్ 100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్

విజయవాడ • విశాఖపట్నం • తిరుపతి • రాజమహేంద్రవరం • హైదరాబాద్ • చెన్నై • తిరువళ్లూరు • గుడియాత్తం • మదురై • తిరుచ్చి
పుదుచ్చేరి • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్ • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు www.lalithaajewellery.com

Lalithaa

## పాక్‌లోనే దావూద్

### లండన్ కోర్టుకు తెలిపిన అమెరికా



**లండన్:** మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్, అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం పాక్‌లోనే ఉన్నాడని అమెరికా స్పష్టం చేసింది. దావూద్ ఉగ్ర కార్యకలాపాలు, డీ-కంపెనీ వ్యవహారాలు కరాచీ కేంద్రంగా జరుగుతున్నాయన్నది. దావూద్ సన్నిహితుడు, ఇంగ్లాండ్ జైలులో ఉన్న జబీర్ మోతివాలాను అప్పగించాలని కోరుతూ అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ కోర్టులో విచారణ జరిగింది. ఎఫ్‌బీఐ తరపున జాన్ హార్డీ వాదిస్తూ దావూద్ ఇబ్రహీం, అతడి సోదరుడు 1993 ముంబై ఉగ్రదాడుల తర్వాత భారత్ నుంచి పారిపోయాడని, ప్రస్తుతం పాకిస్థాన్‌లోని ఓ గుర్తుతెలియని ప్రాంతంలో నివసిస్తున్నారని చెప్పారు. జబీర్ మోతివాలాపై అమెరికాలో పలు కేసులున్నాయన్నారు. ముగ్గురు ఎఫ్‌బీఐ విశ్వసనీయ వక్తులు జబీర్‌ను 2011లో అమెరికాలో, 2011, 2012లో పాక్‌లో కలుసుకొన్నారన్నారు.

## 100 కోట్ల జరిమానా కట్టండి

### బొగ్గు తవ్వకాలపై మేఘాలయకు సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ:** రాష్ట్రంలో అక్రమ బొగ్గు గనుల తవ్వకాల వల్ల జరిగిన పర్యావరణ విధ్వంసాన్ని అరికట్టి నష్టనివారణ చర్యలు చేపట్టడానికి కేంద్ర కాలుష్య నివారణ బోర్డుకు రూ.100 కోట్లు జరిమానాను డిపాజిట్ చేయాలని మేఘాలయ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. రాష్ట్రంలో అక్రమంగా తవ్విన బొగ్గును కోల్ ఇండియా లిమిటెడ్‌కు అప్పగించాలని, ఆ సంస్థ ఈ బొగ్గును అమ్మగా వచ్చిన సొమ్మును రాష్ట్ర ఖజానాకు జమచేస్తుందన్నది. ప్రభుత్వ అనుమతులు ఉన్న సంస్థలు బొగ్గు తవ్వకాలు జరుపుకోవచ్చన్నది. మేఘాలయలో అక్రమ బొగ్గు గనుల తవ్వకాలపై వచ్చిన ఫిర్యాదులపై 2018 ఆగస్టులో జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఏర్పాటు చేసిన కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి రాష్ట్రంలో మొత్తం 24వేల ప్రాంతాల్లో బొగ్గు గనుల తవ్వకాలు జరుగుతున్నాయని, ఎక్కువగా అక్రమ తవ్వకాలేనని గుర్తించింది. ఈ తవ్వకాల వల్ల పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతున్నదని, రూ. 100 కోట్లు జరిమానా చెల్లించాలని ఆదేశించింది..

### లిబియాలో శరణార్థుల శిబిరంపై వైమానిక దాడి

## 40 మంది దుర్మరణం

**బెన్‌గాజీ:** లిబియా రాజధాని ట్రిపోలీలోని శరణార్థుల శిబిరంపై జరిగిన వైమానిక దాడిలో 40 మంది మరణించారు. 80 మంది గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం వేకువజామున తజౌరా ప్రాంతంలో జరిగింది. ఈ శిబిరంలో దాదాపు 616 మంది శరణార్థులున్నారు. బుధవారం ఒక్కసారిగా వైమానికదాడి జరుగడంతో ఈ శిబిరం ధ్వంసమైంది. మనుషుల శరీర భాగాలు విసిరేసినట్లు పడిపోయాయి. ఆ ప్రాంతం రక్తసిక్తమైంది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీస్తున్నారు. కాగా ఈ దాడికి ఖలీఫా హిఫ్టర్ నేతృత్వంలోని లిబియన్ నేషనల్ ఆర్మీయే కారణమని ప్రభుత్వం ఆరోపించింది. కానీ స్థానిక మీడియా శిబిరానికి సమీపాన ఉన్న సైనిక స్థావరంపై లిబియన్ నేషనల్ ఆర్మీ వైమానిక దాడి చేపట్టిందని పేర్కొంది.



వైమానిక దాడిలో పూర్తిగా ధ్వంసమైన ట్రిపోలీ శరణార్థుల శిబిరం



హెచ్1బీ మోసం కేసులో..

## తెలుగువాళ్ల అరెస్ట్



**వాషింగ్టన్:** హెచ్1బీ వీసా ప్రోగ్రామ్‌ను దుర్వినియోగపరిచారనే ఆరోపణలపై నలుగురు భారతీయ అమెరికన్లను అరెస్ట్ చేసినట్లు అమెరికా న్యాయ విభాగం వెల్లడించింది. విజయ్ మానె, వెంకటరమణ మన్నం, ఫెర్నాండో సిల్వా, సతీశ్ వేమూరిపై వీసా నేరాలకు సంబంధించిన అభియోగాలు మోపినట్లు తెలిపింది. నిందితులందరినీ 2,50,000 డాలర్ల పూచీకత్తుపై విడుదల చేసినట్లు తెలిపింది. వారిపై నమోదైన అభియోగాల ప్రకారం గరిష్ఠంగా ఐదేండ్ల జైలు, 2,50,000 డాలర్ల చొప్పున జరిమానా పడే అవకాశం ఉన్నది. హెచ్1బీ అనేది నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా. దీని ద్వారా అమెరికా కంపెనీలు విదేశీ నిపుణులను నియమించుకునేందుకు వీలవుతుంది. అమెరికా న్యాయ విభాగం వివరాల ప్రకారం.. విజయ్, వెంకటరమణ, వేమూరి.. న్యూజెర్సీలోని మిడిల్‌సెక్స్ కౌంటీలో ప్రొక్యూర్ ప్రొఫెషనల్ ఇంక్, క్రిప్టో ఐటీ సొల్యూషన్స్ ఇంక్ పేరిట రెండు ఐటీ స్టాఫింగ్ (ఐటీ నిపుణులను అందించే) కంపెనీలను నడుపుతున్నారు. అలాగే సిల్వా, వెంకటరమణ.. 'క్లయింట్ ఏ' పేరిట మరో కంపెనీని నిర్వహిస్తున్నారు. ప్రొక్యూర్, క్రిప్టో కంపెనీల ద్వారా విదేశీ ఉద్యోగులకు హెచ్1బీ వీసాలను అందిస్తున్నారు. అయితే వీసా దరఖాస్తులను వేగవంతం చేసేందుకు, సదరు విదేశీ ఉద్యోగి ఇదివరకే 'క్లయింట్ ఏ'లో పని చేస్తున్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించారు. పోటీసంస్థలపై పై చేయి సాధించేందుకు వీరు వీసా ప్రోగ్రామ్‌ను దుర్వినియోగం చేశారని ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు.

# రాజీనామాపై రాజీ లేదు

### కాంగ్రెస్ అధ్యక్ష పదవికి అధికారికంగా రాజీనామా ప్రకటించిన రాహుల్

- పార్టీ భవిష్యత్ కోసం జవాబుదారీతనం ముఖ్యమని వెల్లడి
- వెంటనే కొత్త అధినేతను ఎంపిక చేయాలని సీడబ్ల్యూసీకి సూచన
- రాజీనామా లేఖను ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన రాహుల్
- పదవికి దూరమైనా మోదీపై పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్య



**న్యూఢిల్లీ, జూలై 3:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి రాహుల్‌గాంధీ అధికారికంగా రాజీనామా ప్రకటించారు. పార్టీ భవిష్యత్ బాగుండాలంటే జవాబుదారీతనం ముఖ్యమని, తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దేశానికి జీవనాడి వంటి పార్టీకి అధ్యక్షుడిగా సేవలందించినందుకు గర్వంగా ఉన్నదన్నారు. తన రాజీనామా లేఖను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. తద్వారా తన రాజీనామాపై సాగుతున్న ఉత్కంఠకు తెరదించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) వెంటనే పార్టీ అధ్యక్షుడిగా వేరొకరిని ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత మే 27న జరిగిన సీడబ్ల్యూసీ భేటీలో పార్టీ ఘోర ఓటమికి బాధ్యత వహిస్తూ రాహుల్ గాంధీ తన రాజీనామా లేఖను అందించారు. సీడబ్ల్యూసీ ఆ లేఖను తిరస్కరించినా. నాటి నుంచి హైడ్రామా కొనసాగుతున్నది. ఆయన్ను బుజ్జగించేందుకు పార్టీ నేతలు ప్రయత్నించారు. ఆయన కొనసాగాలంటూ పార్టీ కార్యకర్తల ధర్నాలు, నేతల మూకుమ్మడి రాజీనామాలూ కొనసాగినా రాహుల్‌గాంధీ వెనక్కి తగ్గలేదు. బుధవారం తన రాజీనామా లేఖను. ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. 'తన ఆదర్శాలు, విలువలతో అందమైన ఈ భారత్‌కు జీవనాడిగా మారిన కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడిగా సేవలందించినందుకు గర్వ పడుతున్నా. దేశ ప్రజల, నా పార్టీ కార్యకర్తల ప్రేమాభిమానాలకు రుణపడి ఉంటాను' అని ట్వీట్ చేశారు.

**నా ప్రమేయం ఉండదు**

పార్టీ కొత్త అధ్యక్షుడి ఎంపికలో తన ప్రమేయం ఏమాత్రం ఉండబోదని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'నేనిప్పుడు కాంగ్రెస్ అధ్యక్షుడిని కాదు. నా రాజీనామాను సీడబ్ల్యూసీకి సమర్పించాను. వెంటనే కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాలని సూచించా. అన్ని స్థాయిల్లోనూ పార్టీ ప్రక్షాళన జరుగాలని స్పష్టం చేశాను' అని అన్నారు. కొత్త అధ్యక్షుడిగా ఎవరిని ఎన్నుకోవాలో సూచించాలని తనను కోరారని, అధక్షుడి ఎంపికలో తన ప్రమేయం ఉండదని, అది సీడబ్ల్యూసీ బాధ్యత అని, తాను ఇప్పుడు పార్టీలో ఓ సభ్యుడిని మాత్రమేనని చెప్పారు. 'ఏదేమైనా అధికారాన్ని అట్టిపెట్టుకోవడం మనదేశంలో ఓ అలవాటుగా మారింది. కానీ.. త్యాగాలకు సిద్ధం కాకుండా, అధికారంపై వ్యామోహాన్ని విడువకుండా మన శత్రువును జయించలేం' అని అన్నారు. రాహుల్ తన ట్విట్టర్ ఖాతా ప్రొఫైల్‌లో 'కాంగ్రెస్ అధ్యక్షుడు' అనే వాక్యాన్ని తొలిగించి 'కాంగ్రెస్ పార్టీ సభ్యుడు'గా మార్చుకున్నారు.

**పురాతన పార్టీలో సరికొత్త డ్రామా: బీజేపీ**

కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ గాంధీ అధికారికంగా రాజీనామా ప్రకటించడాన్ని బీజేపీ ఓ డ్రామాగా అభివర్ణించింది. పలువురు మంత్రులు కాంగ్రెస్‌పై విమర్శలు కురిపిస్తూనే, బీజేపీ-కాంగ్రెస్ మధ్య తేడాలు చెప్పేందుకు ప్రయత్నించారు. 'పురాతన పార్టీలో సరికొత్త నాటకం మొదలైంది' అని కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ విమర్శించారు. ప్రకాశ్ జవదేకర్ మాట్లాడుతూ 'బీజేపీలో సభ్యత్వ నమోదు, సంస్థాగత ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. కానీ.. కాంగ్రెస్‌లో అలాంటిదేం జరుగడం లేదు' అని అన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి నళిన్ కోహ్లీ మాట్లాడుతూ కాంగ్రెస్‌లో కుటుంబ పాలన మాత్రమే ఉంటుందని చెప్పారు. బీజేపీలో మాత్రం ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగుతుందని చెప్పారు. బీజేపీలో ఏ కార్యకర్త అయినా ఉన్నత పదవులకు పోటీ పడవచ్చునని చెప్పారు. ఇందుకు మోదీయే ప్రత్యేక ఉదాహరణ అని అన్నారు.

**రాహులే మా నాయకుడు**

అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటున్నట్టు రాహుల్ ప్రకటించినా.. పలువురు ఆ పార్టీ నేతలు మాత్రం ఆయనే పదవిలో కొనసాగాలని కోరుతున్నారు. 'రాజీనామా వెనక్కి తీసుకోవాలని రాహుల్‌ను కోరుతున్నాం. ఆయన పోరాటపటిమ మాకు తెలుసు' అని రాజస్థాన్ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ అన్నారు. 'కాంగ్రెస్ గెలుపు కోసం రాహుల్ తన శక్తికిమించి కృషిచేశారు. పదవిలో లేకున్నా ఆయనే మా నాయకుడు' అని కేంద్ర మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్ పేర్కొన్నారు.

## వారసుడెవరు?

### తెరపైకి సుశీల్‌కుమార్ షిండే, ముకుల్ వాస్నిక్, ఖర్గే తదితర పేర్లు

### తాత్కాలిక అధ్యక్షుడిగా వోరా!



సుశీల్‌కుమార్ షిండే



మల్లిఖార్జున ఖర్గే



ముకుల్ వాస్నిక్



మోతీలాల్ వోరా

**న్యూఢిల్లీ, జూలై 3:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి రాహుల్‌గాంధీ రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయన స్థానంలో కొత్త అధ్యక్షుడిగా ఎవరిని ఎంపిక చేస్తారనేది సర్వత్రా చర్చనీయాంశమైంది. పలువురు సీనియర్ నేతల పేర్లు తెరమీదికి వస్తున్నాయి. ప్రస్తుతం పార్టీ సీనియర్ నేత, ప్రధాన కార్యదర్శి మోతీలాల్ వోరాను (90) తాత్కాలిక అధ్యక్షుడిగా నియమించే అవకాశాలున్నాయి. గాంధీ కుటుంబ విధేయుడిగా ఆయనకు పేరున్నది. గతంలో పార్టీ కోశాధికారిగా పనిచేసిన వోరా ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. పార్టీ రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడు మరణించినా, రాజీనామా చేసినా.. పార్టీలో అత్యంత సీనియర్ ప్రధాన కార్యదర్శిని తాత్కాలిక అధ్యక్షుడిగా నియమించాలి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రధానకార్యదర్శుల్లో వోరానే అందరికన్నా సీనియర్. కాగా, రాహుల్‌గాంధీ వారసుడిగా సీనియర్లు సుశీల్‌కుమార్ షిండే, ముకుల్ వాస్నిక్, మల్లికార్జున ఖర్గే తదితరుల పేర్లు తెరపైకి వస్తున్నాయి. వీరు ముగ్గురూ దళిత సామాజిక వర్గ నేతలే.

- మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్ కుమార్ షిండే కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ప్రధాన పోటీదారు. గాంధీ కుటుంబ విధేయుడు కావడం, పార్టీలో దళిత నేత కావడం ఆయనకు అనుకూలంగా కానున్నాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో షోలాపూర్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు.
- కాంగ్రెస్ అధ్యక్షుడి రేసులో వినిపిస్తున్న మరోపేరు ముకుల్ వాస్నిక్. ఈయన కూడా మహారాష్ట్రకు చెందిన దళిత నేతే.
- మాజీ కేంద్రమంత్రి మల్లికార్జున ఖర్గేకు సైతం గాంధీ కుటుంబ విధేయుడిగా పేరున్నది. కర్ణాటకలోని దళిత నేతల్లో సీనియర్ ఆయనే.

**మహారాష్ట్ర నేతకేనా?**

- త్వరలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర నేతకు అవకాశమిస్తే ప్రయోజనముంటుందని అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం. ప్రకాశ్ అంబేద్కర్ నేతృత్వంలోని ఆర్పీఐ, అసదుద్దీన్ ఒవైసీ సారథ్యంలోని మజ్లిస్ పార్టీ, రాష్ట్రంలో కాంగ్రెస్ సంప్రదాయ ఓటుబ్యాంకును చీలుస్తున్న సంగతి 2014 ఎన్నికల్లో స్పష్టమైంది. మళ్లీ బలం పుంజుకునేందుకు షిండే, వాస్నిక్‌లలో ఒకరికి పార్టీ పగ్గాలు దక్కే అవకాశాలు ఉన్నాయని నేతలు చెప్తున్నారు.

### జవాబుదారీతనం ముఖ్యం

కాంగ్రెస్ భవిష్యత్ కోసం జవాబుదారీతనం ఎంతో ముఖ్యమని రాహుల్ గాంధీ రాజీనామా లేఖలో పేర్కొన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో వైఫల్యానికి తాను బాధ్యత వహిస్తూ, అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటున్నట్లు స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా.. 2019 ఎన్నికల్లో ఓటమికి బాధ్యత వహిస్తున్నా. భవిష్యత్‌లో పార్టీ ఎదుగుదలకు జవాబుదారీతనం ఎంతో ముఖ్యం. అందుకే నేను అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నా. పార్టీ పునర్నిర్మాణానికి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిందే' అని తెలిపారు. తనతోపాటు మరికొందరు కూడా బాధ్యత వహించాలని సూచించారు. ప్రధాని నరేంద్రమోదీకి, ఆరెస్సెస్‌కు వ్యతిరేకంగా పోరాడటాన్ని గర్వంగా భావిస్తున్నట్టు రాహుల్ చెప్పారు. 'నేను ఈ దేశాన్ని ప్రేమిస్తున్నా. అందుకే నేను వారితో ఒంటరిగా పోరాడాను. దేశం సంస్థాగత నిర్మాణాన్ని హస్తగతం చేసుకోవాలన్న ఆరెస్సెస్ లక్ష్యం నెరవేరింది. మన ప్రజాస్వామ్యం బలహీనపడింది. ఇకపైనే అసలు ముప్పు ఎదురుకాబోతున్నది. దేశ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు ఇకపై నామమాత్రంగా మారుతాయి' అని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా దేశం మొత్తం ఏకం కావాలని కోరారు. ఈ దిశగా కాంగ్రెస్ కృషిచేయాలని, ఇందుకోసం పార్టీలో అత్యంత వేగంగా పునర్నిర్మాణం జరుగాలన్నారు. భవిష్యత్‌లో (మలివిడుత మోదీ పాలనలో) దేశంలో అంతులేని హింస చెలరేగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ మళ్లీ గెలిచినంత మాత్రాన ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలు అవాస్తవాలైపోవన్నారు. ప్రశ్నించేవారి గొంతును బీజేపీ అణచివేస్తున్నదని, దానిని కాంగ్రెస్ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. తన నిర్ణయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తీసుకోనని మరోమారు స్పష్టం చేశారు. తాను కాంగ్రెస్ పార్టీ సైనికుడినని, భారతమాత బిడ్డనని చెప్పారు. ఊపిరి ఉన్నంత వరకు దేశసేవకు, రక్షణకు అంకితమవుతానని చెప్పారు.



బండ ప్రకాశ్

### దేశద్రోహం చట్టం ఇంకా అవసరమా?

**న్యూఢిల్లీ:** దేశద్రోహం చట్టాన్ని రద్దు చేసే ఆలోచన ప్రస్తుతానికి లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న దేశద్రోహం చట్టం వలస యుగం నాటిదని, దానిని గణతంత్ర దేశంలోని పౌరులపై ఎలా అమలు చేస్తారని రాజ్యసభలో టీఆర్‌ఎస్ సభ్యుడు బండ ప్రకాశ్ ప్రశ్నించారు. దీనికి హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ సమాధానమిస్తూ.. దేశ వ్యతిరేక, వేర్పాటువాద, ఉగ్రవాద శక్తులను ఎదుర్కొనేందుకు ఆ చట్టం ఎంతో అవసరమని చెప్పారు.

# ఉన్నతోద్యోగాల ప్రైవేటీకరణ

### ఐఏఎస్ స్థాయి పోస్టుల్లో ప్రైవేటు నిపుణుల నియామకం

### 40 మందిని భర్తీ చేసుకోవాలని కేంద్రం నిర్ణయం.. లోక్‌సభలో వెల్లడి

### కేంద్ర విద్యాసంస్థలు (టీచర్ల భర్తీలో రిజర్వేషన్) బిల్లుకు ఆమోదం

**న్యూఢిల్లీ, జూలై 3:** డిప్యూటీ సెక్రటరీ, డైరెక్టర్ పోస్టుల్లో ప్రైవేట్ రంగానికి చెందిన 40 మంది నిపుణులను నియమించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ విభాగాలలోని అధికారుల శ్రేణిలో డిప్యూటీ సెక్రటరీ, డైరెక్టర్ పోస్టులను నిర్ణయాలు తీసుకునే కీలకమైన అధికార పదవులుగా పేర్కొంటారు. సాధారణంగా ఈ పదవుల్లో ఐఏఎస్ వంటి గ్రూప్-ఏ అధికారులను, లేదా సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసులలో పదోన్నతి పొందిన వారిని నియమిస్తారు. కానీ, ప్రైవేట్ రంగానికి చెందిన నిపుణులను కూడా ఈ పోస్టుల్లో నియమించాలని నీతి ఆయోగ్ చేసిన సిఫారసు మేరకు తాజా నిర్ణయం తీసుకున్నామని కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ బుధవారం లోక్‌సభకు తెలిపారు. కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గత ఏప్రిల్‌లో ప్రైవేటు రంగానికి చెందిన తొమ్మిది మంది నిపుణులను జాయింట్ సెక్రటరీలుగా ఎంపిక చేసింది. సాధారణంగా ఈ పోస్టుల్లో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను నియమిస్తారు.

**పార్టీల ఎన్నికల ఖర్చు నియంత్రణ ప్రతిపాదనను పరిశీలిస్తున్నాం**

ఎన్నికల సమయంలో అభ్యర్థులకు విధించినట్టుగానే రాజకీయ పార్టీలకు కూడా ఎన్నికల వ్యయంపై సీలింగ్ విధించాలన్న ఎలక్షన్ కమిషన్ (ఈసీ)ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ లోక్‌సభలో చెప్పారు. అభ్యర్థుల ఖర్చుపై పరిమితి విధించినట్టుగానే అన్ని ఎన్నికల్లో రాజకీయ పార్టీలు చేసే ఖర్చులకు కూడా సీలింగ్ విధించాలని ఈసీ ప్రతిపాదించిందని తెలిపారు.

**విదేశీ జైళ్లలో 8,189 మంది భారతీయులు**

విదేశాల్లోని వివిధ జైళ్లలో 8,189 మంది భారతీయులు శిక్షను అనుభవిస్తున్నారని విదేశాంగ శాఖ సహాయ మంత్రి వీ మురళీధరన్ లోక్‌సభకు తెలిపారు. ఒక ప్రశ్నకు ఆయన జవాబునిస్తూ, గల్ఫ్‌లోని ఆరు దేశాల్లో అత్యధికంగా 4,206 మంది భారతీయులు జైళ్లలో ఉన్నారని చెప్పారు. ఒక్క సౌదీ అరేబియాలోని జైళ్లలోనే 1,811 మంది ఉన్నారని తెలిపారు. పాకిస్థాన్‌లోని మైనారిటీ వర్గాల భద్రతకు, వారి రక్షణకు, సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని ఆ దేశ నాయకులను ఎప్పటికప్పుడు కోరుతున్నామని మురళీధరన్ మరో ప్రశ్నకు బదులుగా చెప్పారు. జమ్ముకశ్మీర్‌లో 2014 నుంచి ఇప్పటివరకు 800 మంది ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయని రక్షణ శాఖ సహాయమంత్రి శ్రీపాదనాయక్ తెలిపారు.

### ఏడు వేలకుపైగా అధ్యాపక పోస్టుల భర్తీ!



రమేశ్ పోఖ్రియాల్

కేంద్ర విద్యాసంస్థల్లో అధ్యాపకుల పోస్టుల భర్తీలో యూనివర్సిటీలను, కాలేజీలను ఇకపై విభాగాలుగా కాకుండా యూనిట్‌గా పరిగణిస్తూ రిజర్వేషన్లను కల్పించే బిల్లును ప్రభుత్వం బుధవారం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. చర్చ అనంతరం ఈ బిల్లు ఆమోదం పొందింది. దీనివల్ల సెంట్రల్ యూనివర్సిటీల్లోని ఏడువేల ఖాళీ పోస్టుల భర్తీకి మార్గం సుగమం అయ్యిందని హెచ్‌ఆర్‌డీ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ చెప్పారు. ఈ బిల్లును లోక్‌సభ సోమవారం ఆమోదించింది. ఇదిలాఉండగా, పశ్చిమబెంగాల్ పేరును 'బంగ్లా'గా మార్చాలన్న ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఇంకా కేంద్రం ఆమోదం తెలుపలేదని హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ రాజ్యసభకు చెప్పారు. ఓ రాష్ట్రం పేరు మార్చడానికి రాజ్యాంగ సవరణ అవసరమని, ఇందుకు కావాల్సిన అంశాలన్నింటినీ పరిశీలించిన తరువాత ఒక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రపంచ దేశాల్లో నిరుద్యోగల సంఖ్య అతి తక్కువగా ఉన్నది భారత్‌లోనేనని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి సంతోష్ గంగ్వార్ చెప్పారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) నివేదిక ప్రకారం చైనాలో నిరుద్యోగం 4.7 శాతం కాగా, ఆసియా పసిఫిక్‌లో 4.2 శాతమని భారత్‌లో మాత్రం 3.5 శాతమేనని తెలిపారు. ఇతర దేశాలతో పోల్చినప్పుడు మన దేశంలో నిరుద్యోగుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ తాము సంతృప్తి పడటం లేదని, ఉపాధి అవకాశాలను పెంచేందుకు కృషి చేస్తున్నామని సంతోష్ గంగ్వార్ చెప్పారు.

### మినీ వ్యాను, బస్సు ఢీకొని

## 11 మంది మృతి

### కర్ణాటకలో దుర్ఘటన

**బెంగళూరు:** కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఓ మినీ వ్యాను, ప్రైవేట్ బస్సు ఎదురెదురుగా ఢీకొనడంతో 11 మంది మరణించారు. ఐదుగురు గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. ఈ దుర్ఘటన బుధవారం చిక్కబల్లాపుర జిల్లాలోని చింతామని తాలుకా పరిధిలో చోటుచేసుకుంది. ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కర్ణాటక సీఎం కుమారస్వామి.. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు.



మినీవ్యాన్‌ను ఢీకొన్న బస్సు

# మహారాష్ట్రలో వర్షబీభత్సం

### రత్నగిరిలో ఆనకట్ట తెగి 23 మంది దుర్మరణం

- నీట మునిగిన ఏడు గ్రామాలు
- ప్రవాహంలో కొట్టుకుపోయిన 12 ఇండ్లు
- వాషిం జిల్లాలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు
- ముంబైలో తెరిపినిచ్చిన వర్షాలు



రత్నగిరి జిల్లాలో తివారీ డ్యామ్‌కు గండిపడిన దృశ్యం. (ఇన్‌సెట్‌లో) వరద ధాటికి కూలిన ఇండ్లు

**ముంబై, జూలై 3:** మహారాష్ట్రలో నైరుతి రుతుపవనాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. కుండపోతగా కురుస్తున్న వర్షాలు మూడు రోజుల పాటు ముంబై నగరాన్ని వణికించగా, తాజాగా కొంకణ్ ప్రాంతం కకావికలమైంది. రత్నగిరి జిల్లాలోని ఓ ఆనకట్ట తెగడంతో 23 మంది మృతి చెందారు. వరదలతో ఏడు గ్రామాలు నీటిలో మునిగిపోగా, 12 ఇండ్లు కొట్టుకుపోయాయి. ఇప్పటివరకు 11 మృతదేహాలను వెలికితీశామని అధికారులు చెప్పారు. 20 లక్షల క్యూబిక్ మీటర్ల నీటి సామర్థ్యం ఉన్న చిప్లున్ తాలూకాలోని తివారీ డ్యామ్‌కు మంగళవారం రాత్రి గండి పడిందని అధికారులు చెప్పారు. దీంతో ఒక్కసారి నీరు దిగువకు ప్రవహించడంతో డ్యామ్‌కు సమీపంలో ఉన్న 12 ఇండ్లు కొట్టుకుపోయాయి. వరద నీరు లోతట్టు ప్రాంతాల్లోని ఏడు గ్రామాలను ముంచేసిందని రత్నగిరి అదనపు పోలీస్ సూపరింటెండెంట్ విశాల్ గైక్వాడ్ చెప్పారు. బాధిత గ్రామస్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. డ్యామ్ బీటలు వారడాన్ని తాము గత నవంబర్‌లోనే గుర్తించి, అధికారులకు తెలియజేశామని, అయినా వారు స్పందించలేదని గ్రామస్థులు వాపోయారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇంత ఘోరం జరిగిందన్నారు. వరద నీటిలో గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతున్నదని జాతీయ విపత్తు సహాయ బృందం (ఎన్డీఆర్‌ఎఫ్) అధికారులు చెప్పారు. డ్యామ్ బీటలు వారుతున్న విషయాన్ని మహారాష్ట్ర పాలనా యంత్రాంగానికి తెలిపామని అయినా చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. తివారీ డ్యామ్‌ను 14 ఏండ్ల క్రితం కట్టారని, దానికి బీటలు వారిన విషయాన్ని గ్రామస్థులు ముందుగానే హెచ్చరించారని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి గిరీశ్ మహాజన్ చెప్పారు. వరదకు కొట్టుకుపోయిన ఇండ్లను పునర్నిర్మిస్తామని, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని తెలిపారు. ఈ ఘటనపై సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ విచారణకు ఆదేశించారు. మరోవైపు వాషిం జిల్లాలో కూడా నలుగురు పాఠశాల విద్యార్థులు వరద నీటిలో కొట్టుకుపోయారు. వారిలో ఇద్దరిని రక్షించామని, మరో ఇద్దరి కోసం గాలిస్తున్నామని పోలీసులు చెప్పారు.

**26కు పెరిగిన మలాడ్ మృతుల సంఖ్య**

ముంబైలో మూడురోజులపాటు దంచికొట్టిన వర్షాలు బుధవారం కొంత తెరిపినిచ్చాయి. దీంతో మహానగరం సాధారణ స్థితికి చేరుకుంటున్నది. స్కూళ్లు, కాలేజీలు తిరిగి తెరుచుకున్నాయి. అయితే రోడ్లపై ఇంకా నీరు నిలిచి ఉండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మలాడ్ ప్రాంతంలో గోడ కూలిన ఘటనలో మరణించిన వారి సంఖ్య 26కు చేరింది. వర్షాల కారణంగా పలు ప్రాంతాలలో పట్టాలు నీట మునగడంతో లోకల్ రైళ్ల సేవలను అధికారులు తగ్గించారు. మరోవైపు, దూరప్రాంతాలకు వెళ్లే రైళ్లను పునరుద్ధరించారు. ప్రభుత్వ రవాణా సంస్థకు చెందిన బస్సులు కూడా రోడ్డెక్కాయి. అయితే బుధవారం ఉదయం దాదాపు 75 విమానాలను రద్దు చేశారు. మంగళవారం 203 విమానాలను రద్దు చేసిన సంగతి తెలిసిందే. స్పైస్‌జెట్ విమానం ప్రమాదం కారణంగా అంతర్జాతీయ విమానాశ్రయంలోని ఒక రన్‌వే పాడైందని, దీన్ని పునరుద్ధరించడానికి మరో 48 గంటల సమయం పట్టవచ్చని చెప్పారు.

### ఆ బాలునిది దీర్ఘ 'ఆయుష్'



మలాడ్‌లోని పింప్రీపాడా ప్రాంతంలో రిజర్వాయర్‌కు చెందిన గోడ కూలిన ఘటనలో ఓ ఆరు నెలల బాలుడు ప్రాణాలతో బయటపడ్డాడు. రిజర్వాయర్‌కు చెందిన భారీ గోడ కూలి దాని పక్కనే ఉన్న గుడిసెలపై పడటం.. ఆ వెంటనే గోడకు ఇవతల భారీగా పేరుకుపోయిన వర్షపు నీరు కిందకు ప్రవహించటంతో గుడిసెల్లో నివసిస్తున్న 26 మంది మృతి చెందగా, 70 మందికి పైగా గాయపడ్డారు. అయితే ఆరు నెలల బాలుడు ఆయుష్, అతని తల్లిదండ్రులు మాత్రం అద్భుత రీతిలో ప్రాణాలు దక్కించుకున్నారు. ఆయుష్ తాత, అతని మేనత్త మాత్రం ఈ విపత్తులో ప్రాణాలు కోల్పోయారు.

### ఆకాశం నుంచి

# అథఃపాతాళానికి..!

### పరస్త్రీ వ్యామోహం, మూఢ నమ్మకాలతో

### 'దోశ కింగ్' రాజగోపాల్ పతనం.. ఈ నెల 7నుంచి జీవితఖైదు



రాజగోపాల్

**చెన్నై:** పి.రాజగోపాల్.. 'దోశ కింగ్'గా పేరుగాంచిన వ్యక్తి. శరవణ రెస్టారెంట్ వ్యవస్థాపకులు. దేశంలో రెస్టారెంట్ చెయిన్‌లకు దార్శనికుడు. అట్టడుగు స్థాయి నుంచి ఉన్నత స్థానానికి ఎదిగిన ఆయన ఈనెల 7నుంచి జీవిత ఖైదును అనుభవించబోతున్నాడు. స్వయంకృషితో ఎదిగి.. ఎందరికో ఆదర్శంగా నిలిచిన ఆయన.. పర స్త్రీ వ్యామోహం, మూఢ నమ్మకాల కారణంగా పతనమై పాతాళానికి పడిపోయాడు.

**చిన్న దుకాణం నుంచి దేశవిదేశాల్లో రెస్టారెంట్ల దాకా..**

ఎప్పుడూ తెల్లటి వస్త్రాలు ధరించి, నుదుటిపై తిలకంతో దర్శనమిచ్చే 71 ఏండ్ల రాజగోపాల్.. తమిళనాడులో నిమ్న సామాజిక వర్గానికి చెందిన ఉల్లిపాయల వ్యాపారి కుమారుడు. 1981లో మద్రాసులో (నేటి చెన్నైలో) చిన్న దుకాణాన్ని ప్రారంభించాడు. చాలామంది బయట భోజనం చేసేందుకు ఇష్టపడని ఆ రోజుల్లో రాజగోపాల్ ధైర్యం చేసి తన తొలి రెస్టారెంట్‌ను ఆరంభించాడు. తక్కువ ధరలో రుచికరమైన దోశ, వడ, ఇడ్లీలను మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోకి తెచ్చాడు. తన ఫార్ములా విజయవంతమైంది. దేశవిదేశాలకు శరవణ రెస్టారెంట్ విస్తరించింది. ప్రస్తుతం దేశంలోనే కాకుండా అమెరికా, గల్ఫ్, యూరప్, ఆస్ట్రేలియాలో శరవణ రెస్టారెంట్‌కు 80కిపైగా శాఖలున్నాయి.

**జీవితం తలకిందులు..**

2000 సంవత్సరంలో ఓ జ్యోతిష్యుడి మాటవిని.. తన రెస్టారెంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగి కుమార్తెను తన మూడో భార్యగా చేసుకునేందుకు రాజగోపాల్ విఫలయత్నం చేశాడు. అప్పటికే వివాహమైన ఆ యువతి.. పెండ్లి చేసుకోవడం కుదరదని తెగేసిచెప్పింది. దీంతో ఆమెపై ఒత్తిడి తెచ్చేందుకు రాజగోపాల్ అన్ని ప్రయత్నాలు చేశాడు. కానీ ఏవీ ఫలించలేదు. చివరకు 2001లో ఆమె భర్తను హత్య చేయించాడు. 2004లో కోర్టు ఆయనను దోషిగా తేల్చి..10ఏండ్ల జైలు శిక్ష విధించింది. బాధితులు పై కోర్టులో అప్పీల్ చేయగా.. రాజగోపాల్‌కు కోర్టు జీవితఖైదు విధించింది.

గురువారం
4•7•2019
కరీంనగర్


# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD



SHRIRAM City
MONEY WHEN YOU NEED IT MOST
SHRIRAM CITY UNION FINANCE
₹50,00,000 వరకు
మీ ప్రస్తుత వ్యాపార అభివృద్ధి కొరకు రుణాలు
సంప్రదించండి 040 -30915112
లేదా ఏదేని శ్రీరామ్ బ్రాంచీని
www.shriramcity.in




## వరి కనీస మద్దతు ధర రూ.65 పెంపు

### రూ.1,815కు చేరిన క్వింటాల్ ధర

- నూనెగింజలు, పప్పుధాన్యాలు, తృణధాన్యాల మద్దతు ధరలూ పెంపు
- అదానీకి మూడు ప్రధాన విమానాశ్రయాల నిర్వహణ బాధ్యతలు
- కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు • వేజెస్ కోడ్ బిల్లుకు ఆమోదముద్ర

**న్యూఢిల్లీ, జూలై 3:**

వరి కనీస మద్దతు ధరను (ఎంఎస్పీ) కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.65 (3.7 శాతం) పెంచింది. దీంతో క్వింటాల్ వరి మద్దతు ధర రూ.1,815కు పెరిగింది. బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రి మండలి.. వరితోపాటు నూనె గింజలు, పప్పుధాన్యాలు, ఇతర తృణ ధాన్యాల కనీస మద్దతు ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ఉత్పత్తి వ్యయానికి కనీసం రూ.1.5 రెట్లు అధికంగా ఉండేలా మద్దతు ధరలను నిర్ణయించాలని గతేడాది ప్రభుత్వం ప్రకటించిన మేరకు వీటిని పెంచుతున్నట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్

మిగతా 9వ పేజీలో

### ఉన్నతోద్యోగాల ప్రైవేటీకరణ 2

ఐఏఎస్ స్థాయి పోస్టుల్లో 40 మందిని భర్తీ చేసుకోవాలని కేంద్రం నిర్ణయం

# నకిలీ విత్తనం చిత్తే!

### మురాలపై ఉక్కుపాదం • ఫలితాలనిస్తున్న ముమ్మర తనిఖీలు

- ఈ ఏడాది ఇప్పటికే 43 మంది అరెస్టు • 716 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు స్వాధీనం
- వ్యవసాయాధికారులతో పోలీసుల సమన్వయం
- రాష్ట్రస్థాయిలో తనిఖీలకు 16 ప్రత్యేక బృందాలు



పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు (ఫైల్ ఫొటో)

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రైతులను మోసగించే నకిలీ విత్తన ముఠాలపై ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తున్నది. ఇటువంటివారిపై కఠినంగా వ్యవహరించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో పోలీస్, వ్యవసాయాధికారులు ఉమ్మడిగా దాడులు నిర్వహిస్తున్నారు. నకిలీ విత్తన ముఠాలను ఉక్కుపాదంతో అణచివేసేందుకు తీసుకుంటున్న చర్యలు ఫలితాలనిస్తున్నాయి. వ్యవసాయశాఖ, పోలీస్‌శాఖ అధికారులతో కలిపి ఇప్పటికే ఏర్పాటుచేసిన బృందాలు రాష్ట్ర, జిల్లా, మండలస్థాయిల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ, రైతులు మోసపోకుండా కృషిచేస్తున్నాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు 43 మంది నకిలీ విత్తన విక్రయదారులను అరెస్టుచేసి, 716 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. వర్షాలు ఊపందుకోవడంతో రైతులంతా దుక్కులు దున్నడం, విత్తనాలు సమకూర్చునే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇదే అవకాశంగా తక్కువ ధరకే విత్తనాలు ఇస్తామంటూ నకిలీ ముఠాలు గ్రామాలకు వెళుతున్నట్టు పక్కా సమాచారం సేకరిస్తున్న అధికారులు అటువంటివారిపై దాడులు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్రస్థాయిలో వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిపి 16 ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. నకిలీ విత్తన ముఠాల సమాచారం అందిన వెంటనే ఈ బృందాలు రంగంలోకి దిగుతున్నాయి. ఇవికాకుండా ప్రతి జిల్లాలో జిల్లా వ్యవసాయాధికారి, జిల్లా ఎస్పీలతో టీములను ఏర్పాటుచేశారు. అటు మండలస్థాయిలోనూ మండల వ్యవసాయాధికారి, ఎస్సైలు బృందాలుగా వెళ్లి తనిఖీలు నిర్వహిస్తున్నారు. సోదాలు తీవ్రంగా ఉంటున్న నేపథ్యంలో నకిలీ

మిగతా 4వ పేజీలో

## క్రికెట్‌కు రాయుడు గుడ్‌బై

అనూహ్య నిర్ణయం.. ఐపీఎల్ సహా అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్



వివరాలు ఆటలో



బుధవారం హైదరాబాద్ సైబర్ క్రైం కార్యాలయం వద్ద సినీనటుడు శివాజీ

## చిక్కిన శివాజీ

- టీవీ 9 కేసులో అదుపులోకి..
- విదేశాలకు పారిపోతుండగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టుకున్న పోలీసులు
- సైబర్ క్రైం కార్యాలయానికి తరలింపు
- సీఆర్పీసీ 41 కింద నోటీసు అందజేత
- 11న విచారణకు రావాలని ఆదేశం

5

ధర్మగంట



రెవెన్యూ అధికారులు ఇచ్చిన రసీదు చూపుతున్న వృద్ధ రైతు ఆకుల ముత్తాగౌడ్

## కొత్త పాస్‌బుక్ కోసం.. 43 సార్లు దరఖాస్తు!

- స్పందించని రెవెన్యూ అధికారులు
- ఉన్నతాధికారుల ఆదేశాలు ఖాతరుచేయని తాసిల్దార్
- ఒక్కో పాస్‌బుక్‌కు రూ.25 వేలు డిమాండ్
- నిజామాబాద్ జిల్లా తాళ్లరాంపూర్ రైతు ముత్తాగౌడ్ ఆవేదన
- రైతుబంధుకూ దూరమయ్యానంటున్న అన్నదాత

### కాటారం తాసిల్దార్, ఆర్‌ఐ బదిలీ

'కొత్త పాస్‌పుస్తకానికి రూ.20 లక్షలు!' కథనానికి స్పందన

తాసిల్‌లో విచారణ చేపట్టిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్

8



### మహారాష్ట్రలో వర్షబీభత్సం

- రత్నగిరిలో ఆనకట్ట తెగి 23 మంది దుర్మరణం
- నీటమునిగిన ఏడు గ్రామాలు
- ప్రవాహంలో కొట్టుకుపోయిన 12 ఇండ్లు

2

## రాష్ట్రంలో చారిత్రక ఘట్టం

రేపు కొలువుదీరనున్న 28 జిల్లాల జెడ్పీ చైర్మన్లు

- నేటితో జెడ్పీ చైర్మన్లు, జెడ్పీటీసీల పదవీకాలం పూర్తి
- ముగిసిన ఎంపీపీ అధ్యక్షులు, ఎంపీటీసీల పదవీకాలం
- నేడు 488 మండలాల్లో కొత్త ఎంపీపీల బాధ్యతల స్వీకరణ
- 112 కొత్త మండలాలు, 23 కొత్త జిల్లాల్లో పండుగ వాతావరణం

9



బుధవారం శంషాబాద్ విమానాశ్రయంలో పట్టుబడిన బంగారం

### స్మగ్లర్ల కొత్త జిత్తులు

- ప్రయాణికులను బెదిరించి సౌదీ నుంచి బంగారం అక్రమ రవాణా
- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 6.46 కిలోల బంగారం స్వాధీనం

9







బోనాలకు సిద్ధమైన గోల్కొండ ఎల్లమ్మ జగదాంబిక ఆలయం .. బోనం తెస్తున్న మహిళ

# తొలిబోనం నేడే

- పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రులు
- గోల్కొండ అమ్మవారి బోనాలకు లంగర్‌హౌస్ వద్ద వేదిక ఏర్పాటు
- అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పకడ్బందీ చర్యలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** డప్పు చప్పుళ్లు.. పోతురాజుల విన్యాసాలు.. కళాకారుల ఆట పాటలు.. భక్తుల కోలాహలం మధ్య గోల్కొండ అమ్మవారు గురువారం తొలిబోనం అందుకోనున్నారు. ఆషాఢ మాస బోనాలు చారిత్రాత్మక గోల్కొండకోటపై ఉన్న ఎల్లమ్మ జగదాంబిక ఆలయం నుంచి ప్రారంభమవుతాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీశాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ లంగర్‌హౌస్ చౌరస్తా వద్ద అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం తొట్టెల ఊరేగింపు ప్రారంభమవుతుంది. చోటా బజార్ వద్ద అనంతచారి ఇంట్లో ఆభరణాల అలంకరణ పూర్తి చేసి.. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని దిగంబర్ పంతులు ఇంట్లోకి తీసుకొచ్చి ఒడిబియ్యం పోసి ప్రత్యేక పూజలుచేస్తారు. గోల్కొండ కోటపై ఉన్న జగదాంబిక ఎల్లమ్మ ఆలయం వరకు ఊరేగిస్తారు. ఈ సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. గోల్కొండలో బోనాలు మూడు దఫాలుగా ఈ నెల 4వ, 11వ, 18వ తేదీల్లో నిర్వహిస్తారు. గురువారం ప్రారంభమై తిరిగి గురువారంనాడు వేడుకలు ముగుస్తాయి.

# ఢిల్లీలో బోనాల సంబురాలు

- ఇండియాగేట్ నుంచి తెలంగాణభవన్ వరకు బోనాల ర్యాలీ
- అమ్మవారి ఆశీర్వాదం రాష్ట్ర, దేశ ప్రజలకు దక్కాలి: నామా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఢిల్లీలో బోనాల సంబురాలు అంబరాన్నంటాయి. రాష్ట్ర ప్రభుత్వం, లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారి ఆలయ కమిటీల ఆధ్వర్యంలో బుధవారం ఇండియాగేట్ నుంచి తెలంగాణభవన్ వరకు బోనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం తెలంగాణభవన్‌లో కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించామని టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు చెప్పారు. అమ్మవారి ఆశీర్వాదం రాష్ట్ర, దేశ ప్రజలకు దక్కాలని ఆకాంక్షించారు. బోనాలను రాష్ట్ర పండుగగా సీఎం కేసీఆర్ ప్రకటించడంతో దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందన్నారు. సీఎం కేసీఆర్ ఆయురారోగ్యాలతో, మరింత కాలం సీఎంగా రాష్ట్రానికి సేవచేయాలని అమ్మవారిని ప్రార్థించామని తెలిపారు. ఉత్సవాల్లో టీఆర్‌ఎస్ ఎంపీలు పీ రాములు, బండా ప్రకాశ్, బడుగుల లింగయ్యయాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి రామచంద్రు తేజావత్, తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ వేదాంతంగిరి తదితరులు పాల్గొన్నారు.



ఇండియాగేట్ వద్ద బోనాల ర్యాలీని ప్రారంభిస్తున్న టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు. చిత్రంలో ఎంపీలు పీ రాములు, మన్నె శ్రీనివాస్‌రెడ్డి కూడా ఉన్నారు.



# హలో.. నేను సీఎం కేసీఆర్‌ను..

- చింతమడక సర్పంచ్‌కు ముఖ్యమంత్రి ఫోన్
- గ్రామ సమస్యలపై ఆరా.. అభివృద్ధి చేసుకుందామని భరోసా



**సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ:** తన స్వగ్రామంలోని సమస్యలను తెలుసుకొనేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు స్వయంగా సర్పంచ్‌కే ఫోన్‌చేశారు. సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలంలోని చింతమడక సర్పంచ్ హంసకేతన్‌రెడ్డికి బుధవారం మధ్యాహ్నం ఫోన్‌చేసి సమస్యలపై ఆరా తీశారు. గ్రామ సమస్యలపై వెంటనే నివేదిక రూపొందించాలని సీఎం కేసీఆర్ సూచించారు. గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. త్వరలో సీఎం కేసీఆర్ చింతమడకలో పర్యటించనుండటంతో రెండురోజులుగా జిల్లాస్థాయి అధికారులు గ్రామంలో ప్రత్యేక సమగ్ర కుటుంబ సర్వే చేపట్టారు. గ్రామంలో నివసిస్తున్నవారి వివరాలు సేకరించి, వారి జీవన స్థితిగతులను అధ్యయనం చేస్తున్నారు. అభివృద్ధి పనులపై నివేదికలు రూపొందించనున్నారు. ఇప్పటికే కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి చింతమడక గ్రామాన్ని సందర్శించి సర్వే తీరు గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలపై ఆరాతీశారు. చింతమడకలో సుమారు 600 కుటుంబాలు నివసిస్తున్నాయి.

# రెండువైపులా గోదారి!

- శ్రీశైలం, సాగర్‌కు చెరో టీఎంసీ చొప్పున తరలింపు
- శ్రీశైలం మార్గంలో అవసరమవుతున్న 90 కి.మీ. టన్నెల్
- మూసీ ద్వారా నాగార్జునసాగర్‌లోకి గోదావరి జలాలు
- రెండోరోజూ కసరత్తుచేసిన తెలంగాణ ఇంజినీర్లు
- ఈ నెల ఆరో తేదీన తదుపరి భేటీకి నిర్ణయం



శ్రీశైలం



నాగార్జునసాగర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృష్ణా బేసిన్‌కు గోదావరిజలాల తరలింపుపై తెలంగాణ ఇంజినీర్ల మథనం కొనసాగుతున్నది. మొదటిరోజు శ్రీశైలానికి గోదావరిజలాల తరలింపుపై దృష్టిసారించిన ఇంజినీర్లు.. నాగర్జునసాగర్‌కు తరలించేందుకున్న అవకాశాలపై రెండోరోజు కసరత్తుచేశారు. ప్రాథమికంగా అలైన్‌మెంట్‌ను నిర్ధారించుకున్న కమిటీ.. అంచనా వ్యయాన్ని రూపొందించేందుకు రెండ్రోజుల సమయం తీసుకుని, ఆరోతేదీన మళ్లీ సమావేశంకావాలని నిర్ణయించింది. పోలవరం నుంచి నాగార్జునసాగర్‌కు, తద్వారా శ్రీశైలం జలాశయానికి గోదావరిజలాల తరలింపుపై ఇప్పటికే ఏపీ ఇంజినీర్ల ప్రతిపాదన ఒక కొలిక్కి వచ్చినట్లు తెలుస్తున్నది. పోలవరం నుంచి ప్రకాశం బరాజ్‌కు, అక్కడినుంచి వైకుంఠాపురం బరాజ్‌కు తరలించి, పులిచింతలలో మరో చిన్న లిఫ్టుద్వారా నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్‌లోకి జలాలను ఎత్తిపోయాలనే అలైన్‌మెంట్ ఇప్పటికే రూపొందించారు. సాగర్‌లోకి గోదావరిజలాలు వచ్చిన తర్వాత అవసరమైనపుడు శ్రీశైలం టెయిల్‌పాండ్ ద్వారా గోదావరిజలాల్ని శ్రీశైలంలోకి తరలించుకునే ప్రతిపాదన మెరుగ్గా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ఇంజినీర్లు కూడా కసరత్తును ముమ్మరంచేశారు. నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు నేతృత్వంలోని కమిటీ బుధవారం జలసౌధలో సమావేశమైంది. ఇంటర్‌స్టేట్ సీఈ నర్సింహారావు, నాగార్జునసాగర్ సీఈ నర్సింహ, సీతారామ ప్రాజెక్టు ఎస్‌ఈ నాగేశ్వరరావు, ఇంటర్‌స్టేట్ ఎస్‌ఈ మోహన్‌కుమార్‌తోపాటు విశ్రాంత ఇంజినీర్లు ఎం శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రమౌళి, వెంకట్రామారావు, సత్తిరెడ్డి, భవానీరామ్‌శంకర్ సమావేశమై మంగళవారం ప్రాథమికంగా నిర్ధారించిన అలైన్‌మెంట్‌పైనే చర్చించారు. కాకపోతే శ్రీశైలానికి గోదావరిజలాల్ని తరలించే క్రమంలో నాగార్జునసాగర్‌కు కూడా మళ్లించే అలైన్‌మెంట్‌ను తాజాగా జోడించారు.

## రెండు మార్గాల్లో మళ్లింపు..

ములుగు జిల్లా పరిధిలోని ఒక పాయింట్ వద్ద గోదావరిజలాల్ని మళ్లించాలని ఇప్పటికే ఇంజినీర్లు నిర్ధారించారు. అక్కడినుంచి లక్నవరం, ఆపై డీబీఎం-38 ద్వారా కాకతీయ కాల్వలోకి జలాల్ని తరలిస్తారు. ప్రస్తుతం కాకతీయ కాల్వ 8500 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో ఉన్నది. దీనిని రెండు టీఎంసీల తరలింపునకు అనుగుణంగా వెడల్పు చేయాల్సి ఉంటుందని కమిటీలో చర్చించారు. కాకతీయ కాల్వ నుంచి జలాలు మూసీలోకి, ఆపై నల్లగొండ సమీపంలోని ఉదయసముద్రంలోకి చేరతాయి. ఇక్కడ గోదావరిజలాలు ఒక మార్గంలో నాగార్జునసాగర్‌కు చేరుతాయి. ఉదయసముద్రం అలుగు పోయడంతో అడవిదేవులపల్లి చెరువుద్వారా జలాలు నాగార్జునసాగర్‌లోకి వెళుతాయి. ఇలా ఒక్క టీఎంసీ నీటిని తరలించాలని ఇంజినీర్లు భావిస్తున్నారు. ఉదయసముద్రం దగ్గరే మరో మార్గం ద్వారా శ్రీశైలంకు తరలించే అలైన్‌మెంట్‌పైనా కమిటీ చర్చించింది. నల్లగొండ సమీపంలోని చర్లపల్లి వద్ద జలాల్ని మళ్లించి.. కనగల్, డిండి మీదుగా ఎల్లూరు దగ్గర శ్రీశైలం జలాశయంలో పోయాలని భావిస్తున్నారు. అయితే ఇందుకు దాదాపు 90 కిలోమీటర్ల మేర సొరంగమార్గాన్ని నిర్మించాల్సివస్తుందని ఇంజినీర్లు గుర్తించారు. ఈ అలైన్‌మెంట్‌కు అనుగుణంగా ప్రాజెక్టును చేపడితే దాదాపు రూ.70-80 వేల కోట్ల వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నా రు. దీనిపై రెండ్రోజులు కసరత్తు చేసి లైన్ ఎస్టిమేట్ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

#### శ్రీజగదాంబిక మహంకాళి ఆలయ

# పునరుద్ధరణ కమిటీ ఏర్పాటు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వ కార్యదర్శి అనిల్‌కుమార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శ్రీ జగదాంబిక మహంకాళి ఆలయ పునరుద్ధరణ కమిటీని ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ కార్యదర్శి వీ అనిల్‌కుమార్ బుధవారం తెలంగాణ చారిటబుల్, హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్ అండ్ ఎండోమెంట్ యాక్ట్- 1987 ప్రకారం ఉత్తర్వులిచ్చారు. గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి దేవాలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులుగా 25 మంది పేర్లను ఉత్తర్వులో వెల్లడించారు. కమిటీ సభ్యులుగా ఎస్ సదానంద్‌కుమార్, కే ప్రభాకర్‌రాజు, జీ నర్మద, బీ సత్యనారాయణగౌడ్, కే సంగీత, గండికోట సంతోష్, అత్తాపూర్ రాజేశ్‌కుమార్, ఎం ఉమేశ్‌కుమార్, కే బాలాజి, కే కేశవ్, కే మనోజ్, టీ శివశంకర్, మేకల రాజేందర్‌యాదవ్, గోపిరెడ్డి వసంత్‌రెడ్డి, కోయల్కార్ శ్రీనివాస్, కేసారం అరుణ్‌కుమార్, మంత్రి మనోహర్, సోల విజయలక్ష్మి, దాసరి అనిత, మున్నూరు భానుచందర్, చిట్టం భాగ్యలక్ష్మి, అమ్రం పుష్పలత, వడ్ల ఉమ, టీ లహరి ఉన్నారు.

## విజిలెన్స్ కమిషనర్ అదనపు కార్యదర్శిగా జీ కృష్ణవేణి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విజిలెన్స్ కమిషనర్ అదనపు కార్యదర్శిగా జీ కృష్ణవేణి నియమితులయ్యారు. పర్యావరణ, అటవీశాఖలో అదనపు కార్యదర్శిగా పనిచేస్తున్న ఆమెను డిప్యుటేషన్‌పై నియమిస్తూ సీఎస్ ఎస్కే జోషి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

# బయ్యారంపై సమగ్ర నివేదిక ఇవ్వండి

- మెకాన్, ఆర్వీఎన్‌ఎల్ సంస్థలకు అధికారుల కమిటీ ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన సమగ్ర నివేదికను అందించాలని మెకాన్, రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్వీఎన్‌ఎల్) సంస్థలను ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీ ఆదేశించింది. సచివాలయంలో బుధవారం కమిటీ చైర్మన్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్ మిశ్రా అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ కన్వీనర్, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, సభ్యులు గనులశాఖ డైరెక్టర్ బీఆర్‌వీ సుశీల్‌కుమార్, సింగరేణి సీఎండీ శ్రీధర్ పాల్గొన్నారు. మెకాన్ సంస్థ, ఆర్వీఎన్‌ఎల్ సంస్థల ప్రాథమిక నివేదికలో విషయాలు పూర్తిగా లేకపోవడంతో, మరింత సమాచారంతో సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. సమగ్ర నివేదిక అందిన తర్వాత మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలంటూ ప్రభుత్వం గత ఏడాది జూన్ 18న ఐదుగురు ఉన్నతాధికారులతో కమిటీని నియమించింది. 12 అంశాలపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఈ కమిటీకి సూచించింది. ఈ నేపథ్యంలో కీలక అంశాలపై నివేదిక ఇవ్వాలని మెకాన్ సంస్థకు బాధ్యతలు అప్పగించింది. ఐరన్‌ఓర్ తరలింపునకు అవసరమైన రైలుమార్గం ఏర్పాటుపై నివేదిక ఇవ్వాలని ఆర్వీఎన్‌ఎల్ సంస్థకు బాధ్యతలు అప్పగించింది.

### ముహూర్తం



సూర్యోదయం: 5.50 గంటలకు



సూర్యాస్తమయం: 6.51 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, విదియ రాత్రి 7.11 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: పుష్యమి, అమృతఘడియలు: రాత్రి 8.41 నుంచి 10.17 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.58 నుంచి 3.36 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.23 నుంచి సాయంత్రం 5.07 వరకు, వర్జ్యం: ఉదయం 11.56 నుంచి మధ్యాహ్నం 1.32 వరకు.

# రెండ్రోజులు ఓ మోస్తరు వర్షాలు

## చురుకుగా రుతుపవనాల కదలిక

- వీటి ప్రభావంతోనే వానలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గాలిలో తేమ పెరిగి నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయని, వీటి ప్రభావంతోనే రాష్ట్రవ్యాప్తంగా వానలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు వెల్లడించారు. రాగల 48 గంటల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. ప్రస్తుతం ఈశాన్య మధ్యప్రదేశ్ దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కేంద్రీకృతమైందని, దానికి అనుబంధంగా ఉత్తర కోస్తాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు దగ్గరలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని చెప్పారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం తెలంగాణ రాష్ట్రంపై లేదని తెలిపారు. ఉపరితల ఆవర్తనం ప్రభావం కూడా బుధవారం తగ్గిపోయిందని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు రాష్ట్రంలో చాలాచోట్ల మోస్తరు వానలు పడగా, ఉత్తర తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదైంది. కొన్నిచోట్ల 7 నుంచి 8 సెంటీమీటర్ల వాన కురిసింది. నిజామాబాద్ జిల్లా ఎడపల్లిలో అత్యధికంగా 88.5 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, అదే జిల్లాలోని సరోరలో 70.8 మి.మీ., మదన్‌పల్లిలో 66.3 మి.మీ., సిరికొండలో 54.8 మి.మీ., భీమన్‌పల్లిలో 47 మి.మీ., గన్నారంలో 46.5 మి.మీ., నిజామాబాద్ టౌన్‌లో 59.5 మి.మీ., కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో 66.5 మి.మీ., ఆదిలాబాద్‌లోని చాలా ప్రాంతాల్లో 4 నుంచి 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

### గురు, శుక్రవారాల్లో గ్రేటర్ హైదరాబాద్‌లో వానలు

గ్రేటర్ హైదరాబాద్‌లో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. రవీంద్రభారతి, సచివాలయం, సోమాజిగూడ, బంజారాహిల్స్, ఖైరతాబాద్, నాంపల్లి, అబిడ్స్, అమీర్‌పేట, పంజాగుట్ట తదితర ప్రాంతాల్లో మోస్తరు వాన పడింది. రుతుపవనాలు చురుకుగా కదులుతున్న నేపథ్యంలో గురు, శుక్రవారాల్లో (రాగల 48 గంటల్లో) గ్రేటర్‌లోని పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. వర్షం కారణంగా నగరంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలో నమోదవుతున్నాయి. బుధవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 32.1 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 23 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 80 శాతంగా నమోదైందని వాతావరణ అధికారులు వెల్లడించారు.



ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం ఖడ్కి కల్వర్టుపై పారుతున్న వరదనీరు

### రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం తేలికపాటి వర్షాలు పడ్డాయి. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి, ఇందల్వాయి, మోపాల్, ఆర్మూరు, బాల్కొండ ప్రాంతాల్లో వాతావరణం మేఘావృతమై చిరుజల్లులు కురిశాయి. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి భారీ నష్టం వాటిల్లింది. నార్నూర్ నుంచి గాదిగూడ వెళ్లే ప్రధాన రహదారి మీద కల్వర్టుల పైనుంచి వరదనీరు పారడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గాదిగూడ మండలంలోని లోకారి (కే) గ్రామ సమీపం వద్ద నిర్మిస్తున్న వంతెన వద్ద వేసిన మట్టికట్ట కోతకు గురై చుటుపక్కల పంటపొలాల్లో వరదనీరు నిలిచింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలుచోట్ల ఓ మోస్తరు నుంచి సాధారణ వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడలో 14.3 మి.మీ., మహబూబ్‌నగర్‌లో 5.3 మి.మీ., భూత్పూర్‌లో 3.5 మి.మీ., నారాయణపేట జిల్లా చిన్నజట్రంలో 9.8 మి.మీ., గుండుమాల్ 8.8 మి.మీ. వర్షపాతం రికార్డయింది. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరులో ఓ మోస్తరు వర్షం పడగా, కొండారెడ్డిపల్లిలో 5 మి.మీ., వనపర్తి జిల్లా మదనాపూర్, గోపాల్‌పేట, వనపర్తి మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్, రాజాపూర్, నవాబ్‌పేట, జడ్చర్ల, కోయిలకొండ, చిన్నచింతకుంట మండలాల్లోనూ తేలికపాటి వర్షం పడింది. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్, అయిజ మండలాల్లోని పలుచోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

# త్వరలోనే సీఎస్‌ల భేటీ

విభజన అంశాలపై నాటి ఏపీ సర్కార్ చిక్కుముడి

- ఫైళ్ల తయారీలో మరుగునపడిన వాస్తవాలు
- సమగ్ర ప్రతిపాదనలకు మరింత అధ్యయనం అవసరం
- అందుకే సమావేశం వాయిదా కోరామన్న ఏపీ వర్గాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బుధవారం రద్దయిన తెలంగాణ, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల సమావేశం అతిత్వరలోనే జరిగే అవకాశాలున్నాయి. విభజన సమస్యలపై సాంకేతిక అంశాల అధ్యయనానికి ఏపీ కొత్త ప్రభుత్వానికి మరికొంత సమయం కావాల్సి వచ్చిందని, కనుక సమావేశాన్ని కొన్నిరోజులు వాయిదావేయాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం గవర్నర్ నరసింహన్‌ను మంగళవారం బాగా పొద్దుపోయిన తర్వాత కోరారు. అతికొద్ది సమయంలోనే సమావేశానికి పూర్తి వివరాలతో వస్తామని తెలిపారు. ఏపీ సీఎస్ విజ్ఞప్తి మేరకు సమావేశాన్ని గవర్నర్ వాయిదావేశారు. విభజన అంశాలను వేగంగా పరిష్కరించుకోవాలని, ఇందుకు 15 రోజులు గడువు పెట్టుకోవాలని ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కే చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించిన విషయం తెలిసిందే. తదుపరి చర్చలకు మార్గదర్శకాలు కూడా ఇచ్చారు. ఈ క్రమంలోనే సీఎస్‌లు ఒక దఫా సమావేశమయ్యారు. తమ తమ రాష్ట్రాల్లో వివిధ శాఖల అధికారులతోనూ సమీక్షించారు. వాటి ఆధారంగా బుధవారం గవర్నర్ సమక్షంలో రాజ్‌భవన్‌లో ఇరు రాష్ట్రాల సీఎస్‌లు భేటీకావాల్సి ఉన్నది. తెలంగాణ అధికారులు సమగ్ర నివేదికలతో సిద్ధమైనా, ఏపీ అధికారులు మాత్రం పూర్తిస్థాయిలో సిద్ధంకాలేదు. గతంలో అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం గిల్లికజ్జాలకు వెళ్లింది. 9, 10 షెడ్యూల్ సంస్థల విభజన అంశంతోపాటు నిధులు, నీళ్ల పంపకాల్లోనూ వితండవాదాలు చేసింది. ఫైళ్లన్నీ ఆనాటి ప్రభుత్వ అభిప్రాయానికి అనుగుణంగానే తయారుచేయాల్సి రావడంతో వాస్తవాలు మరుగునపడ్డాయి. దీంతో వాటిని అధ్యయనం చేయటానికి ఏపీ కొత్త ప్రభుత్వానికి తగినంత సమయం లభించలేదని ఏపీ అధికారవర్గాలు చెప్తున్నాయి. పైగా ప్రస్తుత ప్రభుత్వ సానుకూల వైఖరికి అనుగుణంగా, విభజన చట్టం వెలుగులో విధానపరమైన అంశాలను రూపొందించాల్సి ఉన్నందున పూర్తిస్థాయి నివేదికల తయారీలో ఏపీ అధికారులకు ఇబ్బందులు ఎదురైనట్టు తెలుస్తున్నది. అయినా నిరంతరాయంగా వివిధ అంశాలపై లోతుగా అధ్యయనం కొనసాగిస్తూ.. ప్రతిపాదనలు తయారుచేస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలో ఎదురైన ఇబ్బందులను గవర్నర్‌కు ఏపీ సీఎస్ వివరించినట్టు తెలిసింది. పరిస్థితిని అర్థంచేసుకున్న గవర్నర్ సమావేశాన్ని వాయిదావేశారు. అదే విషయాన్ని తెలంగాణ సీఎస్‌కు గవర్నర్ కార్యాలయం తెలియజేసింది. తాము ఈ రెండ్రోజులు విభజన సమస్యలపైనే కసరత్తు చేసి, నిర్దిష్ట ప్రతిపాదనలు రూపొందించామని, ఎప్పుడు సమావేశం ఏర్పాటుచేసినా వస్తామని గవర్నర్ కార్యాలయానికి తెలంగాణ సీఎస్ తెలిపారు. కాగా ఏపీ అధికారులు రెండు, మూడ్రోజుల్లో పూర్తిస్థాయి ప్రతిపాదనలతో వస్తామని గవర్నర్‌కు చెప్పినట్లు సమాచారం. మూడు లేదా నాలుగు రోజుల తర్వాత ఇరు రాష్ట్రాల సీఎస్‌ల సమావేశం ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.

### లోకం పోకడ




పార్టీ పగ్గాలు యువతకిచ్చినా, వృద్ధులకిచ్చినా లాభం లేదు మేడం.. బాలలకిచ్చి చూద్దామా?!

# జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ల నియామకం

మార్గదర్శకాలు జారీచేసిన ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ ఏ అశోక్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో 2019-20 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ల పోస్టులను గెస్ట్ లెక్చరర్లతో భర్తీచేయడానికి ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ ఏ అశోక్ బుధవారం మార్గదర్శకాలను జారీచేశారు. నియామక బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. సంబంధిత సబ్జెక్టులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేయడంతోపాటు మెరిట్ మార్కులు సాధించినవారితో పోస్టులను భర్తీచేయాలని పేర్కొన్నారు. దీనిక్లి కలెక్టర్ చైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్, సంబంధిత జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సభ్యులుగా జిల్లా కమిటీలను ఏర్పాటుచేయనున్నారు. కళాశాలలవారీగా ఖాళీలు గుర్తించి శుక్రవారం (ఈ నెల 5)లోగా వెల్లడించాలని, 6, 7 తేదీల్లో స్థానిక దినపత్రికల్లో ప్రకటన ఇచ్చి, దరఖాస్తుల స్వీకరణకు 14 వరకు గడువు విధించారు. ఈ నెల 17న మెరిట్ మార్కుల వారీగా జాబితాలు సిద్ధంచేసి, 20న కమిటీ దరఖాస్తులు తనిఖీ చేయాలని, 22న గెస్ట్ లెక్చరర్లను కేటాయించి, ఎంపికైనవారు కళాశాలల్లో రిపోర్టు చేయడానికి 23 వరకు గడువు విధించారు. పూర్తి వివరాలకు www.cie.telangana.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

# నకిలీ విత్తనం చిత్తే!


మూడోపేజీ తరువాయి...


విత్తన విక్రయ ముఠాలు తెలంగాణ గ్రామాల్లోకి వచ్చేందుకు జంకుతున్నాయి.

### తక్కువ ధరకు ఇస్తామంటూ రైతులకు వల

తక్కువ ధరకు విత్తనాలు ఇస్తామంటూ నకిలీ విత్తన విక్రయ ముఠాలు రైతులను బురిడీకొట్టిస్తున్నాయి. ఎక్కువ మొత్తంలో పత్తి, మిర్చి విత్తనాలను అంటగట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ ముఠాల్లో కొన్ని ఎలాంటి అనుమతి లేకుండానే విడి విత్తనాలు తెచ్చి ప్యాకెట్లుగా చేసి వాటిని రైతులకు అంటగడుతున్నాయి. హెచ్‌టీ (హెర్బిసైడ్ టోలరెంట్) పత్తి విత్తనాలు విక్రయించేందుకు మరికొన్ని ముఠాలు ప్రయత్నిస్తున్నాయి. గతేడాది మిగిలిపోయిన విత్తనాలను తిరిగి ప్యాకెట్లుగాచేసి వాటిని రైతులకు తక్కువ ధరలకు విక్రయిస్తున్న ముఠాలు కూడా ఉన్నాయి. ఈ ముఠాలన్నీ ఏజెంట్లను పెట్టుకుని గ్రామాల్లో రైతులకు విత్తనాలు చేరవేసేవి. అయితే.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే నకిలీ విత్తన ముఠాలపై యుద్ధం ప్రకటించడంతో రాష్ట్రంలో నకిలీ విత్తన ముఠాలు క్రమంగా తోకముడుస్తున్నాయి. అధికారుల ముమ్మర తనిఖీలతో తెలంగాణ జిల్లాల్లోకి వచ్చేందుకు జంకుతున్నాయి. 2017లో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న 49 మందిని అరెస్టుచేయగా, 2018లో 44 మంది అరెస్టు అయ్యారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 43 మందిని పోలీసులు అరెస్టుచేశారు. 716 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు సీజ్ చేశారు. పట్టుబడినవాటిలో ప్రధానంగా పత్తివిత్తనాలే ఉంటున్నాయి.

### ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నాం



నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠినచర్యలు తీసుకుంటున్నాం. వ్యవసాయ శాఖ, పోలీస్ అధికారులతో కలిపి రాష్ట్రస్థాయిలో 16 ప్రత్యేక బృందాలు, జిల్లాస్థాయిలో బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. పరిస్థితి చాలావరకు అదుపులోకి వచ్చింది.

**- నాగిరెడ్డి, నార్త్‌జోన్ ఐజీ**

### పట్టుబడిన విత్తనాలు, కేసుల వివరాలు

| అంశం | 2017 | 2018 | 2019 |
|---|---|---|---|
| అరెస్టు అయిన వ్యక్తులు | 49 | 44 | 43 |
| 6ఎ సెక్షన్ కింద కేసులు (నిషేధిత, అనుమతిలేని విత్తనాలు విక్రయించేవారిపై) | 50 | 03 | 06 |
| క్రిమినల్ కేసులు | 50 | 45 | 20 |
| పీడీ యాక్ట్ | 05 | 0 | 0 |
| స్వాధీనం చేసుకున్న విత్తనాలు (క్వింటాళ్లలో) | 6765 | 2218 | 716 |
| అనుమానిత విత్తనాల పట్టివేత (క్వింటాళ్లలో) | 24345 | 2180 | 56,160 |

## భద్రకాళి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు ప్రారంభం



**మట్టెవాడ (వరంగల్ అర్బన్):** రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన వరంగల్ శ్రీ భద్రకాళీ అమ్మవారి శాకంబరీ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సహస్రకలశాభిషేకం ఆలయ ప్రదానార్చకులు భద్రకాళీ శేషు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. అమ్మవారిని ఉదయం కాళీ క్రమంలో, సాయంత్రం కామేశ్వరీ క్రమంలో అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో ఆర్ సునీత తెలిపారు.

## 14న బెజవాడ దుర్గమ్మకు బంగారు బోనం

**ప్రత్యేక ఏర్పాట్లుచేయాలని ఏపీ సీఎస్‌కు ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ వినతి**

**చార్మినార్:** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను దశదిశలా చాటేలా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు పొట్టేల్ శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. ఈ నెల 14న ఏపీలోని విజయవాడ కనకదుర్గ అమ్మవారికి బంగారు బోనం సమర్పించనున్నామని తెలిపారు. ఇందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని కోరుతూ బుధవారం ఆయన ఏపీ సీఎస్‌కు వినతిపత్రం సమర్పించారు. సీఎస్‌ను కలిసినవారిలో ఉమ్మడి దేవాలయాల మాజీ అధ్యక్షుడు గాజుల అంజయ్యతోపాటు కమిటీ సభ్యులు ప్యారసాని వెంకటేశ్ తదితరులు ఉన్నారు. ఆషాఢమాస బోనాల సందర్భంగా పాతనగరంలోని ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో సప్త మాతృలకు బంగారు బోనాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. అందులోభాగంగా గురువారం గోల్కొండ కోటలో వెలసిన జగదాంబ అమ్మవారికి బంగారు బోనం సమర్పించనున్నామని వెల్లడించారు.



ఆంధ్రప్రదేశ్ సీఎస్ ఎల్వీ సుబ్రమణ్యానికి వినతిపత్రం అందిస్తున్న ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులు



మంత్రి నిరంజన్‌రెడ్డికి డివిడెండ్ చెక్కు అందజేస్తున్న గిడ్డంగుల సంస్థ చైర్మన్ సామేలు

## లాభాల్లో గిడ్డంగుల సంస్థ

- 2017-18లో లాభం 26.74 కోట్లు.. 3.5 కోట్లు డివిడెండ్
- మంత్రి నిరంజన్‌రెడ్డికి చెక్కు అందజేసిన చైర్మన్ సామేలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర గిడ్డంగుల సంస్థ 2017-18 సంవత్సరానికిగాను రూ.26.74 కోట్ల లాభాలను ఆర్జించింది. ఇందులో డివిడెండ్ కింద రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే రూ.1.75 కోట్ల చెక్కును బుధవారం సచివాలయంలో వ్యవసాయమంత్రి నిరంజన్‌రెడ్డికి రాష్ట్ర గిడ్డంగులసంస్థ చైర్మన్ మందుల సామేలు అందించారు. రూ.26.74 కోట్ల లాభాల్లో రూ.3.5 కోట్లు డివిడెండ్‌గా ప్రకటించారు. దానిలో 50% రాష్ట్ర ప్రభుత్వానికి, 50% కేంద్ర గిడ్డంగుల సంస్థకు అందించడం ఆనవాయితీ. లాభాలు గడించేందుకు సహకరించిన చైర్మన్ సామేలు, ఎండీ భాస్కరాచారితోపాటు అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు. సంస్థలో 50 మందిని నియమించాలని మంత్రి దృష్టికి మందుల సామేలు తీసుకెళ్లారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది.

# త్వరలో పోడు పరిష్కారం

- సమస్య ఉన్న జిల్లాల్లో కేసీఆర్ పర్యటిస్తారు
- రాష్ట్ర అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- గాయపడిన ఎఫ్‌ఆర్వో అనితకు మంత్రి పరామర్శ



ఎఫ్‌ఆర్వో అనితను పరామర్శిస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

**బోథ్, నమస్తే తెలంగాణ:** దశాబ్దాలుగా పోడుభూముల సమస్య ఉన్నదని, త్వరలోనే ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పోడు భూముల సమస్య ఉన్న జిల్లాల్లో పర్యటించి పరిష్కరించనున్నారని రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖల మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి చెప్పారు. బుధవారం సాయంత్రం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కోటా (కే) గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుతో కలిసి కాగజ్‌నగర్ అటవీ రేంజి అధికారి చోలె అనితను మంత్రి పరామర్శించారు. ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని అనితను, ఆమె కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు కింద అటవీశాఖ కోల్పోయిన భూమికి బదులుగా ప్రభుత్వం కాగజ్‌నగర్ రేంజి పరిధిలోని భూమిని కేటాయించిందని, ఆ భూమిలో మొక్కలు నాటేందుకు వెళ్లిన అటవీ అధికారులపై దాడులకు పాల్పడటం సరైన విధానం కాదన్నారు. అటవీ అధికారుల విధులకు ఆటకం కలిగించడంతోపాటు దాడిచేసిన వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకొంటామని తెలిపారు. బాధ్యులను ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, సంఘటనపై పూర్తి విచారణ చేయిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రతి ఏటా జూన్, జూలై నెలల్లో పోడు వ్యవసాయ భూముల సమస్య వస్తున్నదని, పంటలు వేయడం పూర్తికాగానే సమస్య సద్దుమణుగుతున్నదని చెప్పారు. మంత్రి వెంట సీఎఫ్ వినోద్‌కుమార్, డీఎఫ్‌వో ప్రభాకర్, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### 12 మందికి రిమాండ్



దాడికి పాల్పడిన పోడు సాగుదారులు

**ములకలపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండల పరిధిలోని గుండాలపాడులో సోమవారం రాత్రి పెట్రోలింగ్‌కు వెళ్లిన అటవీ శాఖ అధికారులపై దాడికి పాల్పడిన ఘటనలో నిందితులైన 12 మంది పోడు సాగుదారులను పోలీసులు అరెస్టుచేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. వీరిలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు నూపా భాస్కర్, పోడు సాగుదారులు కారం ఎర్రయ్య, కారం వెంకటేశ్వర్లు, కుర్సం పంతులు, కట్టం కోసయ్య, మడివి సునీల్, కుర్సం ముఖేష్, చుక్కా శ్రీను, కణితి రాజు, కణితి భద్రమ్మ, కారం దూలయ్య, పోతుగంటి లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

## మక్కల దిగుమతికి అనుమతివ్వండి

- పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకోండి: లోక్‌సభలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో మక్కజొన్న కొరతతో పౌల్ట్రీ పరిశ్రమ సంక్షోభంలో ఉందని చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి తెలిపారు. జీడీపీకి లక్ష కోట్ల రూపాయలను అందించే పరిశ్రమను తెలంగాణ మినహా కేంద్రంతోపాటు అనేక రాష్ట్రాలు పట్టించుకోవడంలేదని, సహాయాన్ని అందించడంలేదని పేర్కొన్నారు. లోక్‌సభలో బుధవారం ఆయన జీవో అవర్‌లో మాట్లాడుతూ.. ఈ పరిశ్రమను ఆదుకోవడానికి తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మొదటగా చొరవచూపారని తెలిపారు. గుడ్ల ఉత్పత్తిలో ప్రపంచంలోనే మనది మూడో అతిపెద్ద దేశమని, చికెన్ ఉత్పత్తిలో ఐదో పెద్ద దేశమని, ఇంత పెద్ద పరిశ్రమపై ఎవరూ స్పందించడంలేదని విచారం వ్యక్తంచేశారు. పౌల్ట్రీ పరిశ్రమ రైతుల ఆదుకొనేందుకు మొక్కజొన్నలను ఇతర దేశాలనుంచి దిగుమతి చేసుకోవడానికి అనుమతివ్వాలని కోరారు. 1989-90లో పౌల్ట్రీ పరిశ్రమ సంక్షోభంలో ఉన్నప్పుడు నాఫెడ్ సంస్థ గుడ్లను కొనుగోలు చేసి కోల్డ్‌స్టోరేజిల్లో పెట్టిందని గుర్తుచేశారు.

## ఎట్టకేలకు చిక్కిన నటుడు శివాజీ

- టీవీ 9 కేసులో అదుపులోకి..
- విదేశాలకు పారిపోతుండగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టుకున్న పోలీసులు
- సీఆర్పీసీ 41 కింద నోటీసు అందజేత
- 11న విచారణకు రావాలని ఆదేశం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అలంద మీడియా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సినీనటుడు శొంఠినేని శివాజీ దేశం విడిచి వెళ్లేందుకు ప్రయత్నించి బుధవారం సైబరాబాద్ పోలీసులకు చిక్కాడు. టీవీ 9 కొత్త యాజమాన్యం ఆ సంస్థ మాజీ సీఈవో రవిప్రకాశ్, నటుడు శివాజీ మరికొందరిపై సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదుచేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడు రవిప్రకాశ్ పోలీసుల ఎదుట విచారణకు హాజరైనప్పటికీ.. మరో నిందితుడైన శివాజీ ఇప్పటివరకు హాజరుకాలేదు. దీంతో పోలీసులు శివాజీపై లుక్‌అవుట్ నోటీసులు జారీచేశారు. రెండునెలలుగా అజ్ఞాతంలో ఉన్న శివాజీ.. మంగళవారం రాత్రి అమెరికా వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రావడాన్ని గమనించిన ఇమ్మిగ్రేషన్ అధికారులు సైబరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు విమానాశ్రయానికి చేరుకొని శివాజీని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సైబర్ క్రైం కార్యాలయానికి తీసుకొచ్చారు. దేశం విడిచి వెళ్లకుండా ఆయన పాస్‌పోర్టును సీజ్‌చేసినట్టు తెలిసింది. గతంలో ఇచ్చిన నోటీసులకు శివాజీ స్పందించకపోవడంతో సీఆర్పీసీ 41 కింద మరోమారు ఆయనకు నోటీసులు అందజేశారు. నోటీసులు అందుకున్న అనంతరం ఆయన కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. ఈ నెల 11న తమ ఎదుట విచారణకు హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నట్టు పోలీస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. శివాజీని అరెస్టుచేయడం లేదని, విచారణకు హాజరైన తర్వాత అవసరమైన సమాచారాన్ని సేకరిస్తామని అధికారులు వెల్లడించారు.

## వానలొచ్చాక సబ్సిడీ గొర్రెల పంపిణీ

- సబ్సిడీ గొర్రెలు, బర్రెలకు టెండర్ల పద్ధతి ప్రతిపాదనలు పంపలేదు
- రాష్ట్ర గొర్రెల మేకల అభివృద్ధి సహకార సమాఖ్య ఎండీ లక్ష్మారెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వేసవిలో తీవ్ర ఎండ, వడగాడ్పుల కారణంగా సబ్సిడీ గొర్రెల పంపిణీకి తాత్కాలికంగా విరామం ప్రకటించామని, వర్షాలు మొదలైన వెంటనే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గొర్రెల పంపిణీని తిరిగి చేపడుతామని రాష్ట్ర గొర్రెల మేకల అభివృద్ధి సహకార సమాఖ్య ఎండీ డాక్టర్ వీ లక్ష్మారెడ్డి తెలిపారు. గొర్రెలు, బర్రెల కొనుగోలుకు ఇక టెండర్లు అంటూ బుధవారం వివిధ దినపత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవంలేదని ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. గొర్రెలు, బర్రెల పథకాలను టెండర్ల ద్వారా అమలుచేయడం, సబ్సిడీ సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో వేయడంవంటి ప్రతిపాదనలను పశుసంవర్ధకశాఖగానీ, సమాఖ్యగానీ ప్రభుత్వానికి పంపలేదని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

## బీట్ ఆఫీసర్ల నియామకానికి ఓకే

- సిబ్బంది లేక అటవీభూములు ఆక్రమణకు గురవుతున్నాయని వ్యాఖ్య
- కోర్టు ఉత్తర్వులపై అటవీఅధికారుల హర్షం
- సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు.. ఇక వందశాతానికి అటవీశాఖ స్ట్రెంత్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఎస్‌పీఎస్సీ చేపట్టిన 1857 మంది ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల నియామకాలకు హైకోర్టు బుధవారం పచ్చజెండా ఊపింది. ఈ నియామకాలపై ఇప్పటివరకు ఉన్న రూల్ 6ఏ ప్రొసీజర్‌ను పూర్తిచేసిన తర్వాతే నియామకాలు చేపట్టాలన్న సింగిల్ జడ్జి ధర్మాసనం ఉత్తర్వులను డివిజన్‌బెంచ్ ఎత్తేసింది. టీఎస్‌పీఎస్సీ నిబంధనల్లోని రూల్ 6ఏ పాటించలేదంటూ పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. రూల్ 6ఏ ప్రొసీజర్‌ను పూర్తి చేసిన తర్వాతే నియామకాలు చేపట్టాలని సింగిల్ బెంచ్ ధర్మాసనం పేర్కొన్నది. దీనిపై టీఎస్‌పీఎస్సీ డివిజన్‌బెంచ్‌లో అప్పీల్ చేసింది. బుధవారం దీనిపై చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్‌చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇంత భారీ మొత్తంలో పోస్టులను ఖాళీగా ఉంచడం సరికాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అటవీశాఖలో సరిపడినంతమంది అధికారులు, సిబ్బందిలేక భారీగా అటవీభూములు ఆక్రమణకు గురవుతున్నాయని, భూముల ఆక్రమణలకు సంబంధించి ఇటీవల వెలువడిన వార్తలు తమ దృష్టిలో ఉన్నాయని ధర్మాసనం పేర్కొన్నది.

**సీఎం కేసీఆర్‌కు అటవీశాఖ కృతజ్ఞతలు..**

1857 మంది ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల నియామకానికి హైకోర్టు ఆమోదముద్ర వేయడంపై అటవీశాఖ హర్షం వ్యక్తంచేసింది. 67 ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, 90 ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, 1857 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల నియామకం చేపట్టినందుకు అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రేంజ్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు ఇప్పటికే శిక్షణలో ఉన్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీసహా అటవీశాఖలో ఇప్పటివరకు ఇదే అతిపెద్ద నియామకమని.. ఈ నియామకాలతో అటవీశాఖలో 100% నియామకాలు పూర్తయి, అటవీశాఖలో స్ట్రెంత్ పూర్తిస్థాయికి చేరుతుందని తెలిపారు.

## సచివాలయం కూల్చివేతపై స్టేకు నిరాకరణ

- ప్రభుత్వ విధాన నిర్ణయాలపై న్యాయ సమీక్షకు అవకాశం తక్కువ
- సచివాలయం కూల్చేయవద్దంటూ దాఖలైన పిల్‌పై హైకోర్టు వ్యాఖ్య



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వాలు తీసుకునే విధాన నిర్ణయాలపై న్యాయ సమీక్షకు అవకాశాలు తక్కువ ఉంటాయని హైకోర్టు బుధవారం పేర్కొన్నది. పలు సందర్భాల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు ఇదే విషయాన్ని స్పష్టంచేస్తున్నాయని తెలిపింది. సచివాలయాన్ని కూల్చివేయడం రాజ్యాంగ విరుద్ధమంటూ తెలంగాణ ప్రజాస్వామిక వేదిక, తెలంగాణ జనసమితి ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలుచేశారు. భవనాలను కూల్చకుండా అడ్డుకోవాలని విజ్ఞప్తిచేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. స్టే, స్టేటస్‌కో ఇచ్చేందుకు నిరాకరించింది. చట్టవిరుద్ధమైన, అనుచిత, రాజ్యాంగ విరుద్ధమైన అంశాలు ఉన్నప్పుడే న్యాయ సమీక్షకు అవకాశం ఉంటుందని తెలిపింది. ఈ కేసు పరిష్కారం అయ్యేవరకు ప్రస్తుత సెక్రటేరియట్‌లోని వివిధ శాఖలను బయటి కార్యాలయాలకు తరలించకుండా అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) నుంచి అండర్‌టేకింగ్ తీసుకోవాలన్న పిటిషనర్ల విజ్ఞప్తిని సైతం ధర్మాసనం తిరస్కరించింది. సచివాలయం కూల్చివేతపై కౌంటర్ దాఖలుచేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీచేసిన ధర్మాసనం.. కేసును ఈ నెల 18కి వాయిదా వేసింది.



జోగులాంబ గద్వాల జిల్లా రాజోళి మండల కేంద్రంలోని అంభభవాని కాలనీలో మరుగుదొడ్డి నిర్మించుకోలేదని బుధవారం వారి ఇంటి ముందు బైఠాయించి వినూత్నంగా అవగాహన కల్పిస్తున్న ఉపాధిహామీ, పంచాయతీసిబ్బంది. - రాజోళి

## రికార్డు స్థాయిలో మక్కల ధరలు

క్వింటాల్‌కు 2,375 రూపాయలు



**కాశీబుగ్గ (వరంగల్ అర్బన్):** వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మక్కల ధరలు రికార్డు స్థాయికి చేరాయి. ఈ సీజన్‌లోనే అత్యధికంగా బుధవారం క్వింటాల్‌కు రూ.2375 పలికింది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.1750 పలుకుతుంది. ప్రైవేట్ వ్యాపారులు అత్యధిక ధరలు పెట్టి కొనుగోలు చేపట్టగా ప్రభుత్వ రంగ సంస్థ అధికారులు వెనుతిరిగారు. రైతులు ప్రైవేట్ వ్యాపారులకే అమ్మేందుకు మొగ్గుచూపుతున్నారు. ఈ సీజన్ అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు మార్కెట్‌కు 74 వేల 192 క్వింటాళ్ల మక్కలు వచ్చినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. బుధవారం 55 క్వింటాళ్లు రాగా గరిష్ఠంగా ధర రూ. 2,375, మధ్య రకం రూ.2322, కనిష్ఠంగా రూ.2154 ధరలు పలికాయి.

## రైల్వే ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

**బూర్గంపహాడ్:** రైల్వే ఉద్యోగాల పేరుతో రూ.లక్షలు వసూలుచేసిన ఐదుగురిని పోలీసులు అరెస్ట్‌చేశారు. భద్రాది కొత్తగూడెం జి ల్లా బూర్గంపహాడ్ మండలం సారపాకలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ముగ్గురి నుంచి రైల్వే ఉద్యోగాల పేరుతో ఇల్లా కుమారి, సిరికొండ రామ్‌చందర్, మాలావత్ మోహన్, ప్రభుదాస్, ప్రభాకర్ రూ.లక్షల్లో వసూలు చేశారు. నకిలీ అపాయింట్ ఆర్డర్లు, ఐడీ కార్డులు ఇచ్చారు. బాధితులు విజయవాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లగా.. అవన్నీ నకిలీవని తేలడంతో బూర్గంపహాడ్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.

### తుది నిర్ణయానికి లోబడే ఫీజులు

- ఇంజినీరింగ్ కళాశాలల ఫీజుల పెంపుపై హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్‌ఆర్సీ) తుది నిర్ణయానికి లోబడే ఇంజినీరింగ్ కళాశాలల ఫీజుల పెంపు ఆధారపడి ఉంటుందని హైకోర్టు బుధవారం స్పష్టంచేసింది. ప్రస్తుతం టీఏఎఫ్‌ఆర్సీకి చైర్మన్ లేనందున ఇంజినీరింగ్ కళాశాలలు తాము ప్రతిపాదించిన ఫీజులను వసూలు చేసుకోవచ్చని, చైర్మన్ నియామకం తర్వాత ఇంజినీరింగ్ కళాశాలలు ప్రతిపాదించిన ఫీజుల కంటే తక్కువ ఫీజును కమిటీ నిర్ణయిస్తే దానినే అమలుచేయాలని సింగిల్ జడ్జి ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులను డివిజన్ బెంచ్ సమర్థించింది. 2019-20 నుంచి 2021-22 విద్యా సంవత్సరాలకు ఇంజినీరింగ్ కళాశాలలు వసూలుచేసే ఫీజులు కమిటీ తుది నిర్ణయానికి లోబడి ఉండాలని పేర్కొన్నది. కమిటీ నిర్ణయించినదానికంటే ఎక్కువ వసూలు చేస్తే విద్యార్థులకు తిరిగి చెల్లించాలని పేర్కొన్నది.

**మూడురోజుల్లో ప్రక్రియ పూర్తి**

రాష్ట్రంలో ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో వచ్చే మూడేండ్లకు ట్యూషన్ ఫీజుల ఖరారు ప్రక్రియను మూడురోజుల్లో పూర్తిచేసేలా తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజ్ రెగ్యులేషన్ కమిటీ వేగం పెంచింది. కోర్టుకెళ్లిన 81 ప్రైవేటు కళాశాలల్లో ఫీజుల ఖరారు ప్రక్రియ బుధవారం సాయంత్రం ముగిసింది. మిగిలిన వంద కాలేజీల్లో శనివారంకల్లా ఫీజులను ఖరారు చేయనున్నారు.



రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కారు (ఇన్‌సెట్) మృతురాలు పల్లవి (ఫైల్)

### రోడ్డు ప్రమాదంలో అడిషనల్ డ్రగ్ కంట్రోలర్ దుర్మరణం

**తిరుమలాయపాలెం:** ఖమ్మంజిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలువద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో కరీంనగర్,వరంగల్, ఖమ్మంజిల్లాల డ్రగ్ కంట్రోల్ డిప్యూటీ డైరెక్టర్, ఖమ్మం జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ బానోత్ పల్లవి (45) మృతిచెందారు. ఖమ్మంలో విధులు ముగించుకొని వరంగల్ వెళ్తున్న పల్లవి కారు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయం కావడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్ర గాయాలైన డ్రైవర్‌ను ఖమ్మంలోని దవాఖానకు తరలించారు.

## ఆరేండ్ల తర్వాత సొంతూరికి

- ఒడిశా నుంచి పాలమూరుకు చేరిన బాధితురాలు
- అండగా నిలిచిన ఉజ్వల సంస్థ



డీఆర్వో స్వర్ణలతకు మహేశ్వరి (వృత్తంలో)ని అప్పగిస్తున్న ఉజ్వల సంస్థ ప్రతినిధులు

**మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ:** అనుకోని పరిస్థితుల్లో రైలెక్కి ఒడిశా రాష్ట్రానికి చేరుకున్న ఓ అభాగ్యురాలు ఓ స్వచ్ఛంద సంస్థ సాయంతో ఆరేళ్ల తర్వాత సొంత జిల్లాకు చేరుకున్నది. మహబూబ్‌నగర్ డీఆర్వో స్వర్ణలత తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోటకు చెందిన మహేశ్వరికి వివాహమై, ఒక పాప పుట్టిన తర్వాత మతిస్థిమితం లేదంటూ ఆమె భర్త వదిలేశాడు. దీంతో ఆమె తన అక్క దగ్గరే ఉంది. ఆమె అక్క భర్తకే ఇచ్చి తనకు రెండో వివాహం జరిపించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. వయస్సు ఎక్కువగా ఉండటంతో ఆమె పెళ్లికి నిరాకరించింది. పెళ్లి చేసుకోవాలని కుటుంబ సభ్యులు కొట్టడంతో పాపను వదిలేసి రైలులో ఒడిశాకు చేరుకుంది. అక్కడే ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడి అతడితో ఉంది. ఈ క్రమంలో మహేశ్వరి గర్భం దాల్చడంతో అతడు వదిలేశాడు. ఒడిశాకు చెందిన ఉజ్వల స్వచ్ఛంద సంస్థ ఆమెకు అయిదేళ్లుగా ఆశ్రయం కల్పిస్తున్నది. అక్కడే బాబుకు జన్మనిచ్చింది. సంస్థ ప్రతినిధులు టైలరింగ్‌లో శిక్షణనిచ్చి మహేశ్వరికి జీవనోపాధి కల్పించగా, ఇటీవల సొంతూరికి వెళ్తానని వారిని కోరింది. బుధవారం మహేశ్వరిని ఆమె కొడుకును మహబూబ్‌నగర్‌కు తీసుకొచ్చి, కలెక్టర్‌ను కలిశారు. అనంతరం తల్లీకొడుకులను స్టేట్‌హోంకు తరలించారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శేఖర్‌పాండ, సుస్మితదాస్, సఖీ కేంద్రం లీగల్ అడ్వైజర్ నాగరాణి, మంజుల ఉన్నారు.

## మూస కోర్సులకు స్వస్తి

- ఇంజినీరింగ్‌లో ఏడు కొత్త కోర్సులు తీసుకొచ్చిన ఏఐసీటీఈ
- అనుమతిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఇంజినీరింగ్ విద్యావిధానం స్వరూపం మారుతున్నది. పలు కాలేజీల యాజమాన్యాలు బయోటెక్నాలజీ, బయోమెడికల్ ఇంజినీరింగ్, ఫుడ్‌సైన్స్ కోర్సులకు.. మరికొన్ని యాజమాన్యాలు సివిల్, మెకానికల్ వంటి ఇంజినీరింగ్ కోర్సులకు స్వస్తి పలుకుతున్నాయి. వాటికిబదులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, కంప్యూటర్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ ఇంజినీరింగ్ (నెట్‌వర్క్), ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ వంటి ఏడు కోర్సులను ఈ ఏడాది నుంచి ప్రవేశపెట్టబోతున్నాయి. వీటికి అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) నుంచి అనుమతులు, యూనివర్సిటీ అఫిలియేషన్లు కూడా వచ్చాయి. వీటిలో నాలుగు కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వ తుది ఆమోదం లభించింది. మిగిలిన కోర్సులకు అనుమతులు వివిధదశల్లో ఉన్నాయని సాంకేతికవిద్యాశాఖ అధికారులు తెలిపారు.

**ఎంసెట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ**

సీఎస్‌ఈ, ఈసీఈ, ఐటీ, మెకానికల్ వంటి ఇంజినీరింగ్ కోర్సులతోపాటు ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన కోర్సుల్లోని సీట్లను ఎంసెట్-2019 కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయడానికి ఎంసెట్ అడ్మిషన్ అధికారులు సిద్ధంగా ఉన్నారు. కొత్త ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రతివిభాగంలో 60సీట్లు ఉంటాయి. భవిష్యత్‌లో వసతి సదుపాయాలు, టీచింగ్ ఫ్యాకల్టీ సదుపాయాలను బట్టి సీట్ల సంఖ్య, ఉద్యోగావకాశాలు కూడా పెరుగనున్నాయని తెలిసింది. ప్రస్తుతం వీజేఐటీ, సీవీఎస్‌ఆర్ కాలేజీల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, వీఎన్‌ఆర్ విజ్ఞాన్‌జ్యోతిలో కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, సీవీఆర్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, స్టాన్లీ కాలేజీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగాలకు అనుమతులు లభించినట్టు సమాచారం.

PROFESSOR JAYASHANKAR TELANGANA STATE AGRICULTURAL UNIVERSITY
Administrative Office, Rajendranagar, Hyderabad-30, Telangana State, India
Advt.No.6005/Exams/2019(1) Date: 03-07-2019
ADMISSION NOTIFICATION
ONLINE applications are invited from the eligible candidates for admission into B.Sc. (Hons.) Agriculture under NRI/NRI Sponsored quota. The online application, prospectus and other details are available on the University website www.pjtsau.edu.in.
The last date for online submission of application is 31-07-2019 (4 PM).
Dr. S.SUDHEER KUMAR, REGISTRAR.

PROFESSOR JAYASHANKAR TELANGANA STATE AGRICULTURAL UNIVERSITY
Administrative Office, Rajendranagar, Hyderabad-30, Telangana State, India
Advt.No.6005/Exams/2019(2) Date: 03-07-2019
ADMISSION NOTIFICATION
ONLINE applications are invited from eligible candidates for admission into Bi.P.C. stream courses viz., B.V.Sc. & A.H., B.F.Sc., B.Sc.(Hons.) Agriculture (Regular and Payment seats) and B.Sc.(Hons.) Horticulture (Regular and Payment seats) for the academic year 2019-20 based on the ranks obtained in TS EAMCET-2019. The online application, prospectus and other details are available on the University website www.pjtsau.edu.in.
The last date for online submission of application is 27-07-2019 (4 PM).
Dr. S.SUDHEER KUMAR, REGISTRAR.



ఈ ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ అయిపోయింది. పార్లమెంట్ మొదటి ముప్పై ఏండ్ల కాలంలో ప్రతి పది బిల్లులో ఒకటి ఆర్డినెన్స్ అయ్యేది. తర్వాత ముప్పై ఏండ్లలో పదిలో రెండు, ఇప్పుడు ప్రతి పది బిల్లుల్లో నాలుగు ఆర్డినెన్స్‌లు అవుతున్నాయి. మేం బీజేపీ ఎజెండా కోసం పార్లమెంట్ విధానాలను తిరుగరాయనీయబోము.

**డెరెక్ ఒ బ్రియేన్, రాజ్యసభ సభ్యులు**

ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపక్షాల ప్రాధాన్యం గురించి చెప్పింది ఆచరించాలి. కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా లేకున్నా ప్రతిపక్షనేత హోదాను కాంగ్రెస్‌కు ఇవ్వాలి. అలాగే డిప్యూటీ స్పీకర్ పదవికూడా ప్రతిపక్షానికి అప్పజెప్పాలి.

**కొడికున్నిల్ సురేష్, కాంగ్రెస్ నేత**



**చరిత్రలో నేడు**



1776

అమెరికా కాంగ్రెస్ స్వాతంత్ర్య ప్రకటన. బ్రిటన్ నుంచి స్వేచ్ఛ కావాలని తీర్మానం.

1782

బ్రిటన్ ప్రధానిగా విలియం పెట్టీ.





1884

ప్యారిస్‌లో స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ విగ్రహాన్ని అమెరికాకు బహూకరణ.

ఉప్పు, నిప్పు కలిసిపోయిన చందంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ చేయిచేయి కలిపారు. ఒక రకంగా ఇరు దేశాల సంబంధాల్లో నవశకం ఆరంభమైంది. ఉత్తర-దక్షిణ కొరియాల సరిహద్దు మిలిటరీ రహిత ప్రాంతంలో ట్రంప్-కిమ్‌జోంగ్ భేటి అయ్యారు. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలపై గంటసేపు చర్చించారు. చర్చల పురోగతికి ఇరుదేశాలు బృందాలను ఖరారు చేశారు. అయితే ఇరు దేశాల మధ్య క్లిష్టమైన సమస్యలెన్నో మిగిలే ఉన్న నేపథ్యంలో ఇది ఏ మేరకు సఫలమవుతుందో చూడాలి.

**ది హిందూ**

ఫైవ్-జీ టెక్నాలజీని సమకూర్చుకోవటానికి భారత్ చేస్తున్న ప్రయత్నాల్లో చైనా కంపెనీ 'హువా వెయి'ని దరిచేరనీయొద్దని భారత ప్రభుత్వ సైంటిఫిక్ సలహాదారు కె.విజయ్ రాఘవన్ సూచించారు. చైనాలోని ప్రముఖ ప్రైవేట్ కంపెనీలన్నింటిలో చైనా కమ్యూనిస్టు పార్టీ సెల్స్ అంతర్గతం, రహస్యంగా పనిచేస్తుంటాయి. నిజానికి చైనాలో ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలకు తేడా లేదు. అన్నీ కమ్యూనిస్టు పార్టీ విధానాల అడుగుజాడల్లో నడుస్తాయి. కాబట్టి 5జీ పేర చైనా కంపెనీ 'హువా వెయి' భారత్‌లోకి వస్తే భారత రక్షణ, భద్రతా వ్యవహారాలకు ముప్పు.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**



# యూరప్‌లో వేడిగాలులు

జూన్ నెలలో యూరప్‌ను అట్టుడికించిన వేడిగాలులకు కారణం వాతావరణ మార్పే అని అధ్యయనాలు స్పష్టం చేయడంతో ప్రపంచవ్యాప్తంగా విధానకర్తలు, ప్రజలు అప్రమత్తం కావలసి ఉన్నది. 1880 నుంచి యూరప్‌లో కానీ, భూగోళమంతటా కానీ జూన్ నెల ఇంత వేడిగా ఏనాడూ లేదని యురోపియన్ యూనియన్‌కు చెందిన కోపర్నికస్ వాతావరణ మార్పు కేంద్రం వెల్లడించింది. వం ఏండ్ల కిందటితో పోలిస్తే యూరప్‌లో జూన్ సగటు ఉష్ణోగ్రత మూడు డిగ్రీల కన్నా ఎక్కువగా ఉన్నదని తెలిపింది. ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా, జర్మనీ, స్పెయిన్ తదితర దేశాలన్నీ వేడిగాలులతో అతలాకుతలమయ్యాయి. ఫ్రాన్స్‌లోని నైమ్స్ నగరం దగ్గర జూన్ 28 వ తేదీన 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. స్పెయిన్, జర్మనీ దేశాలలో కార్చిచ్చులు వ్యాపించాయి. ఈ అతివేడిగాలులు ప్రజల ఆరోగ్యం, వ్యవసాయం, పర్యావరణం మీద విపరీత ప్రభావం చూపింది. మానవ చర్యల వల్ల కలిగిన వాతావరణ మార్పు ప్రభావంతోనే ఇటువంటి వేడిగాలులు ఇకముందు మరింత తీవ్రంగా, తరచుగా, సుదీర్ఘంగా రావచ్చునని 'ప్రపంచ మానవ కారణ వాతావరణ మార్పు అధ్యయన కేంద్రం' శాస్త్రవేత్తలు వెల్లడించారు. శతాబ్దం కిందటితో పోలిస్తే ఈ వేడిగాలులు పదింతలు తీక్షణంగా ఉన్నాయని వారు అంటున్నారు. ఐదురోజులు తీవ్ర ఉష్ణోగ్రత, ఆ తర్వాత తూర్పు యూరప్‌లోనూ వేడిగాలులు గతం కన్నా భిన్నమైనవని యురోపియన్ మధ్యతరహా వాతావరణ అంచనా కేంద్రం తెలిపింది.

ప్రకృతి వైపరీత్యాలకు వాతావరణ మార్పునకు సంబంధం లేదనే కుతర్కం ఇటీవలి కాలంలో ఎక్కువైంది. కండ్లముందు కనిపిస్తున్నా, ఈ వైపరీత్యాలు అనుభవంలోకి వచ్చినా గుర్తించ నిరాకరించడం మూర్ఖత్వం, మానవాళి మనుగడకే ప్రమాదకరం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యావరణానికి ప్రమాదకరమైన అనేక చర్యలు తీసుకున్నారు. ప్యారిస్ ఒడంబడిక నుంచి వైదొలిగారు. ఈ నేపథ్యంలో యూరప్‌లో వచ్చిన వేడిగాలుల అధ్యయనాలను గమనించడం మంచిది. ఈ వేడిగాలులు వంద శాతానికి పైగా వాతావరణ మార్పు వల్ల వచ్చినవేనని శాస్త్రవేత్తలు తేల్చిచెబుతున్నారు. వాతావరణ మార్పు ప్రభావం భవిష్యత్తులో మన పిల్లలకు కాదు, ఇప్పుడు మనకే కనిపిస్తున్నదని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ ఫ్రీడెరైక్ ఆటో హెచ్చరించారు. ఈ వేడిగాలుల పోకడ చూస్తుంటే, ప్యారిస్ ఒడంబడిక అమలైనా పరిస్థితి అదుపులోకి రాదనే ఆందోళనను రాయల్ నెదర్లాండ్స్ వాతావరణ సంస్థకు చెందిన గీర్ట్ జాన్‌వాన్ ఆల్డోన్‌బార్గ్ వ్యక్తం చేశారు. మనం లెక్కగట్టిన దానికన్నా తీవ్రంగా పరిస్థితి ఉన్నదని అంటున్నారు. భూమి వినియోగం తీరు, మట్టిలో తేమ, నీటిపారుదల విధానం, నగరాల అభివృద్ధి తీరు, వాయు కాలుష్యం మొదలైనవన్నీ ఉష్ణోగ్రత తీక్షణతకు దారితీస్తున్నాయి. వాతావరణ మార్పు ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా 230 అధ్యయనాలు సాగాయి. 95 శాతం వేడిగాలులకు వాతావరణ మార్పు కారణమని ఈ అధ్యయనాలలో వెల్లడైంది. 65 శాతం కరువులకు, 57 శాతం వరదలకు కూడా కారణమని తెలిసింది.

**వానలు, వరదలు, కరువు, వేడిగాలులు, గాడ్పులు మొదలైన రీతుల్లో వైపరీత్యాలు సంభవిస్తాయి. వీటిని సృజనాత్మకమైన రీతిలో ఎదుర్కోవాలె. ఉదాహరణకు వానలు బాగా పడ్డప్పుడు వరదలు రాకుండా ఒడిసిపట్టుకోవాలె. జలాశయాలు నిర్మించుకొని నిలువ చేసుకోవాలె. దీనివల్ల ఆ తదుపరి వచ్చే కరువును జయించవచ్చు. అడవులను సంరక్షించుకుంటూ, చెట్లను పెంచడం వల్ల ఎండలను తట్టుకోవచ్చు. నగరాల నిర్వహణలో, ప్రజల జీవనసరళిలో మార్పులు తెచ్చుకోవాలె.**

యూరప్ కన్నా ముందే దక్షిణాసియా ఉపఖండాన్ని వేడిగాలులు తాకాయి. ఈ ఎండాకాలంలో మనదేశంతోపాటు పాకిస్థాన్ తీవ్ర ఉష్ణోగ్రతలకు విలవిలలాడాయి. ఈ వేడిగాలులు అత్యంత తీక్షణంగా, సుదీర్ఘంగా సాగాయి. మే నెల మధ్య భాగం నుంచి జూన్ వరకు దాదాపు 32 రోజుల పాటు వేడిగాలుల తీవ్రత అసాధారణం. ఈ వేడిగాలులకు ఒక్క బీహార్‌లోనే 184 మంది మరణించారు. దేశవ్యాప్తంగా ఇంకా అనేకమంది బలయ్యారు. చెన్నైతో సహా దేశమంతా నీటికి కటకట ఏర్పడ్డది. పలు జలాశయాలు నెర్రెలు వారాయి. అయితే వరదలు, లేకపోతే వేడిగాలులతో దేశం సతమతమైంది. తెలంగాణ కూడా మే, జూన్ నెలల్లో కుతకుతలాడింది. సుదీర్ఘ ఎండాకాలాన్ని భరించలేక ప్రజలు అల్లాడిపోయారు. భూగోళమంతటా చెలరేగుతున్న ప్రకృతి వైపరీత్యాలకు మన దేశం అతీమేమీ కాదు. తెలంగాణ కూడా ఈ వైపరీత్యాల నుంచి తప్పించుకోలేదు. వాతావరణ మార్పు వల్ల కలిగే వైపరీత్యాలను తట్టుకోవడానికి రెండురకాల యుద్ధాలు చేయాలని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఒకటి-వాతావరణ మార్పును అరికట్టడానికి ప్రయత్నించడం. పర్యావరణానికి ముప్పు వాటిల్లని అభివృద్ధి విధానాలను అనుసరించడం. అడవులు అంతరించకుండా జాగ్రత్తపడటం. నీటిని సంరక్షించుకోవడం. కాలుష్యాలు విడుదల కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం. రెండవ రకం యుద్ధం- ఇప్పటికే జరిగిన వాతావరణ మార్పు ప్రభావం వల్ల కలిగే వైపరీత్యాలను ఎదుర్కోవడానికి సమాయత్తం కావడం. వానలు, వరదలు, కరువు, వేడిగాలులు, గాడ్పులు మొదలైన రీతుల్లో వైపరీత్యాలు సంభవిస్తాయి. వీటిని సృజనాత్మకమైన రీతిలో ఎదుర్కోవాలె. ఉదాహరణకు వానలు బాగా పడ్డప్పుడు వరదలు రాకుండా ఒడిసిపట్టుకోవాలె. జలాశయాలు నిర్మించుకొని నిలువ చేసుకోవాలె. దీనివల్ల ఆ తదుపరి వచ్చే కరువును జయించవచ్చు. అడవులను సంరక్షించుకుంటూ, చెట్లను పెంచడం వల్ల ఎండలను తట్టుకోవచ్చు. నగరాల నిర్వహణలో, ప్రజల జీవనసరళిలో మార్పులు తెచ్చుకోవాలె. తెలంగాణలో నీటి నిర్వహణ తదితర విధానాలను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

**జనగళం**

## రెండడుగుల దూరంలో భారత్

2019 క్రికెట్ ప్రపంచకప్‌లోని లీగ్ మ్యాచ్‌ల్లో ఆరు విజయాలు, ఒక ఓటమితో ఇంకో మ్యాచ్ మిగిలి ఉండగానే భారత జట్టు సెమీస్‌కు చేరింది. ముచ్చటగా మూడోసారి ప్రపంచకప్‌ను చేజిక్కించుకునేందుకు టీమిండియా మరో రెండడుగుల దూరంలో ఉన్నది. బలమైన జట్లే సెమీస్‌కు చేరుకుంటాయి. కాబట్టి భారత జట్టు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. లీగ్‌దశలో మిగిలిన ఇంకో మ్యాచ్ భారత్ శ్రీలంకతో తలపడనున్నది. ఆ ఒక్క మ్యాచ్ కూడా భారత్ గెలిచి ఆత్మవిశ్వాసంతో సెమీస్‌లో అడుగుపెట్టాలి. భారత జట్టు లీగ్ దశలో చేసిన పొరపాట్లను సవరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ప్రత్యర్థుల బలాబలాలను అంచనా వేస్తూ సరైన ప్రణాళికలను రచించి కట్టడి చేయాలి.

**- పుల్కం సంపత్, రాములపల్లె, జగిత్యాల**

## బోనాల పండుగ శుభాకాంక్షలు

తెలంగాణ చరిత్ర, సంప్రదాయంలో భాగమైన బోనాల పండుగ నేటితో ఆరంభం కానున్నది. అనాది నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆషాఢ మాసంలో బోనాల పండుగ జరుపుకుంటారు. అలాంటి బోనాల పండుగ ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురయింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం తొలి తెలంగాణ ప్రభుత్వం బోనాల పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నది. ఇది అభినందనీయం. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు.

**- బొల్లం రమాదేవి, అల్వాల్, హైదరాబాద్**

## మన సినిమాను ఆదరించాలె

రాష్ట్ర ఆవిర్భావం తర్వాతే 'తెలంగాణ జీవిక, తెలంగాణ తనం, తెలంగాణ సోయి ఉన్న సినిమాలను నిర్మిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ భాషను ఒక హాస్యానికే వాడుకున్నారు. ఇప్పుడే అదే భాష కేంద్రంగా సినిమాలు నిర్మిస్తుండటం గర్వకారణం. కాబట్టి తెలంగాణ ప్రజలు ఇలాంటి సినిమాలను ఆదరించాల్సిన అవసరం ఉన్నది. అప్పుడే తెలంగాణ సోయి ఉన్న సినిమాలు విరివిగా వస్తాయి.

**- అక్షరకుమార్, రాంనగర్, హైదరాబాద్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

**ఆలోకన**



**టంకశాల అశోక్**

# తమిళనాట ఫెడరలిజం

తమిళనాడు ద్రవిడ పార్టీలు ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో ఘన విజయం సాధించి జాతీయ పార్టీలను నామమాత్రం చేయటంపై ముఖ్యమంత్రి కేసీఆర్ కొన్ని ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. అక్కడ ప్రతిసారి ప్రాంతీయ పార్టీలలోనే ఏదో ఒకటి గెలుస్తుందని, జాతీయ పార్టీలకు స్థానం ఉండదని, అదే పద్ధతిలో తెలంగాణలో టీఆర్‌ఎస్‌ను బలోపేతం చేయాలని తమ పార్టీ వాదులకు పిలుపునిచ్చారు. ఫెడరలిజం ప్రస్తావన కూడా చేశారు. తమిళనాడు తరహాలో ఫెడరలిస్టు శక్తుల మహా ప్రాబల్యం ఇతర చోట్ల ఎంతవరకు సాధ్యమన్నది జాగ్రత్తగా విచారించవలసిన విషయం.

ఇందుకు సంబంధించి మొదట అర్థం చేసుకోవలసింది తమిళనాడు ఫెడరలిస్టు మూలాలను. ఆ మూలాలు తమిళ జాతివాదంలో, ద్రవిడ జాతివాదంలో ఉన్నాయి. ఇటువంటి జాతివాదం దేశ స్వాతంత్ర్యానికి ముందు చరిత్ర పొడవునా ఉండగా, ఆధునిక పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రాకతో ఫెడరలిస్టు భావనగా రూపాంతరం చెందింది. జాతివాదాలు, ఫెడరలిస్టు భావనలు దేశంలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఏదో ఒక మేరకు ఉన్నప్పటికీ, అవి ఏవీ తమిళ-ద్రవిడ జాతివాదానికి సరిరావు. అందుకు తగు కారణాలున్నాయి. వాటిని ముందు గమనించాలి. అప్పుడుగాని అక్కడ ద్రవిడ పార్టీల వరుస విజయాలకు, జాతీయ పార్టీల వరుస పరాజయాలకు కారణాలు అర్థంకావు. ఈ మాటలు చెప్పుకున్న మీదట ఒక సందేహం కలుగవచ్చు. ఆధునిక పార్లమెంటరీ ప్రజాస్వామ్య కాలంలో టీఆర్‌ఎస్ వంటి ఫెడరలిస్టు శక్తులు జాతీయ పార్టీలపై వరుస విజయాలు సాధించాలంటే, జాతీయ పార్టీలను నామమాత్రంగా మిగిల్చివేయాలంటే, తమిళ-ద్రవిడ జాతీయవాదం వంటిది అదే స్థాయిలో ఇక్కడ ఒక పునాది శక్తిగా నేపథ్య శక్తిగా ఉండటం తప్పనిసరా?

తమిళులు ఈ ద్రవిడ భూమిపై తమను తాము ఒక ఆదిమ జాతిగా నమ్ముతారు. క్రీస్తుపూర్వం నుంచి తమకు ఇతరులు అందరికన్న ముందుగా ఒక భాష, లిపి, సాహిత్యం, సంస్కృతి, మతం వ్యవస్థీకృత సమాజం, నాగరికత ఉండేవని బలంగా చెప్తారు. అందుకు 'సంగం' సాహిత్యం, సముద్రంలో మునిగి సునామీ వంటి సందర్భాలలో బయటపడే అతి ప్రాచీన నిర్మాణాల వంటి ఆధారాలు అనేకం చూపుతారు. భారత దేశం బయటి నుంచి వచ్చినట్లు, ఆర్యావర్తం అనబడే ఉత్తరాది నుంచి దక్షిణానికి చొచ్చుకువచ్చారని భావించే ఆర్యులతో తమ చారిత్రకమైన ఘర్షణలను పేర్కొంటారు. బ్రాహ్మణ వ్యతిరేకత, హిందూ దేవతల వ్యతిరేకత, హిందీ భాషా వ్యతిరేకత దీనిలో భాగమయ్యాయి. ఆ ఘర్షణలలో భౌతికమైనవి, మేధోపరమైనవి, సాంస్కృతికమైనవి, మతపరమైనవి కూడా ఉన్నాయి. ఆ విధంగా అనేక వందల సంవత్సరాల కాలంలో తమిళ-ద్రవిడ జాతి అన్నది రూపుదిద్దుకొని, స్థిరపడి ఘనీభవించింది. ద్రవిడ-తమిళ జాతి భావన ఒక ఫిలాసఫీగా మారింది.

అదే చారిత్రక స్థితి స్వాతంత్ర్యోద్యమ కాలానికి వ్యాపించింది. అప్పటి ఏకైక జాతీయ పార్టీ కాంగ్రెస్ కాగా, దానితో ఏకీభవించిన తమిళ వర్గాలు అంతకుమించి ఉండేవి. అవి ద్రవిడవాద డిమాండ్లను, భాషా సాంస్కృతిక అంశాలను, బడుగు బలహీనవర్గాల వాదనలను, ఉత్తరాది (ఆర్య) వ్యతిరేకతలను ముందుకు తెచ్చాయి. ఆ కాలపు వివిధ సామాజిక ఉద్యమాలు అట్లుండగా, ఈ ధోరణులకు ఒక రూపం జస్టిస్ పార్టీ, మరొక రూపం రామస్వామి నాయకర్ ఉద్యమం, ఇంకొక రూపం డి.కె.పార్టీ అయ్యాయి. ఈ సంప్రదాయాల నుంచి పుట్టుక వచ్చిందే ప్రత్యేక తమిళదేశ వాదన. స్వతంత్ర భారతదేశం నుంచి విడిపోయి వేరే దేశంగా అవతరించాలన్న నినాదం 1962లో చైనా దాడితో గాని ముగియలేదు. కాని మౌలికంగా తమిళ-ద్రవిడ జాతివాదం మాత్రం కొనసాగాయి. రాజ్యాంగంలోని ఫెడరలిస్టు లక్షణాలను ఆధారం చేసుకుంటూ ఈ చారిత్రక స్థితిగతులు, భావనలు, నినాదాలు ఆధునిక ఫెడరల్ శక్తులను నిలబెట్టాయి. అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఎన్నికలలో ద్రవిడ పార్టీల నుంచే ఏదో ఒకటి గెలువటం, జాతీయ పార్టీలు వాటికి మహా అయితే జూనియర్ భాగస్వాములుగా మిగులటం అందువల్లనే జరుగుతున్నది. ద్రవిడ పార్టీలు కేడర్ బేస్‌డ్ పార్టీలు అయ్యాయి. వాటి నిలకడకు అది కూడా ఒక కారణం.

క్రీస్తు పూర్వకాలం నుంచి ఇటువంటి మూలాలు, వేల సంవత్సరాలుగా ఈ తరహాలో ఎడతెగని భావనలు, ఇటువంటివన్నీ పెనవేసుకుపోయిన సంఘీభావ స్థితి, దానిని నేటికీ కొనసాగిస్తున్న పరిస్థితులు, శక్తులు దేశంలో మరెక్కడా లేవు. ఇంత ఉధృతమైన రీతిలో ఎక్కడా కన్పించవు. ఈ స్థితి అందుకు తగిన ఎన్నికల రికార్డు, రాజకీయ రికార్డు ఎంతో స్పష్టంగా ఉన్నప్పటికీ ఇటీవల ఆసక్తికరమైనవి కొన్ని జరిగాయి. తమిళనాడులో ప్రాబల్యం ద్రవిడ శక్తులదే అయినా, కొన్ని పరిస్థితుల కారణంగా జయలలిత ఒక ముఖ్య శక్తి కావటాన్ని కొందరు ద్రవిడ భావనలు బలహీనపడటానికి, ద్రవిడేతర ఆర్య శక్తి ముందుకురావటానికి, అట్లా ముందుకురావటాన్ని తమిళజాతి ఆమోదించటానికి సంకేతమంటూ చెప్పారు. ఆమె మరణంతో ఏర్పడిన ఒక శూన్యంలోకి బీజేపీ ప్రవేశించగలదని, అది ఆర్యశక్తి విజయం కాగలదని వ్యాఖ్యానించారు. ఆ మాట ఇంత నేరుగా అనకున్నా పరోక్ష సూచనలు చేశారు. అదేవిధంగా, చివరి ద్రవిడ మహానేత కరుణానిధి మృతి, ఇక ఏ ద్రవిడ పార్టీలోనూ గొప్ప నాయకులు లేకపోవటంతో ద్రవిడ వాదం ముగిసినట్లేనన్నారు. కాని తమిళవాదం ఆ జాతి ప్రజల మూలాలలో ఉండి కొనసాగుతున్నదని లోక్‌సభ ఫలితాలు తిరుగులేని విధంగా రుజువు పరిచాయి.

తెలంగాణ విషయానికి సూటిగా వస్తే, ఇక్కడ జాతీయ పార్టీలను నామమాత్రం చేసి నిలువరించగల మార్గమే దైనా ఉన్నదా? తమిళ జాతి భావన వంటి తెలంగాణ జాతి ఫిలాసఫీ రాగల అవకాశం ఏమిటి? ఇది జరుగాలంటే ఈ ప్రాంతానికి చెందిన సాధారణ ప్రజా వర్గాలను, మధ్య తరగతిని, ఉన్నత తరగతులను తెలంగాణ భావనలతో ప్రభావితం చేయగల వ్యూహాన్ని రూపొందించాలి.

పైన చెప్పుకున్నట్లు తమిళ-ద్రవిడవాదంతో పోల్చదగ్గ చారిత్రక జాతీయవాదం ఆ స్థాయి దేశంలో మరెక్కడా లేదు. కనుకనే అటువంటి ఆధారాలతో ముడిపడిన ఆధునిక పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు ఫెడరలిజం ఇటువంటి పునాదులపై నిలిచి కొనసాగుతున్నది. ఇటువంటి స్థాయిలో చారిత్రక మైన పునాదులు, స్వాతంత్ర్యానంతరం ఆధునిక ఫెడరలిస్టు రికార్డు లేకపోయినా, లేక పాక్షికంగా మాత్రమే ఉన్న ఇతర ప్రాంతాలలో ఫెడరలిజం బలంగా నిర్మితం కావాలంటే ఏమి చేయాలన్నది ప్రశ్న. ఉదాహరణకు తెలంగాణ వంటి చోట.

అయితే ప్రపంచంలో ఫెడరలిజం ప్రతిచోటా చారిత్రక జాతి భావనల ఆధారంగా మాత్రమే జరుగలేదు. తమిళనాడు పరిస్థితి ఒక మినహాయింపు వంటిది. నిజానికి జాతి భావన, ఫెడలరిస్టు భావన రెండూ చారిత్రకమైనవే. చరిత్రలో రాజ్యాలు అంటూ మొదట ఏర్పడిన దశలో, కేంద్ర స్థానంలో ఉండిన రాజు వివిధ చిన్న రాజ్యాలు, తెగల ప్రజలతో ఫెడరలిస్టు అంగీకారాల వంటివి చేసుకునే రాజ్యాన్ని నడిపేవాడు. అంగీకారం భంగపడినప్పుడు, లేదా సామంత తెగలకు స్వతంత్రేచ్ఛ కలిగినప్పుడు ఘర్షణలు తలెత్తాయి. రాజ్యాలు, సమాఖ్యలు భంగపడ్డాయి. ఆ సందర్భాలలో అందరినీ కలిపి ఉంచిన జాతీయ భావనలు, సమైక్యతా భావనలంటూ ఏమీ లేవు. మరొకవైపు, జాతి భావన లేకపోయినా తగు అవగాహనతో తగినంతకాలం కొనసాగిన సమాఖ్యల వంటి రాజ్యాలున్నాయి. అవగాహన పోయినప్పుడు భంగపడ్డాయి.

ఈ నేపథ్య చర్చలను అట్లుంచి తెలంగాణ విషయానికి సూటిగా వస్తే, ఇక్కడ జాతీయ పార్టీలను నామమాత్రం చేసి నిలువరించగల మార్గమేదైనా ఉన్నదా? తమిళ జాతి భావన వంటి తెలంగాణ జాతి ఫిలాసఫీ రాగల అవకాశం ఏమిటి? ఇది జరుగాలంటే ఈ ప్రాంతానికి చెందిన సాధారణ ప్రజా వర్గాలను, మధ్య తరగతిని, ఉన్నత తరగతులను తెలంగాణ భావనలతో ప్రభావితం చేయగల వ్యూహాన్ని రూపొందించాలి. వేర్వేరు వర్గాలను వేర్వేరు అంశాలు ప్రభావితం చేస్తాయి. మరొక స్థాయి లో అందరినీ కలిపి ఉమ్మడిగా ప్రభావితం చేసే అంశాలుంటాయి. ఉదాహరణకు తమిళ జాతివాదంలో సంస్కృతి, సాహిత్యం, జాతివాదం, చరిత్ర ప్రధానాంశాలు అనుకుంటే, ఇవన్నీ తెలంగాణకు సంబంధించిన వి బలంగా, విస్తారంగా, నిరంతరం ముందుకుతేవటం తెలంగాణలో ఉపయోగకరం కాగలదు. ఇది అన్ని వర్గాలను ప్రభావితం చేసే కామన్ అంశం అవుతుంది. నిర్దిష్టంగా చూసినప్పుడు, సాధారణ ప్రజా వర్గాలకు, అన్నింటికన్న ముఖ్యమైనవి జీవిత సంక్షేమం, జీవన భద్రత, ఉపాధి, ఇతర జీవితావసరాలు, సుపరిపాలన వంటివి. అవి వీలైనంత బాగా జరిగి అందుకు సంస్కృతి, సాహిత్యం, స్థానిక జాతి భావనలు కూడా తోడైనప్పుడు ఆ రెండింటి బంధం వల్ల ఈ వర్గాలలో కూడా ఫెడరలిస్టు ధోరణులు బలపడుతాయి. ఫెడరలిస్టు శక్తులకు మద్దతు పెరుగుతుంది. ఉన్నతవర్గాలకు సంబంధించి వారిలో స్థానిక జాతి భావనలు గలవారు ఉండవచ్చు, తమ సంకుచిత ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం జాతీయ రాజకీయ శక్తులను అనుసరించేవారు కూడా ఉండవచ్చు. వ్యూహం అందుకు తగినట్లే ఉండాలి. వారిలో ఫెడరలిస్టు విశ్వాసాలను, విధేయతలను వీలైనంత పెంచాలి. దీనంతటి అర్థం జాతి వాదనకు భిన్నంగా జాతీయవాదం గాని ప్రాంతీయ పార్టీలకు భిన్నంగా జాతీయ పార్టీలు గాని అవాంఛనీయమైనవని కాదు. కాని జాతీయ పార్టీలు అనబడేవి మనం రాజ్యాంగంలో చెప్పుకున్న సహకార ఫెడరలిజాన్ని ధ్వంసం చేయబూనటంతో సమస్య మొదలైంది. ప్రాంతీయ భాషా సంస్కృతులను, ప్రాంతీయ ఆర్థిక-రాజకీయ శక్తులను విస్మరించటం, అణిచివేయ టం అందుకు ఆజ్యం పోయసాగింది. ఈ సోకాల్డ్ జాతీయ పార్టీల వల్లనే కొత్త ప్రాంతీయ పార్టీలు ఏర్పడి బలపడుతున్నాయి. అవి వర్ధిల్లటం చారిత్రక అవసరం.

# నవభారత నిర్మాణం కోసం..

**విశ్లేషణ**



**రోహిత్ కుమార్**

ఆ సమయం వస్తుంది. మన పిల్లలు ఇక ఎంతమాత్రం పిల్లలుగానే ఉండరు. వారు ఎదిగి యుక్తవయస్సులోకి ప్రవేశిస్తారు. తమదైన వ్యక్తిత్వంతో నవభారతంలోకి ప్రవేశిస్తారు. అయితే.. వారు ప్రవేశించబోయే భారతం ఎలా ఉన్నది? వారెలా ప్రభావితమవుతున్నారు? వారి పోషకులుగా, బాధ్యులుగా వారిని ఎలా ఉండాలనుకుంటున్నాం.. అనేది ఇవ్వాళ ప్రధాన సమస్య. ఈ నేపథ్యంలో ఆ విద్యార్థులకు ఉపాధ్యాయుడిగా, పిల్లల తల్లిదండ్రులకు నా లేఖ..

**ప్రియమైన తల్లిదండ్రులారా..**

నేను మీ పిల్లలకు చాలా ఏండ్లుగా విద్యాబోధన చేసే అవకాశం కల్పించినందుకు గర్వపడుతున్నాను. వారు చాలా చిన్నపిల్లలుగా నా దగ్గరికి వచ్చి.., పాఠశాల విద్య పూర్తిచేసుకొని వయోజనులుగా ఓటు హక్కు పొందినవారిగా ఎదిగేదాకా నేను వారికి ఉపాధ్యాయుడిగా ఉన్నాను. కౌమారదశలో వారితో నేను గడిపాను. విద్యాబుద్ధులు చెప్పాను. బాల్యదశ నుంచి కౌమారదశ వారికి ఓ కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది. బాల్యదశ పరిపూర్తి కాకుండా కౌమార దశలో వారిపై బాల్యప్రభావం పూర్తిగా తొలిగిపోదు. ఈ దశ ఒకరకంగా మధ్యస్థ దశగా, లేక పరిణామ దశగా చెప్పుకోవచ్చు.

ఈ దశలో ఏ విధమైన నిర్దిష్టమైన, ప్రత్యేకమైన అభిప్రాయాలు విద్యార్థులకు ఉండవు. ఈ నిర్దిష్ట అభిప్రాయాలు లేని కౌమార దశనే ప్రత్యేకమైనది, ముఖ్యమైనది. వారి జీవన మూలాల నుంచి విడివడి ప్రపంచాన్ని అర్థం చేసుకునే క్రమంలో కొత్త భావాలు అంకురిస్తాయి. ఆ క్రమంలో విద్యార్థులు తమదైన నూతన ప్రపంచాన్ని ఆవిష్కరించుకుంటారు. నిజంగా పాఠశాల విద్య నుంచి దాటి ముందుకుపోవటం కొత్త ప్రపంచంలోకి ప్రవేశించటమే. కొత్త మనుషులుగా రూపాంతరం చెందటమే. నిజంగానే వారు కొత్త మనుషులు!

ఈ నేపథ్యంలో.. నేను 2019 ఎన్నికల తర్వాత ఓ మధ్యస్థ దశను చూస్తున్నాను. సనాతన భారతం పోయింది. కానీ నవ భారతం మాత్రం పరిపూర్తిగా రాలేదు. ఈ క్రమంలో నన్ను ఎప్పుడూ ఓ సందేహం వెన్నాడుతున్నది. ఒక విద్యావిషయక మనస్తత్వ శాస్త్ర బోధకుడిగా నా మెదడులో ఎప్పుడూ రాజకీయాలు చొరబడుతున్నాయి. ఇదొక సంక్షుభిత స్థితి. అంతకన్నా క్లిష్టమైనది. దానికి సమాధానంగా నా వద్ద రెండు సమాధానాలున్నాయి. మొదటిది-విద్య అనేది అనేక విషయజ్ఞానాల పరస్పరాధారితం. ఏ ఒక సబ్జెక్టును దానికదిగా శూన్యంలో బోధించలేం. మనస్తత్వ శాస్త్రానికి విడిగా రాజకీయాలుండవు. రాజకీయాలను అవగాహన చేసుకుంటే.. మనుషుల మనస్తత్వాలు ఏ విధంగా ఉన్నాయో, ఏ విధంగా పనిచేస్తున్నాయో తెలుసుకోవచ్చు. మీరూ ఒప్పుకుంటారు కదా?

ఇక రెండవది- నేను ఈ దేశ ప్రజాస్వామ్య ప్రతినిధిని. నాకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన కొన్ని హక్కులూ, బాధ్యతలున్నాయి. అందరిలాగే, మీలాగే నాకూ రాజకీయాల పట్ల, ఆ రాజకీయాల్లో భాగస్వామ్యం పట్ల నిర్దిష్ట ఆలోచనలున్నాయి.

నాకు తెలుసు.. మీలో కొంతమంది బీజేపీకి ఓటువేసి ఉండొచ్చు, కొందరు వేసి ఉండకపోవచ్చు. కొంతమంది మోదీ తిరిగి అధికారంలోకి రావటం సంతోషం కలిగించవచ్చు, కొందరికి కాకపోవచ్చు. నేను ఆ విషయంలోకి పోయి మీ ప్రాధాన్యాలను చర్చనీయాంశం చేసి, ప్రశ్నించాలనుకోవటం లేదు. ఎందుకంటే.. మీరు పెద్దలు. భావిభారత పౌరుల తల్లిదండ్రులు.

2019 సాధారణ ఎన్నికలు ముగిసిపోయినా.. ఇంకా దేశంలో రాజకీయ వేడి తగ్గలేదు. భావజాల పరమైన చర్చలు, వాదోపవాదాలు ఆగిపోలేదు. భావజాల పరమైన లెఫ్ట్, రైట్‌ల మధ్య సిద్ధాంతపరమైన పోరాటం ఆగలేదు. మనం కొంచెం వెనక్కి వెళ్లి గతకొంతకాలంగా సాగుతున్న రాజకీయ సైద్ధాంతిక పరమైన విషయాలను పరిశీలించినట్లయితే, మనకు అసలు విషయాలు బోధపడుతాయి. ఒక ప్రణాళికాబద్ధమైన రాజకీయ, సిద్ధాంతపరమైన విధానంతోనే అనేక ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అర్థమవుతుంది. దేశంలో రాజకీయంగా లెఫ్ట్, రైట్‌ల మధ్య సైద్ధాంతిక పోరాటంగా కనిపిస్తుంది. ఇది నైతికంగా రాజకీయంగా తప్పొప్పుల చర్చ కాదు. మొత్తంగా ఆ వాదాల సారాంశం ఏమిటన్నది ప్రధానం.

ఎన్నికల తర్వాత ఘోర మత వివక్ష ఘటనలు చోటుచేసుకున్నాయి. ఢిల్లీ సమీపంలోని గుర్‌గావ్‌లో ఒక యువకునిపై అతను ముస్లిం అయినందుకు దాడికి గురయ్యాడు. మనం కోరుకున్నది ఇలాంటి భారత్ కాదు. ఇలాంటి యువత కూడా కాదు. ఇక గ్రామాల పరిస్థితి చూస్తే.. గ్రామాల్లో కూడా వివక్ష విషబీజాలు నాటుకున్నాయి. టీవీ, సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత ప్రసంగాలు విని గ్రామాలు సైతం విషతుల్యమయ్యాయి. పాఠశాల స్థాయిలోనే విద్వేషం నింపబడుతున్నారు.

అంతిమంగా.. మీరంతా కొన్ని విషయాలను ఒప్పుకుంటారనుకుంటాను. ఒక మనిషి పట్లకానీ, మతం పట్లకానీ గుడ్డి ద్వేషం, వ్యతిరేకత తప్పు. కులోన్మాద చర్యలు తప్పు. ఇతరులను కించపర్చటం తప్పు. కుల, మతాల పేర మనుషులను పిలువటం తప్పు. హింస తప్పు. ఈ విధమైన వాటిని ఎవరు ఏ రూపంలో అనుసరించినా, వాటికి మద్దతు పలికినా అది తప్పు, నేరం. మనం ఒకటి గుర్తించాలి.

ఒక ఉపాధ్యాయుడిగా నా లక్ష్యం ద్విముఖమైనది. నేను బోధించే సబ్జెక్టులో విద్యార్థులు బాగా అవగాహన పెంచుకోవాలి. అలాగే వారిని నేనొక గొప్ప మానవీయ వ్యక్తులుగా తీర్చిదిద్దాలి. ఒక మనిషి గొప్ప వ్యక్తిగా ఎప్పుడు పరిగణింపబడుతాడం టే.. తన చుట్టూరా ఉన్న సమాజంలో జరుగుతున్న దాంట్లో మంచి, చెడులను గుర్తించగలిగినప్పుడు మాత్రమే. అయితే అనుకున్నంత సులవైన విషయం కాదు, రాత్రికిరాత్రి సాధించేది కూడా కాదు. కానీ నేను నా వృత్తిపరమైన జీవితంలో మంచిని ప్రేమించే, మానవీయ వ్యక్తులుగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పెట్టుకొని సాగిపోతున్నా. ఆ క్రమంలో నేను మీ బిడ్డలకు బోధిస్తున్నది తప్పక ఉపయోగపడుతుంది. ఉన్నత స్థానంలో నిలుపుతుంది.

ప్రతి ఒక్కరినీ గౌరవించు, ప్రేమించు. వివక్ష ప్రమాదాన్ని గుర్తెరిగి వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకో. నీ చేత ఎప్పుడు తప్పు జరిగినా వెంటనే క్షమించవమని వేడుకో. తప్పుల నుంచే జ్ఞానులు అనుభవాలు, గుణపాఠాలు నేర్చుకుంటారు. నాకు విశ్వాసమున్నది. మీరంత ఈ లక్షణాలతో తీర్చిదిద్దబడినారని.

ఎన్నికల తర్వాత ఘోర మత వివక్ష ఘటనలు చోటుచేసుకున్నాయి. ఢిల్లీ సమీపంలోని గుర్‌గావ్‌లో ఒక యువకునిపై అతను ముస్లిం అయినందుకు దాడికి గురయ్యాడు. మనం కోరుకున్నది ఇలాంటి భారత్ కాదు. ఇలాంటి యువత కూడా కాదు. ఇక గ్రామాల పరిస్థితి చూస్తే.. గ్రామాల్లో కూడా వివక్ష విషబీజాలు నాటుకున్నాయి. టీవీ, సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత ప్రసంగాలు విని గ్రామాలు సైతం విషతుల్యమయ్యాయి. పాఠశాల స్థాయిలోనే విద్వేషం నింపబడుతున్నారు.

మనకు తెలిసో, తెలియకో మన సామాజిక జీవనమంతా విద్వేషపూరితంగా మారిపోయిన స్థితిలో ఉన్నాం. ఇలాంటి పరిస్థితుల్లో మన పిల్లల జీవితాలు కూడా భద్రంగా లేవన్నది గుర్తించాలి. మత, కుల వివక్షా విద్వేషాలకు దూరంగా మన పిల్లలను పెంచాలి. ఇక్కడనే మనం పెద్దలుగా బాధ్యతాయుతంగా ఉండాలి. సమయం వచ్చింది.. ప్రియమైన తల్లిదండ్రులారా.. మీ బిడ్డలను, భావి భారత పౌరులను మానవీయ మనుషులుగా తీర్చిదిద్దండి. అదే మన భవిష్యత్తుకు, మన బిడ్డల భవిష్యత్తుకు ఉత్తమమైన మార్గం.

**(వ్యాసకర్త: విద్యావేత్త, విద్యా విషయక మనస్తత్వ శాస్త్రవేత్త) 'ది వైర్' సౌజన్యం..**

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.





సూర్యాపేట జిల్లా కేంద్రంలో టీఆర్ఎస్ సభ్యత్వం అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి


మేడ్చల్ జిల్లా పర్వతాపూర్‌లో శేరి సవితారెడ్డికి సభ్యత్వాన్ని అందిస్తున్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు


నిజామాబాద్ జిల్లా పోచంపాడ్‌లో కొత్తూరు లక్ష్మారెడ్డికి సభ్యత్వం అందజేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి

# ఉద్యమంలా సభ్యత్వ నమోదు


నారాయణపేట జిల్లా నర్వలో సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న మక్తల్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


జగిత్యాల జిల్లాకేంద్రంలో సభ్యత్వం అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్


ఆదిలాబాద్ మండలం బట్టి సవర్గాంలో పార్టీ సభ్యత్వ రశీదును అందజేస్తున్న డీడీసీ చైర్మన్ లోక భూమారెడ్డి, ఎమ్మెల్యే జోగు రామన్న

జోరుగా సాగుతున్న కార్యక్రమాలు ▪ గ్రామాల్లో విశేష స్పందన

స్వచ్ఛందంగా ముందుకొస్తున్న ప్రజలు

మరింత పటిష్టంగా గులాబీదళం

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు ఉద్యమంలా సాగుతున్నాయి. గత కొన్ని రోజులుగా అన్ని జిల్లాల్లో జరుగుతున్న ఈ కార్యక్రమంలో పార్టీ అభిమానులు, యువత, ఉద్యోగులు స్వచ్ఛందంగా సభ్యత్వాలు స్వీకరిస్తున్నారు. బుధవారం పలు జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు పార్టీ జిల్లా, నియోజకవర్గాల ఇంచార్జిలు, నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వాలు అందించారు.

**రికార్డు స్థాయిలో సభ్యత్వాలు**

టీఆర్ఎస్ సభ్యత్వ నమోదుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తీసుకుంటున్నారని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. ఆజంపురా డివిజన్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో హైదరాబాద్ పార్లమెంట్ టీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో పలువురికి సభ్యత్వాలు అందజేశారు.

**యజ్ఞంలా చేపట్టాలి : మంత్రి మల్లారెడ్డి**

సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని యజ్ఞంలా చేపట్టాలని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మేడ్చల్ నియోజకవర్గంలో నియోజకవర్గలో పలు ప్రాంతాల్లో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి మంత్రి పర్యటించి సభ్యత్వ నమోదు చేయించారు.

**స్వచ్ఛందంగా రావడం అభినందనీయం :**

టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా రావడం అభినందనీయమని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో సభ్యత్వ నమోదును పరిశీలించారు. నాగారం, అర్వపల్లి మండలాల్లో ఎమ్మెల్యే గాదరి కిశోర్, పాలకవీడు, నేరేడుచర్ల మండలాల్లో టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**సభ్యత్వ నమోదులో భాగస్వాములవుదాం**

సభ్యత్వ నమోదులో పార్టీ నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు లక్ష్మారెడ్డికి ఆయన తొలి సభ్యత్వం అందజేశారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి పాల్గొన్నారు.

**ఉద్యమంలా చేపట్టాలి : మంత్రి అల్లోల**

సభ్యత్వాన్ని ఉద్యమంలా చేపట్టాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సొనాలలో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పాల్గొన్నారు.

**వివిధ జిల్లాల్లో..**

జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, పెద్దపల్లి జిల్లా కాసులపల్లిలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో పార్టీ ఇంచార్జి మూల విజయారెడ్డి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బెల్లంపల్లి, బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాలలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సభ్యత్వ నమోదు అందజేశారు. అలాగే కోటపల్లిలో మూల విజయారెడ్డి , క్యాతనపల్లి మున్సిపాలిటీలో మంచిర్యాల జెడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ప్రారంభించారు.ఆసిఫాబాద్‌లోఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ పురాణం సతీశ్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఆదిలాబాద్ జెడ్పీ చైర్ పర్సన్ రాథోడ్ జనార్దన్, జిల్లా ఇంచార్జి నారదాసు లక్ష్మణ్‌రావు, కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సభ్యత్వాలు ప్రారంభించారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం దోనూరు, సింగందొడ్డి గ్రామాల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, దేవరకద్ర, చిన్నచింతకుంటలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నారాయణపేట జిల్లా మక్తల్‌లో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి సభ్యత్వాలను ప్రారంభించారు.మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే రెడ్యానాయక్, కేసముద్రంలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్, వరంగల్ అర్బన్ జిల్లా ఖిలావరంగల్‌లో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ధర్మసాగర్ మండలం నారాయణగిరిలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పలువురికి సభ్యత్వాలు అందజేశారు.ఆదిలాబాద్ మండలం బట్టి సవర్గాం, చాందా, బేల మండల కేంద్రాల్లో బుధవారం ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి సభ్యత్వ నమోదు ఇంచార్జి లోక భూమారెడ్డి సభ్యత్వాలు అందజేశారు.హైదరాబాద్ అల్వాల్‌లోని మెదక్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లక్ష్మీకాంతరావుకు గ్యాదరి బాలమల్లు సభ్యత్వాన్ని అందించారు.


రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి


నాగోలు డివిజన్‌లో టీఆర్ఎస్ సభ్యత్వం అందజేస్తున్న ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ తదితరులు

**తెలంగాణభవన్‌లో..**

టీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం టీఆర్ఎస్‌కేవీ ఆధ్వర్యంలో ఐదు లక్షల సభ్యత్వాలు నమోదుచేసే లక్ష్యంతో పనిచేయాలని టీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ పిలుపునిచ్చారు. తెలంగాణభవన్‌లో బుధవారం జరిగిన టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర నాయకుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర కార్యదర్శులు గట్టు రాంచందర్‌రావు, ఎల్ రూప్‌సింగ్, టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ, ఉపాధ్యక్షుడు మారయ్య, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

✦ జనగామలోని ఎమ్మెల్యే క్యాంపుఆఫీస్‌లో సభ్యత్వ నమోదు కంప్యూటీకరణ (ఆన్‌లైన్) ప్రక్రియను రాష్ట్ర వికలాంగుల సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి, జనగామ జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ప్రారంభించారు.

✦ టీఆర్ఎస్ సభ్యత్వాన్ని పండుగలా చేపట్టాలని ఎల్బీనగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ అన్నారు. నియోజకవర్గంలోని కొత్తపేట, గడ్డిఅన్నారం, నాగోలు డివిజన్లలో నిర్వహించిన టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు.

✦ రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రంలోని స్టార్ గార్డెన్‌లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట్ల ప్రశాంతి, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు కొలన్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


వరంగల్ అర్బన్ జిల్లా నారాయణగిరి గ్రామంలో పార్టీ సభ్యత్వాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య


సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో సభ్యత్వం అందిస్తున్న టీఎస్ ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు


కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు) జెడ్పీటీసీ కోవ అరుణకు సభ్యత్వం అందజేస్తున్న ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు


మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో సభ్యత్వాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే రెడ్యానాయక్


వరంగల్ అర్బన్ జిల్లా ఖిలావరంగల్‌లో సభ్యత్వం అందజేస్తున్న ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

## రైతులు కోరుకున్న విధంగా పరిహారం

దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

ప్యాకేజీ-27 కింద రూ.13 కోట్ల పరిహారం పంపిణీ


నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో రైతులకు చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

**నిర్మల్ టౌన్:** కాళేశ్వరం నీళ్లతో నిర్మల్ జిల్లాలో లక్ష ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రాష్ట్రప్రభుత్వం 27, 28 ప్యాకేజీల నిర్మాణం చేపట్టిందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో కుంటాల మండలం ఓల గ్రామానికి చెందిన రెండు వందల మంది రైతులకు ప్యాకేజీ-27 కింద రూ. 13.30 కోట్లు భూ పరిహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భూములు కోల్పోయిన రైతులకు వారు కోరుకున్న మేరకు పరిహారం అందించనున్నట్లు తెలిపారు. పరిహారం డబ్బులతో రైతులు భూములు కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

## కరీంనగర్ దవాఖాన

# రూపురేఖలు మారుస్తాం

- మరో 400 పడకలతో ఆధునీకరణ
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్

**కరీంనగర్ హెల్త్:** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన రూపు రేఖలను ఏడాదిలోగా మారుస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన దవాఖాన పాత భవనంతోపాటు మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్), నర్సింగ్ స్కూల్, డయాలసిస్ సెంటర్, వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రధాన దవాఖానకు రోగుల తాకిడి ఎక్కువైందనీ, అందుకు అనుగుణంగా సౌకర్యాలు లేవని గమనించిన సీఎం కేసీఆర్ వెంటనే పాత భవనం తొలగించి నూతన భవనాన్ని నిర్మించాలని ఆదేశించారన్నారు. ఈమేరకు కొత్త భవనంలో ప్రస్తుతమున్న 350 పడకలకు అదనంగా మరో 300 పడకలు, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతమున్న 150 పడకల సామర్థ్యాన్ని మరో వంద పడకలకు పెంచుతూ మొత్తం దవాఖాన 900 పడకల సామర్థ్యానికి పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇక్కడికి ఉమ్మడి కరీంనగర్‌తోపాటు ఆదిలాబాద్, సరిహద్దు రాష్ట్రాల ప్రజలు వస్తుంటారనీ, వారికి పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తామన్నారు.


కరీంనగర్ ప్రభుత్వం దవాఖానను పరిశీలిస్తున్న మంత్రి ఈటల రాజేందర్


మిషన్ భగీరథ పనులపై కలెక్టర్ అమయ్‌కుమార్‌తో కలసి సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, ఎస్పీ వెంకటేశ్వర్లు

## భగీరథ పనుల్లో వేగం పెంచాలి

మిషన్ భగీరథపై సమీక్షా సమావేశంలో మంత్రి జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట, నమస్తే తెలంగాణ:** మిషన్‌భగీరథ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం సూర్యాపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ అమయ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ సమీక్షలో పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 1139 ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులకుగాను 766ట్యాంకులకు పైప్‌లైన్ కనెక్షన్లు ఇచ్చామని, పెండింగ్‌లో ఉన్న 373 ట్యాంకులకు త్వరితగతిన కనెక్షన్లు కలిపి నీరందిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 860 హ్యాబిటేషన్‌లకు పైప్‌లైన్ ద్వారా నీళ్లు అందించామని, అందులో 581 హ్యాబిటేషన్‌లలో నల్లాల ద్వారా నీరు సరఫరా జరుగుతున్నదని తెలిపారు. సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, ఎస్పీ ఆర్ వెంకటేశ్వర్లు, డీఆర్వో చంద్రయ్య, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అనారోగ్యం బారిన పడి చికిత్స చేయించుకుని సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న వనపర్తి నియోజకవర్గానికి చెందిన 17 మందికి మంజూరైన రూ.3,63,800 విలువైన చెక్కులను బుధవారం వనపర్తిలోని తన నివాసంలో వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అందజేశారు. - వనపర్తి, నమస్తే తెలంగాణ

## తేనెటీగల దాడిలో ఒకరి మృతి

పలువురికి గాయాలు

**గంగాధర:** తేనెటీగల దాడిలో ఒకరు మృతి చెందిన ఘటన కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తిలో బుధవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చనిపోగా అంత్యక్రియలకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో తేనెటీగలు దాడిచేశాయి. ఈ ఘటనలో కొలకాని లచ్చయ్య(57) తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడిని కరీంనగర్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మరో నలుగురు గాయపడగా, చికిత్స కోసం కరీంనగర్ ప్రధాన దవాఖానకు తరలించారు. మరో 40 మందికి గ్రామంలో ప్రథమ చికిత్స చేయడంతో కోలుకుంటున్నారు.

# ‘రివర్స్ పంపింగ్ పథకం’ ఇంజినీరింగ్ అద్భుతం

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**నిజామాబాద్/నమస్తే తెలంగాణ ప్రతినిధి / మెట్‌పల్లి నమస్తే తెలంగాణ /మల్యాల/ ఇబ్రహీంపట్నం:** ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ఇంజినీరింగ్ అద్భుతమని రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన నిజామాబాద్ జిల్లా ముప్కాల్ వద్ద నిర్మిస్తున్న ‘పునర్జీవ పథకం’ పంపుహౌస్ పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పునర్జీవ పథకంలో భాగంగా జగిత్యాల జిల్లా రాంపూర్, రాజేశ్వర్‌రావుపేట్ వద్ద పంపుహౌస్‌ల్లో 0.6 టీఎంసీల నీటిని పంపింగ్ చేసేలా మోటర్లు సిద్ధమవుతున్నాయని చెప్పారు. ఇరవై రోజుల్లోగా రివర్స్ పంపింగ్‌తో కాళేశ్వరం నీళ్లు ఎస్సారెస్పీకి చేరుతాయని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రివర్స్ పంపింగ్ పథకం ద్వారా 200 కి.మీ దూరంలోని కాళేశ్వరం జలాలు వెనక్కి ప్రవహిస్తూ వరద కాలువ ద్వారా ఎస్సారెస్పీకి చేరే అద్భుత దృశ్యాన్ని చూడబోతున్నామన్నారు. కేవలం రూ.1,080 కోట్లతో 60 టీఎంసీల నీటిని వినియోగించుకోగలిగే మరో కొత్త ప్రాజెక్టుగా రివర్స్ పంపింగ్ పథకాన్ని ఆయన అభివర్ణించారు. ఎస్సారెస్పీలోకి నీరు చేరడానికి మూడు పంపుహౌస్‌ల్లో 24 మోటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అక్టోబర్‌లో ట్రయల్‌రన్ నిర్వహించేలా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ముప్కాల్ పంప్‌హౌస్ వద్ద ఉన్నతాధికారులతో పునర్జీవ పథకం పనులపై మంత్రి సమీక్షించారు. అనంతరం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావు పేట్, రాంపూర్ లో నిర్మిస్తున్న పంప్‌హస్ పనులను మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, చొప్పదండి, జగిత్యాల ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. మంత్రి వెంట నిజామాబాద్ కలెక్టర్ ఎం రామ్మోహన్‌రావు, ఆర్మూర్ ఆర్డీవో శ్రీనివాసులు, ప్రాజెక్టు ఇంచార్జి సుధాకర్‌రెడ్డి, ఎస్ఈ శ్రీకాంత్‌రావు, ఈఈ సుధాకిరణ్, ఏజెన్సీ డీజీఎం డీవీ నారాయణ, డీఈ రాంప్రదీప్, ఏఈలు రూప్లానాయక్, ప్రవీణ్‌కుమార్, టీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.


జగిత్యాల జిల్లా రాంపూర్ పంప్‌హౌస్ వద్ద మంత్రి కొప్పులతో మాట్లాడుతున్న మంత్రి వేముల

## ముగ్గురు ఎంపీటీసీలపై వేటు

**గుడిహత్నూర్:** ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికల్లో విప్‌ను ధిక్కరించిన ముగ్గురు ఎంపీటీసీల పదవులను రద్దుచేస్తూ ప్రిసైడింగ్ అధికారి బానోవత్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పరిషత్ ఎన్నికల్లో కొల్హారి, తోషం, మచ్చాపూర్‌ల నుంచి రాథోడ్ పుండలిక్, శగీర్‌ఖాన్, జాదవ్ వత్సలా బాయి ఎంపీటీసీలుగా గెలుపొందారు. జూన్15న ఎంపీడీవో కార్యాలయంలో మండలాధ్యక్షుని ఎన్నికలో టీఆర్ఎస్ మన్నూర్ ఎంపీటీసీ న్యానుకు పార్టీ బీ ఫారం జారీ చేసింది. విప్‌ను ధిక్కరించి టీఆర్ఎస్ నుంచి గెలుపొందిన కొల్హారి ఎంపీటీసీ రాథోడ్ పుండలిక్‌కు వారిద్దరు మద్దతు తెలిపారు. దీనిపై సంజాయిషీ ఇవ్వాలని వారికి నోటీసులు జారీ చేశారు. విప్‌ను ఉల్లంఘించినట్టు రుజువు కావడంతో ఎంపీటీసీ పదవులకు అనర్హులుగా భావిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE



## కాటారం తాసిల్దార్, ఆర్ఐ బదిలీ

- 'కొత్త పాస్‌పుస్తకానికి రూ.20 లక్షలు!' కథనానికి స్పందన
- తాసిల్‌లో విచారణ చేపట్టిన జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్
- బాధిత రైతు ఉమాదేవికి వెంటనే పాస్‌బుక్ ఇవ్వాలని ఆదేశం



కాటారం తాసిల్ కార్యాలయంలో భూరికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/కాటారం:** రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించకుండా రైతులను ఇబ్బంది పెడుతున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం తాసిల్దార్ దత్తు ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను బదిలీచేస్తూ కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఇద్దరినీ కలెక్టరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. 'కొత్త పాస్‌పుస్తకానికి రూ.20 లక్షలు!' శీర్షికతో బుధవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ వెంటనే స్పందించారు. ఉదయం భూపాలపల్లి ఆర్డీవోతో కలిసి కాటారం తాసిల్ కార్యాలయానికి చేరుకొని తాసిల్దార్, ఆర్ఐ, వీఆర్వోపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పాస్‌పుస్తకం కోసం పైసలు అడిగినట్టు వచ్చిన ఆరోపణలపై ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం బాధితురాలు ఉమాదేవి భూములపై విచారణ చేపట్టారు. పలుసార్లు ఉమాదేవి కుటుంబసభ్యులు సంప్రదించినా పాస్‌పుస్తకం ఎందుకు ఇవ్వలేదని అధికారులను ప్రశ్నించారు. కుటుంబసభ్యుల మధ్య పంపకాల్లో వివాదం నెలకొన్నదని విచారణలో తేలింది. భూప్రక్షాళనలో బాధితురాలికి పాస్‌పుస్తకం కూడా మంజూరైందని.. ఆమె భాగం కింద వచ్చిన భూమిలో కొంత అమ్ముకున్నారని తాసిల్దార్ వివరించారు. న్యాయబద్ధంగా బాధితురాలికి 8.21 ఎకరాలు వస్తుందని కలెక్టర్ నిర్ధారించారు. బాధిత కుటుంబసభ్యులను పిలిపించి వారితో చర్చించారు. భూమికి సంబంధించి రెవెన్యూ పత్రాలు, పాత పాస్‌పుస్తకాలు సక్రమంగా ఉన్నందున ఉమాదేవికి 8.21 ఎకరాలకు కొత్త పాస్‌పుస్తకాన్ని వెంటనే అందించాలని ఆదేశించారు. బాధితురాలి భూమి వివరాలను కలెక్టర్, ఆర్డీవో దగ్గరుండి ఆన్‌లైన్ చేయించారు. 8.21 ఎకరాలకు 1బీ, ఆర్వోఆర్ కాపీ, భూమి యాజమాన్య హక్కు పత్రం అందజేశారు. సాయంత్రం తాసిల్దార్, ఆర్ఐని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పదేండ్లుగా పరిష్కారానికి నోచుకోని తమ భూవివాదాన్ని, 'ధర్మగంట' ద్వారా తెలుసుకొని, కేవలం గంటలోపు పరిష్కరించిన జిల్లా కలెక్టర్‌కు, 'నమస్తే తెలంగాణ'కు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలియజేసింది.



బదిలీ వేటుపడిన తాసిల్దార్ దత్తు ప్రసాద్, ఆర్ఐ ప్రవీణ్‌కుమార్

ధర్మగంట నమస్తే ఎఫెక్ట్ DHARMA GANTA

## కొత్త పాస్‌బుక్ కోసం..

# 43 సార్లు దరఖాస్తు!

### స్పందించని రెవెన్యూ అధికారులు

ఉన్నతాధికారుల ఆదేశాలు ఖాతరుచేయని తాసిల్దార్ • పాస్‌పుస్తకానికి రూ.25 వేలు డిమాండ్

నిజామాబాద్ జిల్లా తాళ్ల రాంపూర్ రైతు ముత్తాగౌడ్ ఆవేదన • రైతుబంధుకూ దూరమయ్యానంటున్న అన్నదాత

**ఏర్గట్ల:** నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ గ్రామానికి చెందిన రైతు ఆకుల ముత్తాగౌడ్‌కు తాళ్ల రాంపూర్ శివారులో సర్వే నంబర్ 299/ఆ లో 37 గుంటలు, గుమ్మిర్యాల్ శివారులో సర్వే నంబర్ 240/1 లో 2.27 ఎకరాలు, గుమ్మిర్యాల్ శివారులో సర్వే నంబర్ 240/4 లో 1.01 ఎకరాల భూమి ఉన్నది. భూరికార్డుల ప్రక్షాళన తర్వాత సర్వే నంబర్ 240/4లోని భూమికి మాత్రమే పాస్‌బుక్ ముత్తాగౌడ్ పేరున వచ్చింది. మిగతా సర్వే నంబర్లలోని భూములకు కొత్త పాస్‌బుక్ ఇచ్చేందుకు అధికారులు నానా ఇబ్బందులు పెడుతున్నారు. వ్యవసాయ భూములకు సంబంధించి రావాల్సిన కొత్త పట్టా పాస్‌బుక్ కోసం ముత్తాగౌడ్.. ఏడాదిగా ఏర్గట్ల తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. కార్యాలయంలో ఇప్పటివరకు 43 సార్లు దరఖాస్తు చేసుకున్నా.. అధికారుల్లో చలనంలేదు. చేతులు తడిపితే తప్ప రెవెన్యూ అధికారులు పనిచేయడంలేదని ముత్తాగౌడ్ చెప్తున్నారు. నెలకిందట కొన్ని కారణాలతో ప్రభుత్వానికి సరెండర్ అయిన తాసిల్దార్ లక్ష్మణ్ తమ భూములకు సంబంధించిన కొత్త పాస్‌బుక్‌తోపాటు రైతుబంధు ఇప్పించడానికి రూ.25 వేలు డిమాండ్‌చేశారని ఆరోపించారు. లంచం అడుగడంతో తాను నిజామాబాద్ కలెక్టర్, ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదుచేసినట్టు తెలిపారు. స్పందించిన కలెక్టర్, ఆర్డీవో సదరు తాసిల్దార్ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారని, పని పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేశారని చెప్పారు. కానీ, తాసిల్దార్ మాత్రం తన సమస్యను పట్టించుకోలేదని ముత్తాగౌడ్ వాపోయారు. రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న రైతుబంధు సాయాన్ని ఇప్పటికే రెండు విడుతలు కోల్పోయానని, దీనికి రెవెన్యూ అధికారులు, తాసిల్దారే కారణమని ఆవేదన వ్యక్తంచేశారు. ఉన్నతాధికారులు స్పందిం చి కొత్త పాస్‌పుస్తకాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ముత్తాగౌడ్ కోరుతున్నారు.



ముత్తాగౌడ్ పాత పాస్‌పుస్తకం

### దరఖాస్తు చేసుకుంటే న్యాయంచేస్తాం

కొన్ని రోజులుగా ఏర్గట్ల మండలానికి ఇంచార్జి తాసిల్దార్‌గా పనిచేస్తున్నా. రైతు ఆకుల ముత్తాగౌడ్ కొత్త పాస్‌పుస్తకం కోసం నాకు ఎలాంటి వినతి అందజేయలేదు. ఫిర్యాదు రాలేదు. నా దృష్టికి వస్తే తప్పకుండా న్యాయంచేస్తా.

- వెంకట్రావు, మోర్తాడ్ ఇంచార్జి తాసిల్దార్

## మా భూమి మాకు ఇప్పించాలి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మాది కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నర్సింహులపల్లె. గ్రామంలోని సర్వే నంబర్లు 349, 348, 118లలో మా భూములున్నాయి. మా తండ్రి పెద్దయ్య. ఆయనకు మేం ఇద్దరు కుమారులం. మా అన్న అరిగె నర్సయ్య, మా నాన్నతోపాటే ఊళ్లోనే ఉంటూ ఆ భూమిలో వ్యవసాయం చేస్తున్నారు. మా అమ్మకు తమ్ముడైన ఈర్ల లింగయ్య బతుకుదెరువు కోసం మా ఊరికి వచ్చి మా పశువుల కొట్టంలో ఆశ్రయం పొంది.. తన కూతురును మా అన్నకు ఇచ్చి 1990లో వివాహంచేశారు. ఆయన చాలాకాలంగా మా ఇంటి పేరుతోనే అరిగె లింగయ్యగా చెలామణి అవుతున్నారు. దాని ఆసరాగా చేసుకొని మమ్మల్ని మోసంచేసి మా భూములను అక్రమంగా తన పేరు మీదకు రెవెన్యూ రికార్డుల్లో మార్పించుకొన్నారు. రెవెన్యూ సిబ్బంది లింగయ్యకు సహకరించారు. మొత్తం 7.28 ఎకరాలకు 45 ఏండ్లుగా మా నాయనమ్మ, మా నాన్న పట్టాదార్లు, అనుభవదార్లుగా ఉన్నారు. అందులో 3.33 ఎకరాల భూమిని అరిగె లింగయ్య 2000 సంవత్సరంలో రెవెన్యూ రికార్డుల్లో (పహాణీలో) ఏ ఆధారం లేకుండా అక్రమంగా నమోదు చేయించుకొన్నారు. అధికారులు తగిన విచారణ జరిపించి లింగయ్య పేరున ఉన్న పాస్‌పుస్తకాలు రద్దు చేసి సరైన హక్కుదారులకు ఇప్పించాలని కోరుతున్నాం.

- అరిగె రాజమౌళి, నర్సింహులపల్లె, కరీంనగర్ జిల్లా

## 36 గుంటలకు ముప్పుతిప్పలు

**కేసముద్రం రూరల్:** మాది మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కోరుకొండపల్లి. మా తండ్రి ఇట్టబోయిన కట్టయ్య.. మా గ్రామానికే చెందిన బ్రాహ్మణపల్లి కిష్టయ్య వద్ద సర్వే నంబర్ 320/ఇలో 36 గుంటల భూమిని 1968లో కొన్నారు. కానీ, అప్పుడు మా నాయిన పేరున పట్టా చేయించుకోలేదు. అప్పటి నుంచి కాస్తులో మేమే ఉంటున్నాం. 1980లో కిష్టయ్య కుమారుడు పుల్లయ్య ఆ భూమిని తన తండ్రి ఎవరికీ అమ్మలేదని కోర్టుకు వెళ్లాడు. మమ్మల్ని బెదిరించి బలవంతంగా కాస్తు నుంచి వెళ్లగొట్టాడు. బతుకుదెరువు లేక నేను, నా భార్య వరంగల్‌కు వచ్చి కూలినాలి చేసుకుంటూ బతుకుతున్నాం. నా కొడుకు వేరే రాష్ట్రం వెళ్లిపోయి బతుకుతున్నాడు. మేం గ్రామం నుంచి వచ్చిన తర్వాత మిగతా రైతులు పుల్లయ్యతో రాజీ కుదుర్చుకుని వారివారి భూములకు పట్టాలు చేయించుకున్నారు. నేను మాత్రం పుల్లయ్య పెట్టిన కొన్ని షరతులకు అంగీకరించకపోవడంతో నాకు పట్టా చేయలేదు. అయినప్పటికీ పట్టా కోసం అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నా. మా గోడు ఎవరూ పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా 15.06.2018న పట్టా ఇప్పించాలని తాసిల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నా. అధికారులు సర్వే నంబర్ 320/ఇలో భూమి వివరాలు తెలుసుకోవడానికి విచారణకు వెళ్లగా, నా భూమి పక్కనే ఉన్న కాసాని చంద్రయ్య అనే రైతు నేను చనిపోయానని, నాకు వారసులు ఎవరూ లేరని తప్పుడు సమాచారం ఇచ్చి అధికారులను తప్పుదోవ పట్టించాడు. ఆ తర్వాత కొందరు అధికారులతో కుమ్మక్కై సాదాబైనామాలో చంద్రయ్య పేరు నమోదుచేసుకుని పాస్‌పుస్తకం పొందాడు. నాకు జరిగిన అన్యాయంపై అప్పటి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరిని కూడా కలిస్తే ఆయన సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. నా భూమి నాకు ఇప్పించాలని, పట్టా కాగితాలు చేయాలని పలుమార్లు వీఆర్వోలకు, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ కనికరించడం లేదు. మాకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను వేడుకొంటున్నా.

- ఇట్టబోయిన బుచ్చయ్య, బాధితుడు



ఇట్టబోయిన బుచ్చయ్య దంపతులు

## సూర్యాపేట జిల్లాలో వీఆర్వో సస్పెన్షన్

**సూర్యాపేట, నమస్తే తెలంగాణ:** భూరికార్డుల ప్రక్షాళనలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించడంలో ఇబ్బందులకు గురి చేసినందుకు సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం భక్తళాపురం, మహ్మదాపురం వీఆర్వో అన్వర్ హుస్సేన్‌ను బుధవారం కలెక్టర్ అమయ్‌కుమార్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. మంగళవారం పెన్‌పహాడ్ మండలంలో రైతులతో ముఖాముఖి నిర్వహించిన కలెక్టర్‌కు భక్తళాపురం, మహ్మదాపురం గ్రామస్థులు సదరు వీఆర్వోపై ఫిర్యాదులుచేశారు. భూరికార్డుల ప్రక్షాళనలో నిర్లక్ష్యం వహించారని, అర్హులైన రైతుల పేర్లు ఆన్‌లైన్ చేయలేదని, కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ఈ విషయమై విచారించిన రెవెన్యూ అధికారుల నివేదిక మేరకు కలెక్టర్ అమయ్‌కుమార్ ఆ వీఆర్వోను తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

## పాస్‌బుక్ ఇస్తలేడని వీఆర్వో నిర్బంధం

### సూర్యాపేట జిల్లా గాంధీనగర్‌తండాలో ఘటన

**చింతలపాలెం:** పాస్‌పుస్తకం ఇస్తలేదని ఓ రైతు వీఆర్వోను నిర్బంధించిన ఘటన బుధవారం సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం గాంధీనగర్‌తండాలో చోటుచేసుకున్నది. మండలంలోని దొండపాడుకు చెందిన రైతు త్రిపురం వెంకటరెడ్డి 30 ఏండ్ల నుంచి గ్రామ శివారులో తనకున్న 1.20 ఎకరాల భూమిని సాగుచేసుకుంటున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం కోసం తాసిల్ కార్యాలయం చుట్టూ కొన్నేండ్లుగా తిరుగుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా.. వీఆర్వోను ఎన్నిసార్లు కలిసినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్తూ వస్తున్నారు. బుధవారం గాంధీనగర్‌తండాలోని పంచాయతీ కార్యాలయానికి వచ్చిన వీఆర్వో షేక్ ఉస్మాన్‌పై సదరు రైతు ఆగ్రహం వ్యక్తంచేశారు. పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి నిలదీశారు. కొంతసేపటి తర్వాత వీఆర్వోను వదిలేశారు. గ్రామంలోని మరికొందరు రైతులు కూడా తమ పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వడంలో వీఆర్వో షేక్ ఉస్మాన్ జాప్యం చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సకాలంలో పాస్‌పుస్తకాలు అందజేయాలని కోరారు.



గాంధీనగర్‌తండాలోని పంచాయతీ కార్యాలయంలో వీఆర్వో షేక్ ఉస్మాన్‌ను నిర్బంధించిన దృశ్యం

## వారసులను కాదని ఇతరులకు పట్టా

- రద్దుచేయాలని ఏండ్ల తరబడి బాధితుల విన్నపం
- ఏండ్లు తిరుగుతున్న మంచిర్యాల జిల్లా కన్నెపల్లి రైతులు

**నెన్నెల(కన్నెపల్లి):** నలభై ఏండ్ల పట్టా భూమిని అధికారులు వారసులు ఉండగానే ఇతరులకు పట్టాచేశారు. ఇదేమిటని అడిగితే పట్టించుకొనేవారు లేక అన్నదమ్ములు పోచు మేర, శంకర్ ఏండ్ల తరబడి ఆ భూమి కోసం చెప్పులరిగేలా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో చివరికి ధర్మగంటను ఆశ్రయించారు. మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండల కేంద్రం మొత్కులపల్లి శివారులోని సర్వే నంబర్ 53లో 7.16 ఎకరాల భూమి 1953 నుంచి శిండే బజారు మేర పేరిట పట్టా ఉన్నది. ఈ భూమి ఏటా ఇతడి పేరిట రికార్డుల్లో నమోదవుతూ వస్తున్నది. బజారు మేర మృతి చెందడంతో అతని కొడుకులు సాగుచేసుకొంటున్నారు. 1993లో అప్పటి వీఆర్వో.. ఈ భూమిని పట్టాదారుగా ఉన్న బజారు మేర పేరును తొలగించి కొట్రంగి కొండు మేర, కొట్రంగి నారాయణ పేరిట నమోదుచేశారు. ఈ విషయం తెలుసుకున్న బజారు మేర కొడుకు పోచు మేర అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వారసత్వంగా వచ్చిన భూమి ఇలా ఎలాంటి హక్కులేని వారికి పట్టాచేశారంటూ అన్నదమ్ములు ఇద్దరూ చెప్పులరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో వీఆర్వో చేసిన తప్పిదాన్ని ఇప్పుడు ఎవరూ మార్చడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పట్టా మార్పిడి జరిగినప్పుడు ఎలా మారిందో ఫాం-7లో స్పష్టంగా రాస్తారు కానీ, ఇక్కడ అలాంటిది జరుగలేదు. కేవలం పహాణీలో ఎక్కించి ఆన్‌లైన్‌లో మార్చారు. తమకు న్యాయం చేయాలని అన్నదమ్ములు ఇద్దరూ కనిపించిన ప్రతి అధికారికి ఏండ్లుగా వినతిపత్రాలు అందిస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయంచేయాలని వేడుకొంటున్నారు.



శిండే పోచు మేర, శంకర్

## అందని పాస్‌పుస్తకం

- వేలిముద్రలు పడక, ఐరిష్ నమోదు కాక ఇబ్బందులు
- మూడుసార్లు రైతుబంధు కోల్పోయిన బాధితుడు
- ప్రత్యామ్నాయం చూపాలంటున్న నల్లగొండ జిల్లా అజ్మాపురం రైతు

**స్పష్టంగా మాట్లాడలేని.. వికలాంగుడు, నిరక్ష్యరాస్యుడైన ఓ రైతు వేలిముద్రలు పడక, ఐరిష్ నమోదు కాక కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం పొందలేకపోతున్నారు. దీంతో మూడుసార్లు రైతుబంధు సాయం అందని ద్రాక్షే అయింది. భూమికి సంబంధించి రికార్డులు అన్నీ సరిగానే ఉన్నా.. ఈ సమస్యకు తమ వద్ద కూడా పరిష్కారం లేదని, రాష్ట్రస్థాయిలోనే పరిష్కారం చూపాలని మండల అధికారులు చెప్తున్నారు. దీంతో బాధితుడు నల్లగొండ జిల్లా అజ్మాపురం గ్రామానికి చెందిన మారుపాకుల వెంకటయ్య ప్రత్యామ్నాయం చూపాలని వేడుకొంటున్నారు.**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నల్లగొండ జిల్లా, పెదఅడిశర్లపల్లి మండలం, అజ్మాపురం గ్రామానికి చెందిన మారుపాకుల వెంకటయ్య.. తండ్రి పేరిట సర్వే నంబర్ 292/ఆ లో ఉన్న 1.37 ఎకరాల భూమిని 2014 డిసెంబర్ 16న తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారు. రిజిస్ట్రేషన్ భూమి వివరాలు ఆన్‌లైన్‌లో కూడా అప్‌డేట్ అయ్యాయి. అప్పట్లో ఈ భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకం సైతం జారీచేశారు. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో కొత్త పాస్‌పుస్తకం మాత్రం జారీకాలేదు. రెవెన్యూ కార్యాలయాల చుట్టు 18 నెలలపాటు తిరిగినా అధికారులు స్పందించలేదు. చివరికి గత నెల 12వ తేదీన వేలిముద్రలు సేకరిస్తుంటే అవి పడటంలేదు కాబట్టి కొత్త పాస్‌పుస్తకం ఇవ్వలేమంటూ తెల్చిచెప్పారు. దీనికి ప్రత్యామ్నాయం సూచించాలని ఆర్డీవో ఇతర కార్యాలయాల చుట్టూ తిరిగారు. చివరికి ఐరిష్‌ను సేకరించాలని ఆర్డీవో ఆదేశాలు జారీచేశారు. ఐరిష్ కూడా నమోదు కాలేదు. దీంతో బాధితుడు వెంకటయ్యకు ఏమి చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. బాధితుడు స్పష్టంగా మాట్లాడలేరు, పైగా వికలాంగుడు, నిరక్ష్యరాస్యుడు. అతని తండ్రి గత ఏడాది మరణించారు. తల్లి కూడా కొడుకు వెంకటయ్యపైనే ఆధారపడి జీవిస్తున్నారు. జీవనాధారమైన భూమి తమ పేరిట లేకపోవడం, రైతుబంధు సాయం రాకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు పథకం కింద పెట్టుబడి సాయం పొందలేకపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని వేడుకొంటున్నారు. వేలిముద్రలు, ఐరిష్ పడని వారికి ప్రత్యామ్నాయం ద్వారా కొత్త పాస్‌పుస్తకం జారీ అయ్యేలా చూడాలని కోరుతున్నారు. ఈ సమస్యకు తమ స్థాయిలో పరిష్కారం చూపలేమని, సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, కలెక్టర్ సీసీఎల్‌ఏ అధికారులకు రాస్తే పరిష్కారం చూపితే.. కొత్త పాస్‌పుస్తకం జారీచేస్తామని మండల రెవెన్యూ అధికారులు చెప్తున్నారు.

## పత్రాలున్నా పట్టా చేస్తలేరు

రెండేండ్లుగా తిప్పించుకొంటున్న అధికారులు ■ ధర్మగంటను ఆశ్రయించిన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి రైతు

**పట్టా చేయడానికి అవసరమైన అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నాయి. మోఖాపై తనే ఉండి వ్యవసాయం చేసుకొంటున్నాడు. అధికారులు మాత్రం విచిత్రంగా వ్యవహరించారు. సగం భూమికి పట్టా చేసి.. మిగతా సగం భూమిని ఇతరుల పేరిట రికార్డుల్లో నమోదుచేశారు. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గంధ్రవారిగూడెం రైతు కట్టా రాంరెడ్డి.. రికార్డుల్లో తనకు జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని రెండేండ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకొనేవారే లేకుండాపోయారు. దీంతో ఏం చేయాలో తోచని రైతు రాంరెడ్డి ధర్మగంటను ఆశ్రయించారు.**

**మాడ్గులపల్లి:** మాడ్గులపల్లి మండలం గంధ్రవారిగూడెం గ్రామానికి చెందిన కట్టా రాంరెడ్డి గ్రామంలోని సర్వే నంబర్ 96 లో 1.18 ఎకరాల భూమిని తన పాలివాండ్ల నుంచి 2009లో కొన్నారు. ఇందుకు సంబంధించి సాదాబైనామా రాయించుకొన్నాడు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళన సందర్భంగా సాదాబైనామాతో కొన్న భూములకు పట్టాలివ్వాలని నిర్ణయించడంతో.. 2016 జూన్‌లో తన సాదాబైనామాను ఆన్‌లైన్ చేయించి, పట్టా మంజూరుచేయాలని కోరుతూ రెవెన్యూ అధికారులకు దరఖాస్తుచేసుకున్నారు. అధికారులు మాత్రం రాంరెడ్డికి చెందిన 1.18 ఎకరాల్లో 29 గుంటలను మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదుచేసి పాస్‌పుస్తకం ఇచ్చారు. మిగిలిన 29 గుంటల భూమిని కబ్జాలో లేని వేరే రైతు పేరు మీదికి ఎక్కించారు. దీంతో రాంరెడ్డి తన భూమి తన పేరుమీదికి మార్చి పట్టా అందించాలని కోరుతూ అక్టోబర్ 2017లో తాసిల్దార్‌కు దరఖాస్తుచేసుకున్నాడు. అప్పట్నుంచి వీఆర్వో, తాసిల్దార్ చుట్టూ రాంరెడ్డి తిరుగుతూనే ఉన్నారు. సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. తాను భూమిని కొని.. కాస్తులో ఉన్నా కూడా రెవెన్యూ అధికారులు ఇతరుల పేరుతో పట్టాచేశారని రాంరెడ్డి ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. సగం భూమికి పాస్‌పుస్తకం రాకపోవడంతో రైతు బంధు సాయాన్ని కోల్పోతున్నానని, తనకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

### అమ్మినోళ్లతో కూడా సంతకాలు చేయించిన



నీకు భూమి అమ్మిన వారితో సంతకాలు చేయించాలని అధికారులు చెప్తే వాళ్ల ముందే సంతకాలు చేయించిన. అయినా 29 గుంటల భూమిని మాత్రమే నా పేరుతో పట్టాచేశారు. మిగతా 29 గుంటల భూమిని వేరే వారి పేరుతో నమోదుచేశారు. జరిగిన పొరపాటును సరిచేయాలని రెండేండ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. సమస్యను పరిష్కరించి కొన్న భూమికి పట్టా ఇప్పించాలని ధర్మగంట ద్వారా వేడుకొంటున్నా.

- కట్టా రాంరెడ్డి, బాధిత రైతు

### మళ్లీ సర్వే చేయిస్తాం

కట్టా రాంరెడ్డికి చెందిన భూమికి పట్టాచేయాలని సాదాబైనామాతో దరఖాస్తు చేసుకున్నారు. పహాణీలో అమ్మిన వాళ్ల పేర్లమీద ఉన్న 29 గుంటల భూమిని రాంరెడ్డి పేరుమీద పట్టాచేశాం. మిగిలిన 29 గుంటలకు సంబంధించిన సర్వే నంబర్‌లో ఎంతమంది కాస్తులో ఉన్నారనే విషయమై సర్వేచేయిస్తాం. సర్వేయర్ నివేదిక ఆధారంగా పట్టాచేస్తాం. రైతుకు న్యాయంచేయడానికి కృషిచేస్తాం.

- రేణుక, వీఆర్వో

### ప్రక్షాళన శుభపరిణామం



రెవెన్యూశాఖ ప్రక్షాళనకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం. ప్రక్షాళనతోనే రైతులకు ఇబ్బందులు తప్పుతాయి. భూసమస్యల పరిష్కారానికి, అవినీతి అంతానికి అదే సరైన మార్గం. అలాగే 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమవుతున్న ధర్మగంట రైతుల పాలిట వరంలా మారింది. భూసమస్యల పరిష్కారం కోసం రైతులు ఏండ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదు. కొద్ది రోజులుగా ధర్మగంటలో వస్తున్న కథనాలకు అధికారుల్లో కదలిక తెచ్చి రైతులకు ఎంతో బలాన్నిస్తున్నాయి. మాలాంటి రైతులు సమస్యలు చెప్పుకొంటే చాలు పరిష్కారమవుతుందనే భావన కలుగుతున్నది.

- గంద్ర రాజేశ్వర్‌రావు, పెగడపల్లి, జగిత్యాల జిల్లా

## ■ కరాటే పోటీల్లో ఎస్టీ గురుకుల విద్యార్థినుల ప్రతిభ

అంతర్జాతీయ కరాటే పోటీల్లో గిరిజన గురుకుల విద్యాలయాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ చాటారు. జూన్ 30, జూలై 1 తేదీల్లో మలేషియాలో నిర్వహించిన 6వ లెజెండ్ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్-2019 పోటీల్లో ఆరు దేశాలకు చెందినవారు పాల్గొన్నారు. ఇందులో గురుకులాలకు చెందిన విద్యార్థినులు అండర్ 14 క్యాటగిరీలో జమోత్ నేహశ్రీ, స్వప్న స్వర్ణపతకాలను, అండర్ 16 క్యాటగిరీలో శ్రీవిద్య కాంస్యపతకాన్ని సాధించారు. కరాటేలో పతకాలు



సాధించిన విద్యార్థినులను బుధవారం గిరిజన గురుకుల సొసైటీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అభినందించారు.

- హైదరాబాద్, నమస్తే తెలంగాణ

## తెగిపోయిన కాఫర్ డ్యామ్

### అన్నారం బరాజ్‌కు నీటి తరలింపునకు ఏర్పాట్లు

**కాళేశ్వరం:** మహారాష్ట్ర ఎగువన కురుస్తున్న వర్షాలతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద నిర్మించిన కాఫర్ డ్యామ్ తెగిపోయింది. ప్రాణహిత నది నుంచి వరద ఉద్ధృతిగా వచ్చి గోదావరిలో కలువడంతో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగింది. దాంతో కన్నెపల్లి వద్ద గోదావరిపై నిర్మించిన కాఫర్ డ్యామ్ తెగిపోయింది. ఫలితంగా మేడిగడ్డ బరాజ్ వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుతున్నది. బుధవారం సాయంత్రం వరకు గోదావరి ఆరు వేల క్యూసెక్కులుగా పారుతున్నదని అధికారులు తెలిపారు. బుధవారం కూడా మహారాష్ట్రలో భారీగా వాన కురియడంతో కాళేశ్వరంలోని అంతర్రాష్ట్ర వంతెన వద్ద గోదావరి 5 మీటర్లగా ప్రవహిస్తున్నది. కాఫర్ డ్యామ్ వారం క్రితం తెగిపోగా అధికారులు మళ్లీ నిర్మించారు. కాఫర్ డ్యామ్ తెగిపోయి గోదావరిలో నీటిమట్టం పెరగడంతో అధికారులు కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీరును అన్నారం బరాజ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



కాఫర్ డ్యామ్ తెగిపోవడంతో దిగువకు పారుతున్న గోదావరి జలాలు



## మెరుగైన పాలన అందించాలి

- ■ బంగారు తెలంగాణ సాధనలో భాగస్వాములు కావాలి
- ■ నూతన ప్రజాప్రతినిధులకు మంత్రి ఎర్రబెల్లి లేఖలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. బంగారు తెలంగాణ సాధనలో స్థానిక ప్రజాప్రతినిధులంతా భాగస్వాములు కావాలని, అందుకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. కొత్తగా బాధ్యతలు చేపడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, జెడ్పీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులతోపాటు కోఆప్షన్ సభ్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలుపుతూ లేఖలు పంపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా కాళేశ్వరం, మిషన్ భగీరథ, హరితహారం వంటి బృహత్తర ప్రాజెక్టులను సీఎం కేసీఆర్ చేపట్టారని, బంగారు తెలంగాణ లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని, ఆదాయం పెంచి పేదలకు పంచాలనే నినాదంతో అన్నివర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని మంత్రి వివరించారు. అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలుచేయడంతోపాటు సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరవేయడంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై కీలక బాధ్యతలున్నాయని తెలిపారు. మెరుగైన పాలన అందించే లక్ష్యంగా నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చారని, గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల పునర్విభజనతోపాటు స్థానిక సంస్థలకు ఎన్నో అధికారాలు, బాధ్యతలను అప్పగించారని మంత్రి లేఖల్లో వివరించారు.

# ఇస్టాతో ప్రపంచాన్ని ఆకర్షించాం

### ఇస్టాలో మనకు చోటుదక్కడం గర్వకారణం: మంత్రి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆసియాలోనే తొలిసారి మన దేశంలో, అందునా తెలంగాణలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ విత్తన సదస్సు (ఇస్టా-2019) విజయవంతం కావడం పట్ల రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సంతోషం వ్యక్తంచేశారు. ఇస్టాతో ప్రపంచం దృష్టిని ఆకర్షించగలిగామని అన్నారు. బుధవారం సచివాలయంలో తనను మర్యాదపూర్వకంగా కలిసిన వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి, ఇస్టా ఉపాధ్యక్షుడిగా ఎంపికైన తెలంగాణ సీడ్స్ డైరెక్టర్ కేశవులును మంత్రి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సింగిరెడ్డి మాట్లాడుతూ.. భారత్ నుంచి తొలిసారి తెలంగాణ వ్యక్తి ఇస్టా స్టాండింగ్ కమిటీ ఉపాధ్యక్షుడిగా చోటు దక్కించుకోవడం గర్వకారణమన్నారు. సదస్సు విజయవంతానికి కృషిచేసిన పార్థసారథిని ప్రత్యేకంగా అభినందించారు.

**పార్థసారథికి 'ఇస్టా' సత్కారం**

తెలంగాణ వేదికగా ఇస్టాను విజయవంతంగా నిర్వహించడంలో కీలకభూమిక పోషించిన తెలంగాణ వ్యవసాయశాఖ ప్రధానకార్యదర్శి పార్థసారథిని ఇస్టా నిర్వాహకులు ధ్రువీకరణ పత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇస్టా అధ్యక్షుడు గ్రేడ్ నెక్‌గిల్ మాట్లాడుతూ.. సదస్సు నిర్వహణతోపాటు విదేశీ అతిథులకు ఏర్పాట్లను పార్థసారథి సమర్థంగా నిర్వహించారన్నారు. పార్థసారథి అందించిన ప్రోత్సాహం వల్లే ఇంత పెద్ద సదస్సును విజయవంతంగా పూర్తిచేయగలిగామని ఇస్టా సెక్రటరీ జనరల్ ఆండ్రియాస్ చెప్పారు. 2017లో పార్థసారథి నేతృత్వంలో తెలంగాణ వేదికగా జరిగిన 8వ జాతీయ విత్తన సదస్సుతో తెలంగాణ రాష్ట్రం ప్రపంచ విత్తనరంగ దృష్టిని ఆకర్షించగలిగింది. అలాగే 70 దేశాల నుంచి 400 మంది నిపుణులు, 200 మంది భారతీయ విత్తన శాస్త్రవేత్తలు పాల్గొన్న ఇస్టాను రాష్ట్రానికి తీసుకురావడంలో పార్థసారథి కీలకభూమిక వహించారని ఇస్టా కార్యవర్గసభ్యులు పేర్కొన్నారు.

**అన్ని మార్కెట్లలో ఈ-సర్వీస్ అమలు**

రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్లలో ఈ-సర్వీసులు అమలుచేయాలని, అలాగే ఈ నామ్ వ్యవస్థ పట్ల రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నామ్ మార్కెట్లో పేమెంట్ ఇంటిగ్రేషన్ పూర్తిచేసి రైతులకు పట్టీలు ఇవ్వాలని సూచించారు. బుధవారం సచివాలయంలో మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానకాలంలో మార్కెట్లకు రైతులు తీసుకొచ్చే ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అన్ని మార్కెట్లలో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. నారాయణపేట మార్కెట్ పరిధిలోకి దామరగిద్ద మార్కెట్‌ను తీసుకురావాలని ఆదేశించారు. మలక్‌పేట ఉల్లి మార్కెట్‌ను పటాన్‌చెరుకు తరలించాలని, స్టేక్‌హోల్డర్లతో సమావేశం నిర్వహించాలని సూచించారు. గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ తరలింపు, వనపర్తి మార్కెట్ నిర్మాణానికి అవసరమైన పనులు వేగవంతం చేయడంపై అధికారులతో చర్చించారు. సమావేశంలో మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, అదనపు డైరెక్టర్ రవికుమార్, ఎస్ఈ ఉమామహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఇస్టా ఉపాధ్యక్షుడిగా ఎంపికైన తెలంగాణ సీడ్స్ డైరెక్టర్ కేశవులు, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథిలను బుధవారం సన్మానిస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

### సొసైటీల ఆడిట్ సకాలంలో పూర్తిచేయండి

ఫిర్యాదులు వచ్చిన సొసైటీలపై విచారణ జరిపించాలని, పాలకవర్గాల గడువు ముగిసిన సొసైటీలకు ఎన్నికలు జరిగేలా చూడాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలోని తన చాంబర్లో సహకారశాఖపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సొసైటీల ఆడిట్లు అన్నీ సకాలంలో పూర్తిచేయాలని, నామమాత్రపు ఆడిట్లను పక్కన పెట్టాలని సూచించారు. ఫిర్యాదులు వచ్చిన సొసైటీలపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని, హైదరాబాద్ డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీతోపాటు ఎన్నికలు నిర్వహించాల్సిన సొసైటీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ నెల 10వ తేదీ తర్వాత సహకారశాఖ అధికారులతో విస్తృతస్థాయి సమావేశానికి ఏర్పాట్లుచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర సహకారశాఖ కమిషనర్ వీరభద్రయ్య, అదనపు రిజిస్ట్రార్ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో చారిత్రక ఘట్టం

- ■ 28 జిల్లాల్లో రేపు కొలువుదీరనున్న కొత్త జెడ్పీ చైర్మన్లు
- ■ నేటితో గత జెడ్పీ చైర్మన్లు, జెడ్పీటీసీల పదవీకాలం పూర్తి
- ■ ముగిసిన ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమవుతున్నది. పరిపాలనను వికేంద్రీకరించి, ప్రజలకు పాలనను మరింత చేరువచేయాలనే సంకల్పంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు 32 జిల్లాల్లో జిల్లా పరిషత్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కో ఆప్షన్ సభ్యులు, 488 మండల పరిషత్తుల్లో ఎంపీపీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు కొలువుదీరుతున్నారు. పదవీకాలం ఇంకో నెలరోజులు ఉన్న నాలుగు జెడ్పీలు మినహా.. మిగిలిన అన్నింటిలో శుక్రవారం పదవుల్లోకి రానున్నారు. పది ఉమ్మడి జిల్లాల్లో హైదరాబాద్ మినహా.. తొమ్మిది జిల్లాల్లో ఇప్పటివరకు జెడ్పీ చైర్మన్లు పదవుల్లో ఉన్నారు. పరిపాలనా సౌలభ్యం, ప్రజలకు అధికారులు, ప్రజాప్రతినిధులను జవాబుదారీగా ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జిల్లాలు, మండలాలు, గ్రామాలు ఏర్పాటుచేసిన విషయం విదితమే. దీనిలో భాగంగా శుక్రవారం 23 కొత్త జిల్లాలు సహా 28 జిల్లాల్లో జెడ్పీ పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరించనున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 427 మంది జెడ్పీటీసీ సభ్యులు, తొమ్మిదిమంది జెడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, 18 మంది కో ఆప్షన్ సభ్యులున్నారు. వీరి పదవీకాలం గురువారంతో ముగియనుంది. ఇప్పటికే పరిషత్ ఎన్నికలను ముగించడంతోపాటు జెడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్, కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలను పూర్తిచేశారు. పదవీకాలం పూర్తిచేసుకున్న వారి నుంచి శుక్రవారం కొత్త జెడ్పీ చైర్మన్లు పదవీబాధ్యతలు స్వీకరించనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో ఆగస్టు 7న జెడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కో ఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

**నేడు పదవుల్లోకి ఎంపీటీసీ, ఎంపీపీలు**

కొత్తగా ఎన్నికైన ఎంపీటీసీలు, ఎంపీపీ అధ్యక్షులు గురువారం పదవీబాధ్యతలు స్వీకరించనున్నారు. పదవీకాలం ముగియడంతో 6473 మంది ఎంపీటీసీలు, 427 మంది ఎంపీపీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు బుధవారం బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. ఎంపీపీలు కార్యాలయాలను ఖాళీచేసి, కేటాయించిన వాహనాలను అప్పగించారు. వారి స్థానంలో 5817 మంది ఎంపీటీసీ సభ్యులు, 488 మంది ఎంపీపీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు బాధ్యతలు స్వీకరించనున్నారు. వీరిలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని ఎంపీపీలు, ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, మంగపేట, మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, బయ్యారం, నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల ఎంపీపీలు మాత్రం ఆగస్టు 6న బాధ్యతలు చేపట్టనున్నారు.

**కొత్త జెడ్పీ కార్యాలయాలు సిద్ధం**

కొత్త పాలకవర్గాలు కొలువుదీరనుండటంతో మొత్తం 32 జెడ్పీ కార్యాలయాలను సిద్ధంచేశారు. కార్యాలయాలకు సామాగ్రి, సిబ్బందిని కేటాయించారు. కొత్త జెడ్పీలను సుందరంగా అలంకరించారు.

| జిల్లా | జెడ్పీ కార్యాలయం |
|---|---|
| ఆదిలాబాద్ | పాత జెడ్పీ కార్యాలయం, ఆదిలాబాద్ |
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | ఆర్అండ్‌బీ అతిథిగృహం, ఆసిఫాబాద్ |
| నిర్మల్ | ఎంపీపీ కార్యాలయం, నిర్మల్ |
| మంచిర్యాల | ఎంపీపీ కార్యాలయం, మంచిర్యాల |
| కరీంనగర్ | పాత జెడ్పీ కార్యాలయం, కరీంనగర్ |
| జగిత్యాల | వెటర్నరీ ఆఫీస్ బిల్డింగ్, జగిత్యాల |
| రాజన్న సిరిసిల్ల | పాత ఎంపీడీవో కార్యాలయం, సిరిసిల్ల |
| పెద్దపల్లి | ఆర్డీవో కార్యాలయం, పెన్షనర్స్ బిల్డింగ్, పెద్దపల్లి |
| వరంగల్ అర్బన్ | పాత జెడ్పీ కార్యాలయం, వరంగల్ |
| జనగామ | ఎంపీడీవో కార్యాలయం, జనగామ |
| జయశంకర్ భూపాలపల్లి | ఎంపీడీవో కార్యాలయం, భూపాలపల్లి |
| మహబూబాబాద్ | ఎంపీడీవో కార్యాలయం, మహబూబాబాద్ |
| ములుగు | ఎంపీడీవో కార్యాలయం, ములుగు |
| ఖమ్మం | పాత జెడ్పీ కార్యాలయం, ఖమ్మం |
| భద్రాద్రి కొత్తగూడెం | ఎంపీడీవో కార్యాలయం, కొత్తగూడెం |
| నల్లగొండ | పాత జెడ్పీ కార్యాలయం, నల్లగొండ |
| సూర్యాపేట | ఎంపీపీ కార్యాలయం, సూర్యాపేట |
| యాదాద్రి భువనగిరి | ఎంపీపీ కార్యాలయం, భువనగిరి |
| మహబూబ్‌నగర్ | పాత జెడ్పీ కార్యాలయం, మహబూబ్‌నగర్ |
| నాగర్‌కర్నూల్ | స్త్రీ శక్తి భవన్, నాగర్‌కర్నూల్ |
| జోగుళాంబ గద్వాల | ఎంపీడీవో కార్యాలయం, గద్వాల |
| వనపర్తి | ఎంపీడీవో కార్యాలయం, వనపర్తి |
| నారాయణపేట | వెటర్నరీ కార్యాలయం, నారాయణపేట |
| రంగారెడ్డి | పాత జెడ్పీ కార్యాలయం, ఖైరతాబాద్ |
| మేడ్చల్ మల్కాజిగిరి | ఎంపీపీ కార్యాలయం, కీసర |
| వికారాబాద్ | ఎంపీపీ కార్యాలయం, వికారాబాద్ |
| సంగారెడ్డి | పాత జెడ్పీ కార్యాలయం, సంగారెడ్డి |
| మెదక్ | ఎంపీపీ కార్యాలయం, మెదక్ |
| సిద్దిపేట | సీఎల్ఆర్టీ బిల్డింగ్, సిద్దిపేట |
| నిజామాబాద్ | పాత జెడ్పీ కార్యాలయం, నిజామాబాద్ |
| కామారెడ్డి | పాత ఎంపీపీ కార్యాలయం, కామారెడ్డి |

## లోకల్ రిజర్వేషన్లు లేక అన్యాయం

- ■ ఎక్కడి ఉద్యోగులు అక్కడే పనిచేయాలి
- ■ జనరల్ బాడీ సమావేశాల్లో విద్యుత్ ఉద్యోగుల ఆవేదన



బుధవారం మీడియాతో మాట్లాడుతున్న టీఈఈఏ రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** విద్యుత్ రంగంలో లోకల్ రిజర్వేషన్లు లేకపోవడంతో తెలంగాణకు అన్యాయం జరిగిందని విద్యుత్ సంఘాల నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఈఈఏ), విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (వీఏవోఏటీ) సంఘాలు బుధవారం వేర్వేరుగా సర్వసభ్య సమావేశాలను నిర్వహించాయి. సమావేశాల్లో, అనంతరం జెన్‌కో ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీఈఈఏ రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ మాట్లాడుతూ.. ఎక్కడి ఉద్యోగులు అక్కడే పనిచేయాలని అన్నారు. తెలంగాణ విద్యుత్ సంస్థలు రిలీవ్‌చేసిన 1,157 మంది ఆంధ్ర ఉద్యోగులను ఏపీ విద్యుత్ సంస్థల్లోకి తీసుకోవాలని, అక్కడ పనిచేస్తున్న 229 మంది తెలంగాణ ఉద్యోగులను ఇక్కడికి పంపాలని కోరారు. 'ఆంధ్ర ప్రాంత ఉద్యోగులు తెలంగాణలో పనిచేస్తే తప్పేంటని' ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. తెలంగాణ ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని వీఏవోఏటీ సర్వసభ్య సమావేశంలో నాయకులు.. సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తిచేశారు. రైతులకు 24 గంటల విద్యుత్‌ను అందించేందుకు తెలంగాణ ఉద్యోగులు నిరంతరం పాటుపడ్డారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు పీ అంజయ్య, మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి పాలనలో లక్షల ఎకరాలు ఎండిపోయాయని, ఆరునెలల్లోనే సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారని పేర్కొన్నారు. ఆయా సమావేశాల్లో విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, ఇతర నాయకులు షరీఫ్, వేణుబాబు, ఆంజనేయులు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదేండ్లలో సింగరేణి అద్భుత ప్రగతి

- ■ రూ.50 వేలకోట్ల టర్నోవర్ లక్ష్యంగా కృషిచేద్దాం
- ■ తెలంగాణ వచ్చాక మెరుగైన బోనస్ ఇస్తున్నాం
- ■ జేసీసీ సమావేశంలో సీఎండీ ఎన్ శ్రీధర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సింగరేణి ఐదేండ్లలో అద్భుత ప్రగతిని సాధించిందని, అభివృద్ధిని రెట్టింపు చేసేందుకు కృషిచేయాలని ఆ సంస్థ చైర్మన్ అండ్ ఎండీ ఎన్ శ్రీధర్ పేర్కొన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు, అధికారుల సంఘంతో ఆయన బుధవారం సింగరేణి భవన్‌లో 36వ జాయింట్ కన్సల్టేటివ్ కమిటీ (జేసీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సహకారంతో ఇతర రాష్ట్రాల్లో బొగ్గు బ్లాకులు చేపట్టి వచ్చే ఐదారేండ్లలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2,500 మెగావాట్ల విద్యుదుత్పత్తి, తద్వారా రూ.50 వేలకోట్ల టర్నోవర్, 5 వేలకోట్ల లాభాలను ఆర్జించడమే లక్ష్యంగా ముందుగా సాగుతున్నామని పేర్కొన్నారు. పదవీవిరమణ రోజునే ఉద్యోగికి బెనిఫిట్స్ అందజేసేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మెరుగైన బోనస్ ఇస్తున్నామని, ఈసారి కూడా ప్రకటిస్తామని వెల్లడించారు. సమావేశంలో డైరెక్టర్లు ఎస్ శంకర్, చంద్రశేఖర్‌రెడ్డి, బీ భాస్కర్‌రావు, ఎస్ బలరాం తమ విభాగాలకు చెందిన ప్రణాళికలు, విస్తరణ అంశాలను వివరించారు. గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, ప్రాతినిధ్య సంఘం అధ్యక్షుడు వై గట్టయ్య, కార్యదర్శి మిరియాల రంగయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు జక్కం రమేశ్, కార్యదర్శి ఎస్వీ రాజశేఖర్ పలు అంశాలపై చర్చించారు.

### వరి కనీస మద్దతు ధర

## రూ.65 పెంపు


› మూడోపేజీ తరువాయి...


వెల్లడించారు. 2019-20 పంట సీజన్‌కు (జూలై-జూన్) గానూ సాధారణ, ఏ గ్రేడ్ రకం వరికి రూ.65 చొప్పున మద్దతు ధర పెంచినట్లు చెప్పారు. దీంతో ఈ ఏడాది సాధారణ వరి క్వింటాల్ ధర రూ.1,815కు, ఏ గ్రేడ్ రకం వరి ధర రూ.1,835కు పెరిగింది. వంట నూనెల దిగుమతులను తగ్గించే లక్ష్యంతో నూనె గింజల మద్దతు ధరను ప్రభుత్వం భారీగా పెంచింది.

**అదానీకి మూడు విమానాశ్రయాలు**

దేశంలోని మూడు ప్రధాన విమానాశ్రయాలను లీజుకు ఇచ్చేందుకు కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధ్వర్యంలోని అహ్మదాబాద్, లక్నో, మంగళూరు విమానాశ్రయాలను ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం విధానంలో అదానీ గ్రూప్‌నకు అప్పగించేందుకు ఆమోదం తెలిపింది. ఈ మూడు విమానాశ్రయాలను 50 ఏండ్ల పాటు నిర్వహించేందుకు ఈ ఏడాది ప్రారంభంలో అదానీ గ్రూప్ కాంట్రాక్ట్ దక్కించుకుంది. జైపూర్, గువాహటి, తిరువంతపురం విమానాశ్రయాల నిర్వహణ బిడ్లను కూడా ఆ సంస్థే దక్కించుకోవడం విశేషం.

**దేశవ్యాప్తంగా కార్మికులకు కనీస వేతనాలు!**

కార్మికుల వేతనాలకు సంబంధించి ప్రస్తుతమున్న చట్టాలను ఒకే గొడుగు కిందకు తెచ్చి, దేశవ్యాప్తంగా కార్మికుల కనీస వేతనాలను కేంద్ర ప్రభుత్వమే నిర్ణయించేందుకు వీలు కల్పించే వేజెస్ కోడ్ బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సమాచార, ప్రసార శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ ఈ విషయం వెల్లడించారు. ఈ సమావేశాల్లోనే పార్లమెంటులో ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు ఆయన తెలిపారు. మునుపటి మోదీ ప్రభుత్వంలోనే వేజెస్ కోడ్ బిల్లును 2017 ఆగస్టు 10న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీన్ని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపగా, 2018 డిసెంబర్ 18న ఆ కమిటీ తన నివేదికను సమర్పించింది. అయితే మే నెలలో 16వ లోక్‌సభ రద్దు కావడంతో ఆ బిల్లు మురిగిపోయింది. ప్రస్తుతం అమల్లో ఉన్న వేతన చెల్లింపుల చట్టం-1936, కనీస వేతన చట్టం-1948, బోనస్ చెల్లింపుల చట్టం-1965, సమాన పారితోషిక చట్టం-1976 స్థానంలో ఈ బిల్లును తీసుకురానున్నారు. కాగా, సముద్రమార్గంలో ప్యాసింజర్, కార్గో సేవలను ప్రారంభించేందుకు మాల్దీవులతో కుదిరిన అవగాహన ఒప్పందానికి కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ మాల్దీవుల పర్యటన సందర్భంగా జూన్ 8న ఇరు దేశాల మధ్య ఈ ఒప్పందం కుదిరింది.

| పంట | పెంపు | పెరిగిన ధర |
|---|---|---|
| | (క్వింటాలుకు రూపాయిల్లో) | |
| వరి | 65 | 1,815 |
| రాగి | 253 | 3150 |
| జొన్నలు | 120 | 2550 |
| మక్కజొన్న | 60 | 1760 |
| సజ్జలు | 50 | 2000 |
| కంది | 215 | 5800 |
| మినప | 100 | 5700 |
| పెసర | 75 | 7050 |
| సోయాబీన్ | 311 | 3710 |
| పొద్దు తిరుగుడు | 262 | 5650 |
| నువ్వులు | 236 | 6485 |
| వేరుశెనగ | 200 | 5090 |
| గడ్డినువ్వులు (నైగర్ సీడ్) | 63 | 5940 |
| మీడియం కాటన్ | 105 | 5255 |
| లాంగ్ కాటన్ | 100 | 5550 |

# స్మగ్లర్ల కొత్త జిత్తులు

- ■ సౌదీ నుంచి ప్రయాణికులను బెదిరించి బంగారం అక్రమ రవాణా
- ■ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 14 మంది ఉమ్రా యాత్రికుల అరెస్టు
- ■ రూ.2.17 కోట్ల విలువ చేసే 6.46 కిలోల బంగారం స్వాధీనం
- ■ డీఆర్ఐ, హైదరాబాద్ సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆపరేషన్
- ■ బంగారం స్మగ్లర్ల ఎత్తులను చిత్తుచేస్తున్న కస్టమ్స్ అధికారులు
- ■ విమానాశ్రయంలో స్మగ్లింగ్‌పై మహిళా అధికారుల నియామకం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బంగారం అక్రమ రవాణాకు స్మగ్లింగ్ ముఠాలు కొత్త జిత్తులు పన్నుతున్నాయి. సాధారణ ప్రయాణికులను మభ్యపెట్టి వారితో గుట్టుగా బంగారం రవాణా చేయిస్తున్నాయి. స్మగ్లర్ల ఎత్తులకు డీఆర్ఐ, కస్టమ్స్, పోలీస్ అధికారులు పైఎత్తులు వేస్తున్నారు. స్మగ్లింగ్‌పై మహిళా అధికారుల నిఘా సైతం పెంచారు. ఫలితంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా అక్రమ బంగారం పట్టుబడుతున్నది. తాజాగా బుధవారం డీఆర్ఐ, హైదరాబాద్ సిటీ సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ జాయింట్ ఆపరేషన్‌లో దొంగ బంగారంతో వస్తున్న 14 మంది ప్రయాణికులను పోలీసులు అరెస్టుచేశారు. వీరినుంచి రూ.2.17 కోట్ల విలువచేసే 6.46 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. డీఆర్ఐ అధికారులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్కా చూడాలనుకొనే పేద ముస్లింల కోరికను అవకాశంగా చేసుకుని వారిని తక్కువ ధరలకే ఉమ్రా యాత్రకు తీసుకెళ్తామని బంగారం స్మగ్లింగ్ ముఠాల సభ్యులు మభ్యపెడుతున్నారు. యాత్ర ముగించుకుని తిరిగి భారత్‌కు వచ్చే సమయంలో దొంగబంగారాన్ని తీసుకెళ్లాలని వారిని బెదిరిస్తున్నారు. ముఠాసభ్యులు చెప్పినట్టు వినకపోతే ప్రయాణ ఖర్చులు పూర్తిగా చెల్లించాలని, అదనంగా పెనాల్టీలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. అలా వారితో బంగారాన్ని పంపుతున్నారు. హైదరాబాద్‌కు చేరిన తర్వాత ముఠా సభ్యులు ఇక్కడ బంగారాన్ని తీసుకుంటున్నారు. ఈ అక్రమ రవాణాపై పక్కా సమాచారం అందడంతో డీఆర్ఐ, హైదరాబాద్ సిటీ సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం రాత్రి ఎయిర్‌పోర్టులో ప్రత్యేకంగా నిఘా పెట్టారు. జెడ్డా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన సౌదీ ఎయిర్‌లైన్స్ విమానంలో కొందరు ప్రయాణికులు అక్రమంగా బంగారాన్ని తెస్తున్నట్టు గుర్తించారు. బయటికివెళ్లే గేటు వద్దవారిని తనిఖీచేయగా.. 24 కడియాలు, 24 బంగారు చైన్లు లభించాయి. కస్టమ్స్‌యాక్ట్ 1962 కింద బంగారాన్ని స్వాధీనం చేసుకుని 14 మంది ప్రయాణికులను అరెస్టు చేసినట్టు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని పేర్కొన్నారు.

**స్మగ్లింగ్‌పై మహిళా అధికారుల నిఘా**

బంగారం స్మగ్లింగ్‌కు అడ్డాగా మారిన శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు నిఘా పెంచారు. మహిళా అధికారులు, సిబ్బందిని ఎక్కువ సంఖ్యలో నియమించారు. విదేశాల నుంచి వివిధ రూపాల్లో విమానాశ్రయానికి అడ్డదారిలో బంగారం తరలివస్తున్నది. దుబాయ్ కేంద్రంగా ఎక్కువ శాతం స్మగ్లింగ్ సాగుతున్నది. స్మగ్లర్లు బంగారం అక్రమ రవాణాకు మహిళలను సాధనంగా ఎంచుకుంటున్నారు. పేదరికాన్ని అవకాశంగా మలుచుకొని హైదరాబాద్‌కు చెందిన కొందరు మహిళలను, జులాయిలను ఎక్కువగా దుబాయ్‌కి పంపడం.. బంగారాన్ని అక్రమంగా తెప్పించడం నిత్యకృత్యమైంది. నిందితులు బంగారాన్ని లోదుస్తులు, అవయవాల్లో దాచుకుని తీసుకురావడం కస్టమ్స్ తనిఖీల్లో బయటపడింది. దుబాయ్ ఇతర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివస్తున్న మహిళా ప్రయాణికులను తనిఖీచేయడం సాధ్యం కావడం లేదు. అనుమానం ఉన్నవారినే ర్యాండమ్‌గా తనిఖీచేసి పంపగలుగుతున్నారు. మహిళల విషయంలో రకరకాల సమస్యలు వస్తున్నాయి. ఈ కారణంగా మహిళా అధికారులు, సిబ్బందిని పెంచుతున్నట్టు ఒక అధికారి తెలిపారు. బుధవారం కొంతమందిని నియమించామని, గురువారం మరికొంతమంది వస్తారని పేర్కొన్నారు. ఎంతమందిని ఎయిర్‌పోర్ట్‌లో నియమిస్తున్నారనే విషయం చెప్పడానికి అధికారులు నిరాకరించారు. బంగారం స్మగ్లింగ్‌పై ఇకముందు మరింత గట్టి నిఘా ఉంటుందని స్పష్టంచేశారు.

## ఐటీగ్రిడ్ కేసులో మరో ఇద్దరికి బెయిల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓటర్ల వ్యక్తిగత సమాచారం చోరీ కేసులో ఏ2, ఏ3గా ఉన్న ఐటీగ్రిడ్ సంస్థ ఉద్యోగులు దండు కమలాకర్, షేక్ అబ్దుల్ ఉజైర్‌కు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరుచేసింది. వీరు దాఖలుచేసుకున్న యాంటిసిపేటరీ బెయిల్ పిటిషన్‌పై న్యాయస్థానం బుధవారం విచారణ చేపట్టింది. డేటాచోరీ ఆరోపణలు ఐటీగ్రిడ్ యాజమాన్యంపై వచ్చాయని, పిటిషనర్లు కేవలం ఐటీగ్రిడ్ సంస్థ ఉద్యోగులు మాత్రమేనన్నవారి తరపు న్యాయవాది వాదనను ధర్మాసనం పరిగణనలోకి తీసుకున్నది. పలు షరతులు విధిస్తూ బెయిల్ మంజూరుచేసింది. డేటా చోరీ కేసులో ఏ1గా ఉన్న ఐటీగ్రిడ్ ఎండీ డీ అశోక్, ఏ4గా ఉన్న ఆయన భార్య శ్రీలక్ష్మికి హైకోర్టు ఇప్పటికే షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది.

**పాయింట్ల పట్టిక**

| స్థానం | జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే. | ర.రే | పా |
|---|---|---|---|---|---|---|---|
| 1.✔ | ఆస్ట్రేలియా | 8 | 7 | 1 | 0 | +1.00 | 14 |
| 2.✔ | భారత్ | 8 | 6 | 1 | 1 | +0.81 | 13 |
| 3.✔ | ఇంగ్లండ్ | 9 | 6 | 3 | 0 | +1.15 | 12 |
| 4. | న్యూజిలాండ్ | 9 | 5 | 3 | 1 | +0.17 | 11 |
| 5. | పాకిస్థాన్ | 8 | 4 | 3 | 1 | -0.79 | 9 |
| 6. | శ్రీలంక | 8 | 3 | 3 | 2 | -0.93 | 8 |
| 7. | బంగ్లాదేశ్ | 8 | 3 | 4 | 1 | -0.19 | 7 |
| 8. | దక్షిణాఫ్రికా | 8 | 2 | 5 | 1 | -0.08 | 5 |
| 9. | వెస్టిండీస్ | 8 | 1 | 6 | 1 | -0.33 | 3 |
| 10. | అఫ్ఘనిస్థాన్ | 8 | 0 | 8 | 0 | -1.41 | 0 |

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, ర.రే - నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు, ✔- అర్హత

**వరల్డ్‌కప్‌లో నేడు** వెస్టిండీస్ X అఫ్ఘనిస్థాన్ - 3 గం. స్టార్ స్పోర్ట్స్‌లో

**అత్యధిక పరుగులు** 544 రోహిత్ (ఇండియా)

**అత్యధిక వికెట్లు** 24 స్టార్క్ (ఆస్ట్రేలియా)

**అంబటి రాయుడు కెరీర్**

| | మ్యాచ్‌లు | పరుగులు | సగటు | అత్యధిక స్కోరు |
|---|---|---|---|---|
| వన్డేలు | 55 | 1694 | 47.05 | 124* |
| టీ20లు | 6 | 42 | 10.50 | 20 |
| ఫస్ట్‌క్లాస్ | 97 | 6151 | 45.56 | 210 |

# రాయుడు గుడ్‌బై



## తెలుగు క్రికెటర్ అనూహ్య నిర్ణయం.. ఐపీఎల్ సహా అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్

**న్యూఢిల్లీ:** తెలుగు క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు అనూహ్య నిర్ణయం తీసుకున్నాడు. ఐపీఎల్ సహా అన్ని అంతర్జాతీయ ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. క్రికెట్ నుంచి వైదొలుగుతున్నట్టు భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)కి బుధవారం ఈ-మెయిల్ ద్వారా లేఖను పంపాడు. 'క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్ల నుంచి రిటైరవ్వాలని నిర్ణయించుకున్నా. ఈ విషయాన్ని మీ దృష్టికి తెస్తున్నా. బీసీసీఐతో పాటు నేను ప్రాతినిధ్యం వహించిన హైదరాబాద్, బరోడా, ఆంధ్రా, విదర్భ సహా అన్ని రాష్ర్టాల క్రికెట్ సంఘాలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా. అలాగే నాకు ఎంతో మద్దతిచ్చిన ఐపీఎల్ ఫ్రాంచైజీలు ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్‌కింగ్స్‌లకు కృతజ్ఞతలు. దేశం తరపున ప్రాతినిధ్యం వహించడం గౌరవంగా భావిస్తున్నా. నేను ఆడిన జట్ల కెప్టెన్లయిన ఎంఎస్ ధోనీ, రోహిత్‌శర్మ.. ముఖ్యంగా టీమ్‌ఇండియాకు ఆడిన ప్రతీసారి నాపై నమ్మకముంచిన విరాట్ కోహ్లీకి ప్రత్యేకంగా ధన్యవాదాలు. 25 ఏండ్లుగా వివిధ స్థాయిల్లో క్రికెట్ ఆడడం, ప్రతి విజయం, ప్రతి పతనం నుంచి పాఠాలు నేర్చుకోవడం... మళ్లీ పైకిలేవడం.. అంతా అద్భుతమైన ప్రయాణంగా సాగింది. ఈ ప్రయాణంలో నాతో ఉన్న మా కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా' అని బీసీసీఐకు పంపిన లేఖలో 33 ఏండ్ల అంబటి రాయుడు పేర్కొన్నాడు. ఇంగ్లండ్‌లో జరుగుతున్న ప్రపంచకప్‌నకు తనను ఎంపిక చేయకపోవడంపై ట్విట్టర్ వేదికగా అంబటి రాయుడు బీసీసీఐపై అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో తన స్థానంలో ఎంపికైన విజయ్ శంకర్ గాయం కారణంగా టోర్నీ నుంచి నిష్క్రమించినా... స్టాండ్‌బైగా ఉన్న తనను కాకుండా ఆ స్థానానికి మయాంక్ అగర్వాల్‌ను జట్టులోకి తీసుకోవడంపై అంబటి రాయుడు మనస్తాపం చెందాడని, అందుకే రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. 2013 జులై 24న జరిగిన భారత్-జింబాబ్వే మ్యాచ్‌తో వన్డేల్లో అరంగేట్రం చేసిన రాయుడు... చివరగా ఈ ఏడాది మార్చి 8న ఆస్ట్రేలియా సిరీస్‌లో ఆడాడు. 2014 సెప్టెంబర్ 7న ఇంగ్లండ్‌తో భారత్ పోరులో అంతర్జాతీయ టీ20లో అడుగుపెట్టిన అతడు... 2016 జూన్ 22న జింబాబ్వేతో చివరి మ్యాచ్ ఆడాడు. ఈ ఏడాది మొదట్లో న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో విశేషంగా రాణించిన రాయుడు, సొంతగడ్డపై ఆస్ట్రేలియా సిరీస్‌లో నిరాశపరిచాడు. ఈ నేపథ్యంలో బౌలింగ్, బ్యాటింగ్ చేయగల విజయ్ శంకర్‌ను అంబటి రాయుడు స్థానంలో ప్రపంచకప్‌కు ఎంపిక చేసినట్టు సెలక్టర్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

**అంబటికి ఐస్‌ల్యాండ్ ఆఫర్**

తమ దేశానికి వచ్చి క్రికెట్ ఆడాలని, ఇందుకోసం శాశ్వత పౌరసత్వం కల్పిస్తామని అంబటి రాయుడును ఐస్‌ల్యాండ్ క్రికెట్ బోర్డు ఆహ్వానించింది. అలాగే పౌరసత్వ దరఖాస్తును ట్వీట్ చేసింది.

'నువ్వు ఎప్పటికీ అత్యుత్తమ ప్రతిభ కల చాంపియన్‌వి రాయుడు. సెలెక్టర్లు నిన్ను అవమానించినా..భారత క్రికెట్ అభిమానుల మదిలో నీ ఆటతీరు కలకాలం గుర్తుండిపోతుంది. నీ సెకండ్ ఇన్నింగ్స్‌కు గుడ్‌లక్'

- ట్విట్టర్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

“ నా మేరకు, ఈ ప్రపంచకప్‌లో సెలెక్టర్లు తీవ్ర నిరాశపరిచారు. వారి నిర్ణయాల వల్లే రాయుడు రిటైరవ్వాలని నిర్ణయించుకున్నాడు. ఐదుగురు సెలెక్టర్లు వారి కెరీర్‌లో చేసిన మొత్తం పరుగులను కలిపినా.... రాయుడు తన కెరీర్‌లో చేసిన రన్స్‌కు సమానం కాదు. రాయుడు రిటైర్మెంట్ పట్ల బాధపడుతున్నా. టోర్నీలో గాయపడిన వారి స్థానాల్లో పంత్, అగర్వాల్‌కు చోటు కల్పించారు. రాయుడు స్థానంలో ఎవరు ఉన్నా ఇలాగే చేస్తారు.

- గౌతమ్ గంభీర్, మాజీ ఓపెనర్

భవిష్యత్తులో నీకు అంతా మంచే జరగాలని కోరుకుంటున్నా. నువ్వో గొప్ప వ్యక్తివి

- విరాట్ కోహ్లీ, టీమ్‌ఇండియా కెప్టెన్

# ఒడిదుడుకుల పయనం

**అంబటి రాయుడు.. ప్రతిభావంతుడైన తెలుగు క్రికెటర్. ప్రత్యేకమైన శైలితో... అలవోకగా బంతిని బౌండరీలు దాటించడంలో దిట్ట. క్రికెట్ కెరీర్‌లో ఎన్నో ఉత్థానపతనాలను చూశాడు. 16ఏళ్ల వయసులో రంజీల్లో అదరగొట్టి జూనియర్ సచిన్ అనేంతలా పేరుతెచ్చుకున్నాడు. ఆ తర్వాత జాతీయ జట్టులో చోటు దక్కుతుందని ఆశించి.. నిరాశ ఎదురైన ప్రతిసారి కసితో నైపుణ్యం పెంచుకున్నాడు. 2014లో టీమ్‌ఇండియా తరపున వన్డేల్లో అరంగేట్రం చేసి.. ఇప్పటి వరకు నిలకడగా రాణించాడు. ఇక జాతీయ జట్టులో స్థానం పదిలం అనుకున్న సమయంలో కాస్త వెనుకబడి... ప్రపంచకప్‌నకు ఎంపిక కాలేదనే నైరాశ్యంతో ఏకంగా క్రికెట్‌కే గుడ్‌బై చెప్పేశాడు. అంబటి కెరీర్‌లో ఒడిదుడుకులపై ప్రత్యేక కథనం.**

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

క్రికెటర్ అంబటి రాయుడు క్రికెట్ ప్రస్థానం మొత్తం ఒడిదుడుకులమయంగా సాగింది. 2005లోనే టీమ్‌ఇండియాకు తప్పక ప్రాతినిధ్యం వహిస్తాడనుకున్న అతడిని దురదృష్టం చాలాసార్లు వెంటాడింది. వివాదాలు చుట్టుముట్టి అతడిని వెనక్కినెట్టాయి. 2014లో వన్డేల్లో టీమ్‌ఇండియాలో అరంగేట్రం చేసి.. నాలుగో స్థానంలో అదరగొడుతూ విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. ఈ ఏడాది మొ దట్లో న్యూజిలాండ్‌తో సిరీస్‌లో రాణించినా... ఆస్ట్రేలియాతో విఫలమవడంతో నిలకడలేదని సెలక్టర్లు అంబటిని ప్రపంచకప్‌నకు ఎంపిక చేయలేదు. స్టాండ్‌బైగా ఉన్న అంబటిని కాకుండా టోర్నీలో గాయపడిన విజయ్ శంకర్ స్థానంలో మయాంక్ అగర్వాల్‌ను తీసుకొని రాయుడిని మరింత నిరాశ గురి చేశారు. దీంతో మనస్తాపం చెందిన రాయుడు... ఐపీఎల్ సహా అన్ని అంతర్జాతీయ ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించాడు.

**అదిరే ఆరంభం**

1985లో గుంటూరు జిల్లాలో పుట్టిన అంబటి రాయుడు... 16 ఏళ్ల వయసులో(జనవరి 2002) ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో హైదరాబాద్ తరపున అరంగేట్రం చేసి, 2002-03 రంజీట్రోఫీలో 69.80 సగటుతో 689పరుగులు చేశాడు. ఆంధ్రాతో జరిగిన ఓ మ్యాచ్‌లో డబుల్ సెంచరీ(210), శతకం(159*) చేసి.. ఒకే మ్యాచ్‌లో ఈ ఘనత సాధించిన పిన్నవయస్కుడిగా రికార్డు సృష్టించాడు. 2004 అండర్-19 క్రికెట్ ప్రపంచకప్‌లో భారత జట్టుకు అంబటి రాయుడు నాయకత్వం వహించాడు. శిఖర్ ధావన్, సురేశ్ రైనా, దినేశ్ కార్తీక్ ఉన్న ఆ జట్టు ఆ టోర్నీ సెమీఫైనల్ దాకా వెళ్లగలిగింది. అంబటి రాయుడు తన కెరీర్‌లో కోచ్‌లు, ఆటగాళ్లతో విబేధాల కారణంగా రంజీ జట్లను తరచుగా మారాడు. హైదరాబాద్, ఆంధ్రా, విదర్భ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. 2017లో మళ్లీ హైదరాబాద్‌తో జతకలిశాడు. బీసీసీఐ నిషేధించిన ఇండియన్ క్రికెట్ లీగ్‌లో 2007లో ఆడడం రాయుడు కెరీర్‌ను దెబ్బతీసింది. ఆ టోర్నీలో పాల్గొని 2009 వరకు నిషేధాన్ని ఎదుర్కొన్నాడు.

**వివాదాలు**

కోపం, ముక్కుసూటి తనంతో అంబటి రాయుడు తన కెరీర్‌లో ఎన్నో వివాదాల్లో చిక్కుకున్నాడు. 2005లో ఆంధ్రా జట్టు తరపున ఆడుతున్న సమయంలో హైదరాబాద్ ఆటగాడు అర్జున్ యాదవ్‌తో మైదానంలో గొడవ పెట్టుకున్నాడు. 2012లో ఐపీఎల్ మ్యాచ్‌లో ప్రత్యర్థి జట్టు ఆటగాడైన హర్షల్ పటేల్‌ను దూషించి వార్తల్లోకెక్కాడు. 2016లో ముంబయి ఇండియన్స్ తరపున సొంత జట్టు ఆటగాడైన హర్భజన్ సింగ్‌తోనే మైదానంలో గొడవ పడ్డాడు. తాజాగా ప్రపంచకప్‌నకు ఎంపిక చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. సెలక్టర్ల మాటలను విమర్శించే రీతిలో ట్వీట్ చేశాడు.

**దశ మార్చిన ఐపీఎల్**

2010 ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్‌కు ఆడేందుకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకున్న రాయుడు అదరగొట్టాడు. దీంతో టీమ్‌ఇండియాలో చోటు దక్కించుకున్నాడు. 2014లో జింబాబ్వేతో సిరీస్‌లో టీమ్‌ఇండియా తరపున అరంగేట్రం చేశాడు. 2015 ప్రపంచకప్‌కు ఎంపికైనా ఒక్కమ్యాచ్‌లోనూ తుది జట్టులో చోటు సంపాదించలేకపోయాడు. 2018 ఐపీఎల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ జట్టుకు వెళ్లి రాణించాడు. ఏడాది కాలంగా టీమ్‌ఇండియా వన్డే జట్టులో నాలుగో స్థానంలో ఆకట్టుకుంటున్నాడు.



# వేళయిందా..

## ధోనీ వీడ్కోలుపై ఆసక్తికర కథనాలు

**బర్మింగ్‌హామ్:** ప్రపంచకప్ తర్వాత భారత సీనియర్ క్రికెటర్ మహేంద్రసింగ్ ధోనీ ఆటకు వీడ్కోలు పలుకుతున్నాడంటూ ఆసక్తికర కథనాలు వెలువడుతున్నాయి. మెగాటోర్నీలో టీమ్‌ఇండియా ఆడే ఆఖరి మ్యాచ్ ధోనీకి చివరిదంటూ వార్తలు వస్తున్నాయి. బంగ్లాదేశ్‌పై అద్భుత విజయంతో ఇప్పటికే సెమీఫైనల్ బెర్తును దక్కించుకున్న కోహ్లీసేన.. ఈనెల 14న జరిగే ఫైనల్లో ఆడి ప్రపంచకప్‌ను గెలిస్తే..ధోనీకి ఇంతకన్నా ఘనమైన వీడ్కోలు మరొకటి ఉండదంటూ రాసుకొస్తున్నారు.భారత్‌కు రెండు ప్రపంచకప్‌లు అందించిన ఈ జార్ఖండ్ డైనమైట్ ప్రపంచకప్ తర్వాత జాతీయ జట్టుతో కలిసి కొనసాగే అవకాశాలు లేవం టూ కొన్ని వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. ధోనీ రిటైర్మెంట్ తీసుకోబోతున్నట్లు ఇప్పటికే బోర్డుకు సమాచారమందించినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. 'ధోనీ ఎప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడో ఎవరికి తెలియదు. ప్రపంచకప్ తర్వాత అతను భారత జట్టుతో కలిసి కొనసాగే అవకాశాలు కనిపించడం లేదు. మూడు ఫార్మాట్ల కెప్టెన్సీ నుంచి తప్పుకుంటానంటూ ఆకస్మాత్తుగా ప్రకటించినట్లే.. ధోనీ నిర్ణయాలను అంచనా వేయలేం' అని పేరు చెప్పడానికి ఇష్టపడని బీసీసీఐ అధికారి అన్నాడు. ఇదిలా ఉంటే ప్రస్తుత సెలెక్షన్ కమిటీ పదవీకాలం ఈ యేడాది అక్టోబర్‌తో ముగియనున్నది. కొత్తగా కొలువుదీరే సెలెక్షన్ కమిటీ వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే టీ20 ప్రపంచకప్‌పై దృష్టిపెట్టే అవకాశం ఉంటుంది. దూకుడుకు మారుపేరైన టీ20 ఫార్మాట్‌కు తగ్గట్లు యువ క్రికెటర్లకు చాన్స్ ఇచ్చేందుకు మొగ్గుచూపవచ్చు. సీనియర్ల స్థానాలను భర్తీచేస్తూ.. ప్రతిభ కల్గిన యువ క్రికెటర్లకు చోటు కల్పించేందుకు ఆస్కారముంటుంది.

**ధోనీ కీలకం**

ప్రస్తుత టీమ్‌ఇండియాలో అనుభవజ్ఞుడైన ధోనీ సేవలు కీలకమని మేనేజ్‌మెంట్ భావిస్తున్నది. గతానికి భిన్నంగా పేలవ ప్రదర్శన కొనసాగిస్తున్నా..కెప్టెన్ కోహ్లీ, వైస్ కెప్టెన్ రోహిత్, బ్యాటింగ్ కోచ్ బంగర్ లాంటి వాళ్లు మహీని వెనకేసుకు వస్తున్నారు. అతని ప్రాతినిధ్యం జట్టుకు ఎంతో లాభమంటూ వ్యాఖ్యానిస్తున్నారు. ధోనీ జిడ్డు ఆటతీరుపై భారత మాజీలు సచిన్, గంగూలీ లాంటి వాళ్లు విమర్శలు గుప్పిస్తున్నా.. మేనేజ్‌మెంట్ మాత్రం అతడికి అండగా నిలుస్తున్నది. అతనుంటే జట్టుకు కొండంత బలమంటూ విశ్వసిస్తున్నది. ఈ నేపథ్యంలో మెగాటోర్నీలో కీలక సమయం ఆసన్నమైనందున అతని సేవలను వాడుకునేందుకు బోర్డు మొగ్గుచూపుతున్నది. ఒక వేళ తన సేవలు ఇక చాలు అనుకుంటే మాత్రం ఏ క్షణాన్నైనా మహీ వీడ్కోలు పలికే అవకాశముంది.




**లండన్:** స్విట్జర్లాండ్ టెన్నిస్ స్టార్ స్టాన్ వావ్రింకా(19వ ర్యాంకు)కు వింబుల్డన్ రెండో రౌండ్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది. అమెరికాకు చెందిన రేలీ ఓపెల్కా(63వ ర్యాంకు) చేతిలో చివరి వరకు హోరాహోరీగా పోరాడి 5-7, 6-3, 6-4, 4-6, 6-8 తేడాతో పరాజయం పాలై, టోర్నీ నుంచి నిష్క్రమించాడు. మొత్తం 3గంటల13 నిమిషాలు జరిగిన మ్యాచ్‌లో 23ఏస్‌లు, 59 విన్నర్లతో ఓపెల్కా సత్తా చాటాడు. చివరి వరకు ఆధిపత్యం చేతులు మారుతూ వచ్చిన మ్యాచ్‌లో కీలక సమయాల్లో పాయింట్లు సాధించి వావ్రింకాకు షాక్ ఇచ్చి, మూడో రౌండ్‌లో ఓపెల్కా అడుగుపెట్టాడు. మరో మ్యాచ్‌లో స్పెయిన్‌కు చెందిన ఎఫ్.లోపేజ్(54)పై కె.కచనోవ్(రష్యా,9) 4-6, 6-4, 7-5, 6-4తో కష్టపడి నెగ్గాడు.

**పిస్లికోవా ముందడుగు**

మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో మూడో సీడ్ కె.పిస్లికోవా(చెక్ రిపబ్లిక్)... ఎం.పూయిజ్‌పై 6-0, 6-4తో సునాయాస విజయం సాధించి ముందడుగేసింది. మరో మ్యాచ్‌లో రొమానియాకు చెందిన బూజర్ నెస్క్యూ(53వ ర్యాంకు)పై అదే దేశానికి చెందిన ఎస్.హలెప్(7) 6-3, 4-6, 6-2 తేడాతో చెమటోడ్చి నెగ్గింది.

# బామ్మకు బాసట!



**బర్మింగ్‌హామ్:** చారులత పటేల్..భారత క్రికెట్ వీరాభిమాని. బంగ్లాతో మంగళవారం బర్మింగ్‌హామ్‌లో జరిగిన మ్యాచ్‌లో ఈ 87 ఏండ్ల బామ్మ చేసిన హంగామా సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. టీమ్‌ఇండియాకు మద్దతు పలికిన చారులత అభిమానానికి అచ్చెరువొందిన కోహ్లీ, రోహిత్ మ్యాచ్ ముగిసిన తర్వాత బామ్మను కలుసుకుని ఆశ్వీరాదం తీసుకున్నారు. ప్రపంచకప్‌లో మిగిలిన భారత్ మ్యాచ్‌లు చూసేందుకు బామ్మకు టిక్కెట్లు ఇచ్చేందుకు కోహ్లీ సిద్ధమయ్యాడు. 'టీమ్‌ఇండియా ఆడే మ్యాచ్‌ల్లో కోహ్లీ నన్ను స్టేడియంలో చూడాలనుకున్నాడు. కానీ నేను టిక్కెట్లు లేవని చెప్పాను. వాటి గురించి ఆందోళన చెందకండి ఇస్తానంటూ కోహ్లీ హామీ ఇచ్చాడు' అని చారులత అంది. మరోవైపు మహీంద్రా గ్రూపు యజమాని ఆనంద్ స్పందిస్తూ 'మ్యాచ్ విన్నింగ్ లేడీ ఎవరో ఆమెను గుర్తించండి. ప్రపంచకప్‌లో మిగిలిన భారత్ మ్యాచ్‌లు చూసేందుకు టిక్కెట్లకయ్యే ఖర్చును నేను పూర్తిగా భరిస్తాను' అని మహేంద్ర ట్వీట్ చేశారు.

# ఎన్నాళ్లకెన్నాళ్లకు..




బెయిర్‌స్టో (106)

**1** ప్రపంచ కప్‌లో వరుస మ్యాచ్‌ల్లో సెంచరీ చేసిన తొలి ఇంగ్లిష్ క్రికెటర్‌గా బెయిర్‌స్టో నిలిచాడు

## 27 ఏండ్ల తర్వాత సెమీస్‌కు ఇంగ్లండ్

### బెయిర్‌స్టో శతక విజృంభణ.. కివీస్‌పై భారీ విజయం

**ఆతిథ్య జట్టు ఇంగ్లండ్ అదరగొట్టింది. సొంతగడ్డపై జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ప్రపంచకప్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్న రీతిలో సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ 27 ఏండ్ల తర్వాత తొలిసారి నాకౌట్ బెర్తు దక్కించుకుంది. బెయిర్‌స్టో సూపర్ సెంచరీతో మరోమారు కదంతొక్కిన వేళ పోరాడే స్కోరు అందుకున్న మోర్గాన్‌సేన..కట్టుదిట్టమైన బౌలింగ్‌తో కివీస్ రెక్కలు విరిచింది. అనామక జట్లపై అలవోక విజయాలతో ఆదిలో జోరు కనబరిచిన కివీస్..ఆఖరి దశలో వరుస ఓటములతో నాలుగో స్థానానికి పరిమితమైంది. ఇంగ్లండ్ విజయంతో మిణుకు మిణుకుమంటున్న పాక్ నాకౌట్ ఆశలు కనుమరుగయ్యాయి.**

**చెస్టర్ లీ స్ట్రీట్:** తమ కలల కప్‌ను సాకారం చేసుకునే క్రమంలో ఇంగ్లండ్ మరో ముందడుగు వేసింది. అసలు సెమీ ఫైనల్ చేరుతుందా అన్న అనుమానాలను పటాపంచలు చేస్తూ భారత్, న్యూజిలాండ్‌పై వరుస విజయాలతో తమకు తిరుగులేదని చాటింది. పడిలేచిన కెరటంలా ప్రత్యర్థులపై విరుచుకుపడుతూ సొంతగడ్డపై అభిమానుల అంచనాలకు అనుగుణంగా దూసుకెళుతున్నది. బుధవారం న్యూజిలాండ్‌తో తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 119 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. దీని ద్వారా ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లో 6 విజయాలు, 3 ఓటములతో 12 పాయింట్లతో ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్నది. మరోవైపు గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో కివీస్ అన్నింటా విఫలమై మూల్యం చెల్లించుకుని నాలుగో స్థానానికి పరిమితమైంది. ఇంగ్లండ్ నిర్దేశించిన 306 పరుగుల లక్ష్యఛేదనలో మార్క్ వుడ్(3/34) ధాటికి కివీస్ 45 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌటైంది. లాథమ్(57) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. తొలుత జానీ బెయిర్‌స్టో(99 బంతుల్లో 106, 15 ఫోర్లు, సిక్స్) సెంచరీకి తోడు రాయ్(61 బంతుల్లో 60, 8ఫోర్లు) అర్ధసెంచరీతో ఇంగ్లండ్..50 ఓవర్లలో 305/8 స్కోరు చేసింది. బౌల్ట్(2/56), హెన్రీ(2/54), నీషమ్(2/41) రాణించారు. సెంచరీతో జట్టు గెలుపులో కీలకమైన బెయిర్‌స్టోకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

**కివీస్ టపాటపా**

నిర్దేశిత లక్ష్యఛేదనకు దిగిన కివీస్‌కు ఆదిలోనే నికోల్స్(0) రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. వుడ్ బౌలింగ్‌లో నికోల్స్ వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయాడు. ఓపెనర్ గప్టిల్(8) మరోమారు నిరాశపరిచాడు. రెండు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన జట్టును కెప్టెన్ విలియమ్సన్(27), టేలర్(28) గట్టెక్కించే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. ఎనిమిది పరుగుల తేడాతో వీరిద్దరు రనౌట్ కావడంతో కివీస్ పతనానికి నాంది పడింది. లాథమ్ ఒంటరి పోరాటం చేసినా ఇంగ్లండ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. వచ్చిన బ్యాట్స్‌మెన్ వచ్చినట్లు పెవిలియన్ చేరడం రన్‌రేట్ అంతకంతకు పెరుగుతూ పోవడం జట్టు కొంప ముంచింది.

**స్కోరు బోర్డు**

**ఇంగ్లండ్:** రాయ్(సి)సాంట్నర్(బి)నీషమ్ 60, బెయిర్‌స్టో(బి)హెన్రీ 106, రూట్(సి)లాథమ్(బి)బౌల్ట్ 24, బట్లర్(సి)విలియమ్సన్(బి)బౌల్ట్ 11, మోర్గాన్ (సి)సాంట్నర్(బి)హెన్రీ 42, స్టోక్స్(సి)హెన్రీ(బి)సాంట్నర్ 11, వోక్స్(సి)విలియమ్సన్(బి)నీషమ్ 4, ప్లంకెట్ 15 నాటౌట్, రషీద్(బి)సౌథీ 16, ఆర్చర్ 1 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 15; **మొత్తం:** 50 ఓవర్లలో 305/8; **వికెట్ల పతనం:** 1-123, 2-194, 3-206, 4-214, 5-248, 6-259, 7-272, 8-301; **బౌలింగ్:** సాంట్నర్ 10-0-65-1, బౌల్ట్ 10-0-56-2, సౌథీ 9-0-70-1, హెన్రీ 10-0-54-2, గ్రాండ్‌హోమ్ 1-0-11-0, నీషమ్ 10-1-41-2.

**న్యూజిలాండ్:** గప్టిల్(సి)బట్లర్(బి)ఆర్చర్ 8, నికోల్స్(ఎల్బీ)వోక్స్ 0, విలియమ్సన్(రనౌట్) 27, టేలర్(రనౌట్)28, లాథమ్(సి)బట్లర్(బి)ప్లంకెట్ 57, నీషమ్(బి)వుడ్ 19, గ్రాండ్‌హోమ్ (సి)రూట్(బి)స్టోక్స్ 3, సాంట్నర్(ఎల్బీ)వుడ్ 12, సౌథీ 7 నాటౌట్, హెన్రీ(బి)వుడ్ 7, బౌల్ట్ (స్టంప్/బట్లర్)(బి)రషీద్ 4; **ఎక్స్‌ట్రాలు:** 14; **మొత్తం:** 45 ఓవర్లలో 186 ఆలౌట్; **వికెట్ల పతనం:** 1-2, 2-14, 3-61, 4-69, 5-123, 6-128, 7-164, 8-166, 9-181, 10-186; **బౌలింగ్:** వోక్స్ 8-0-44-1, ఆర్చర్ 7-1-17-1, ప్లంకెట్ 8-0-28-1, వుడ్ 9-0-34-3, రూట్ 3-0-15-0, రషీద్ 5-0-30-1, స్టోక్స్ 5-0-10-1.

**'సూపర్' బెయిర్‌స్టో**

ఇంగ్లండ్ ఓపెనర్ జానీ బెయిర్‌స్టో శతక గర్జన చేశాడు. విమర్శలకు తన బ్యాటుతో దీటైన సమాధానం చెబుతూ వరుస రెండో సెంచరీతో కివీస్‌పై ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఆది నుంచే దూకుడు కనబరుస్తూ సహచర రాయ్‌తో కలిసి మరోమారు జట్టుకు మెరుగైన శుభారంభాన్నందించాడు. తన ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, ఓ సిక్స్‌తో కివీస్‌పై ముప్పేట దాడికి పాల్పడ్డాడు. బెయిర్‌స్టో, రాయ్ పోటాపోటీగా పరుగులు సాధించడంతో ఓ దశలో భారీ స్కోరుకు బాటలు పడుతాయనుకున్నా..మిగతా బ్యాట్స్‌మెన్ వైఫల్యంతో నామమాత్రపు స్కోరుకు పరిమితమయ్యారు. కెప్టెన్ మోర్గాన్(42) మినహా ఎవరూ బ్యాట్లు ఝులిపించకపోవడం ఇంగ్లండ్ భారీ స్కోరు ఆశలపై నీళ్లు చల్లింది. ఈ మ్యాచ్‌లో ఫెర్గుసన్‌ను పక్కకుపెడుతూ సౌథీని తీసుకోవడం కివీస్ అవకాశాలను దెబ్బతీసింది.

S.I - కానిస్టేబుల్స్
బిజ్జుల విష్ణువర్ధన్ రెడ్డి
నూతన బ్యాచ్ ప్రారంభం
07-07-2019 ఉ॥9 గం॥లకు
అక్షర స్టడీ సర్కిల్ HYD
9000373787, 9397373787

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 39,839 | 11,917 |
| ↗23 | ↗6 |

ముడి చమురు (బ్రెంట్) ↗ 63.76 డాలర్లు

**బంగారం ధరలు**

| న్యూఢిల్లీ (రూ.లలో) | |
|---|---|
| 24 క్యారెట్లు | 34,380 |
| 22 క్యారెట్లు | 34,210 |
| వెండి (కిలో) | 38,650 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 66.00 | 71.50 |
| యూరో | 74.30 | 80.30 |
| బహ్రెయిన్ దినార్ | 173.00 | 187.00 |
| కువైట్ దినార్ | 217.00 | 231.00 |
| సౌదీ రియాల్ | 17.00 | 18.60 |
| యూఏఈ దిర్హామ్ | 17.80 | 19.50 |

**చికెన్ ధరలు** (రూ.లలో)

| | |
|---|---|
| ఫారం ధర | 98.00 |
| రిటైల్ లైవ్ | 120.00 |
| డ్రెస్డ్ | 174.00 |
| స్కిన్‌లెస్ | 198.00 |

**నెక్ (వంద గుడ్లకు)** (రూ.లలో)

| | |
|---|---|
| హైదరాబాద్ | 425-00 |
| రంగారెడ్డి | 425-00 |
| మెదక్ | 425-00 |
| కరీంనగర్ | 428-00 |
| వరంగల్ | 428-00 |
| రిటైల్ ప్రైస్ | 4-85 |



# ఆశల పల్లకిలో..

## రేపు బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్న సీతారామన్.. వృద్ధికి ఊతమివ్వాలంటున్న నిపుణులు

**వార్షిక బడ్జెట్‌కు వేళయ్యింది. శుక్రవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఇది సామాన్యుడి కలల బడ్జెట్ అవుతుందా?.. లేదంటే ఊరించి ఉసూరుమనిపిస్తుందా?.. అన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొన్నది. వృద్ధి రేటు తిరోగమిస్తున్న సమయంలో సీతారామన్ లెక్క బడుగు జీవుల బతుకును ఏ విధంగా ప్రభావితం చేస్తుందో మరికొన్ని గంటల్లో తేలనున్నది. నిజానికి గత ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో పోల్చితే సీతారామన్‌కు ఇప్పుడున్న పరిస్థితులు సవాల్‌నే విసురుతున్నాయి.**

**న్యూఢిల్లీ, జూలై 3:** ఎన్నో ఆశలు.. మరెన్నో సవాళ్లు.. అంతకు మించిన లక్ష్యాల మధ్య కేంద్ర బడ్జెట్‌ను మోసుకొస్తున్నారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఈ ఏడాది ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్‌తోనే సరిపెట్టగా, అప్పటికీ.. ఇప్పటికీ దేశ ఆర్థిక పరిస్థితుల్లో చాలానే మార్పు వచ్చింది. జనవరి-మార్చి మధ్య కేవలం 5.8 శాతం వృద్ధిరేటే నమోదైంది. ఇది అంచనాల కంటే చాలా తక్కువ. ఇక వర్షాలు కూడా ఆశించిన స్థాయిలో పడటం లేదు. దేశీయ వ్యవసాయ రంగం వర్షాలపైనే అధికంగా ఆధారపడి ఉన్న విషయం తెలిసిందే. జీడీపీలో వ్యవసాయం వాటా కూడా ఎక్కువేనన్న సంగతి విదితమే. జూన్‌లో వర్షాభావ పరిస్థితులు గడిచిన వందేండ్లలో ఐదో అత్యంత దారుణమైనవని గణాంకాలు చెబుతున్నాయి. దీనివల్ల వినియోగదారుల కొనుగోళ్ల శక్తి దెబ్బతిని మార్కెట్లు మందగమనంలోకి వెళ్తాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా మొత్తం ఆర్థిక వ్యవస్థే కుంటుబడుతుందని అంటున్నారు. అందుకే వృద్ధిదాయక బడ్జెట్ అవసరమని చెబుతున్నారు.




శానిటరీవేర్ ఉత్పత్తులపై

### జీఎస్టీని తగ్గించండి

ఈ బడ్జెట్‌లో శానిటరీవేర్ ఉత్పత్తులపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని కోరుతున్నారు ఈ రంగ ఇండస్ట్రీ వర్గాలు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛభారత్ పథకంతో శానిటరీవేర్ ఉత్పత్తులు తక్కువధరకు సామాన్యులకు అందించాలంటే జీఎస్టీని తగ్గించాలని శానిటరీవేర్ తయారీదారుల సంఘం కౌన్సిల్ డైరెక్టర్ ఆర్‌బీ కాబ్రా తెలిపారు. శానిటరీవేర్ ఉత్పత్తుల వాడకంపై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడం లేదని, ఇప్పటికీ కేవలం 60 శాతం మంది మాత్రమే వీటిని వాడుతున్నారని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నారు. పొరుగు దేశాల్లో 90 శాతానికి పైగా ఉన్నది. బాత్‌రూంలలో బిగించే నల్లలపై కూడా 18 శాతం పన్ను విధిస్తున్నారు.

### అప్రమత్తత అవసరం

సంక్షేమ పథకాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులు తదితర కారణాలతో సర్కారీ వ్యయం కొండంత అవుతున్నది. దీంతో ద్రవ్యలోటు, ద్రవ్యోల్బణం వంటి ఆర్థిక లక్ష్యాలపై అప్రమత్తత అవసరమని, అవసరమైన వాటికి తప్ప, అనవసరమైన వాటికి బడ్జెట్ కేటాయింపులు తక్కువగా చేసుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం జీడీపీలో ప్రభుత్వ స్థూల రుణాల విలువ దాదాపు 70 శాతంగా ఉన్నది. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నుంచి వచ్చే ఆదాయం అంతంతమాత్రంగా ఉన్న వేళ ద్రవ్యలోటు గతి తప్పకుండా బడ్జెట్‌లో సీతారామన్ తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### స్టార్టప్‌లకు మరిన్ని నిధులివ్వాలి

స్టార్టప్‌లకు మరిన్ని నిధులు అందేలా బడ్జెట్‌లో చర్యలు తీసుకోవాలని, ఉత్పాదక రంగాన్ని బలపరిచేలా ప్రోత్సాహకభరిత రుణ సదుపాయాలను కల్పించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. స్టార్టప్‌లకు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్‌ఎంఈ)ల కోసం వృద్ధికారక నిధిని ఏర్పాటు చేయాలని సిగ్మా వెంచర్స్ సహ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ నిల్యాంక భూషణ్ విజ్ఞప్తి చేస్తున్నారు. కొత్తదనానికి, ప్రతిభకు పట్టం కట్టాలంటే స్టార్టప్‌లను ప్రోత్సహించాలని గుర్తుచేశారు.

### బాలల కోసం బడ్జెట్ పెంచాలి

బాలల సంక్షేమ పథకాల కోసం బడ్జెట్‌ను పెంచాలని బాలల హక్కుల పరిరక్షణ కోసం పాటుపడుతున్న ఎన్జీవోలు డిమాండ్ చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో గల చిన్నారుల భద్రతపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నాయి. సర్వ శిక్షా అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ), రాష్ట్రీయ మాధ్యమిక్ శిక్షా అభియాన్ (ఆర్‌ఎంఎస్‌ఏ), సమగ్ర శిక్షా అభియాన్ కింద టీచర్స్ ఎడ్యుకేషన్ వంటి వాటికి బడ్జెట్‌లో మరింత ప్రాధాన్యతనివ్వాలని కోరాయి.

### ద్రవ్యలోటు కట్టడి సవాలే..

ద్రవ్యలోటును కట్టడి చేయడం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఎదుట ఇప్పుడున్న పెద్ద సవాల్‌గా కనిపిస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) జీడీపీలో ద్రవ్యలోటు 3.4 శాతంగా ఉండొచ్చని మధ్యంతర బడ్జెట్‌లో మోదీ సర్కారు అంచనా వేసింది. ఇదే సమయంలో రాయితీల భారం పెరుగుతుందన్న ఆందోళననూ కనబరిచింది. ఈ క్రమంలో వీటిని సమతూకం చేస్తూ బడ్జెట్‌ను సీతారామన్ ప్రవేశపెట్టాల్సి ఉన్నది. గత ఆర్థిక సంవత్సరం (2018-19) ప్రభుత్వ స్థూల ఆదాయం రూ.1.46 లక్షల కోట్లు తగ్గవచ్చని కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ ప్రాథమిక అంచనా. అయితే సవరించిన అంచనాల ప్రకారం ఇది 14.8 లక్షల కోట్లు. ఇందుకు కారణం పడిపోయిన పన్ను వసూళ్లే. ఇక కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్).. మోదీ సర్కారు అప్పులను తప్పుబట్టిన విషయం తెలిసిందే. మితిమీరిన రుణాలు చేస్తున్నారంటూ కాగ్ విమర్శించింది. ఈ క్రమంలో సీతారామన్ బడ్జెట్ ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే.

### ఎవరేమన్నారు..



విద్యుత్ వాహనాల వాడకం పెరుగాలంటే కేంద్ర ప్రభుత్వం మరిన్ని సహాయ సహకారాలు అందించాల్సి ఉంటుంది. వీటిని ఉత్పత్తి చేస్తున్న సంస్థలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించాలి, అప్పుడే ఉత్పత్తిని పెంచి ప్రజల్లో వీటి వాడకంపై మరింత అవగాహన కల్పించాల్సి అవసరం ఉంది.

**- నాగసత్యం, ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఈడీ**



ప్రస్తుతం పరుపుల ఇండస్ట్రీ డిమాండ్ లేమి తో సతమతమవుతున్నది. ఆర్థిక రంగం మళ్లీ ట్రాక్‌లోకి వస్తేనే అన్ని రంగాలు పరుగులు పెట్టే అవకాశం ఉన్నది. ముఖ్యంగా గృహ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, హెల్త్‌కేర్, విద్య రంగానికి భారీ స్థాయిలో నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

**- ఉత్తమ్ మలాని, సెంచురీ మ్యాట్రిస్ ఈడీ**



గడిచిన కొన్ని సంవత్సరాలుగా దేశీయ ఆరోగ్య రంగం లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. అందరికి ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో మోదీ సర్కార్ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఈ ఏడాది కూడా హెల్త్‌టెక్నాలజీ కంపెనీలకు పలు రాయితీలు ఇస్తే అందరికి చౌకంగా ఆరోగ్య సేవలు లభించనున్నాయి.

**- హరి తాలపల్లి, కాల్‌హెల్త్ సీఈవో**



ప్రస్తుతం దేశంలో పునరుత్పాదక విద్యుత్ చాలా కీలకంగా మారింది. ముఖ్యంగా వినిమయంలో సౌర విద్యుత్‌కు అత్యంత డిమాండ్ నెలకొన్నది. వ్యక్తిగత, రెసిడెన్షియల్, కమర్షియల్ సౌర విద్యుత్ ఉత్పత్తి పెరుగాలంటే వీటిపై పన్ను రాయితీలు కల్పించాలి.

**- రాధిక చౌదరి, ఫ్రెయిర్ ఎనర్జీ కో-ఫౌండర్**

### నగదు కొరత తీర్చాలి

నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న నగదు కొరతను తీర్చాలని రియల్టర్లు డిమాండ్ చేస్తున్నారు. 2022కల్లా 'హౌజింగ్ ఫర్ ఆల్' లక్ష్యాన్ని చేరుకునేలా ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు జరుపాలని కోరుతున్నాయి. బ్యాంకుల నుంచి రుణాలు అందేలా, ఇండ్ల కొనుగోళ్లు పెరిగేలా కొనుగోలుదారులకు పన్ను ప్రోత్సాహకాలు ప్రకటించాలని సీబీఆర్‌ఈ ఆగ్నేయాసియా, మధ్య ప్రాచ్య, ఆఫ్రికా చైర్మన్, సీఈవో అన్షుమన్ మ్యాగజైన్ సూచిస్తున్నారు.

**బడ్జెట్ డిమాండ్లు..**

- ఆదాయం పన్ను మినహాయింపు పరిమితి పెంపు
- సీనియర్ సిటిజన్లకు పన్ను, పొదుపు ప్రోత్సాహకాలు
- ఎగుమతుల వృద్ధికి వీలుగా మార్కెటింగ్ ఆధారిత నిధి
- ఆర్‌అండ్‌డీ పెట్టుబడులపై పన్నుల కోత
- కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపు
- క్యాపిటల్ గూడ్స్‌పై కస్టమ్స్ సుంకం తగ్గుదల
- ఎగుమతుల రంగానికి పన్ను ప్రయోజనాలు
- అదనపు ఉద్యోగ, ఉపాధి అవకాశాలనిచ్చే సంస్థలకు ఐటీ ఉపశమనం
- డిజిటల్ ఎకానమీకి మరింత ఉత్సాహాన్నిచ్చే నిర్ణయాలు
- నిర్మాణ, గృహ రంగాల ప్రగతికి చర్యలు
- చిన్న, సన్నకారు రైతుల కోసం పెన్షన్ పథకం
- రూ.20,000 కోట్లతో విత్తన అంకుర నిధి
- రూ. లక్ష వరకు వడ్డీ రహిత కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) రుణాలు

# నేడు ఆర్థిక సర్వే

## సిద్ధం చేసిన సీఈఏ కృష్ణమూర్తి సుబ్రమణియన్



**న్యూఢిల్లీ, జూలై 3:** గత ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను ఆర్థిక సర్వే గురువారం పార్లమెంట్‌కు వస్తున్నది. ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) కృష్ణమూర్తి సుబ్రమణియన్ దీన్ని తెస్తున్నారు. దీంతో ఇప్పుడు అందరి కళ్లు ఆర్థిక సర్వేపైనే ఉన్నాయి. కొత్త సీఈఏ.. గత ఆర్థిక సంవత్సరం దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొన్న ఏయే ఇబ్బందులను పసిగట్టారు, వాటికి ఎలాంటి అత్యుత్తమ పరిష్కార మార్గాలను సూచించారు అన్నదానిపై సర్వత్ర ఉత్కంఠ నెలకొన్నది. కాగా, ఆర్థిక మందగమనం, కనీస వేతనాల కొరత, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల కష్టాలు, ప్రభుత్వ రంగ బ్యాంకుల మొండి బకాయిల (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) సమస్య, ఆర్థిక మార్కెట్ల నిబంధనలు వంటివి రాబోయే ఆర్థిక సర్వేలో ప్రధానాంశాలు కావచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**ఆర్థిక వృద్ధే అన్నింటికీ మందు**

ఆర్థిక వృద్ధే అన్నింటికీ మందు అని, రెండంకెల ద్రవ్యోల్బణాన్ని అదుపులో పెట్టగలదని కృష్ణమూర్తి సుబ్రమణియన్ అంటున్నారు. ఈ క్రమంలోనే పీఎం-కిసాన్ స్కీం.. రైతుల సమస్యలకు చక్కని పరిష్కారంగా ఆయన పేర్కొంటున్నారు. ఇక ప్రస్తుతం దేశ ఆర్థిక రంగాన్ని కుదిపేస్తున్న వాటిలో ఎన్‌బీఎఫ్‌సీల సంక్షోభం కూడా ఒకటి. దీన్ని ఆర్థిక సర్వేలో కృష్ణమూర్తి గట్టిగానే వివరించే వీలుందని, ఆస్తులు, అప్పుల మధ్య ఉన్న విపరీతమైన తేడానే ఎన్‌బీఎఫ్‌సీ కష్టాలకు కారణమని ఆయన అభిప్రాయపడుతున్నారు. ఐబీసీ, డీబీటీ, పన్నుల విధాన సరళీకరణకూ జై కొడుతున్న కృష్ణమూర్తి.. చిన్న వ్యాపారాలకు ప్రోత్సాహకాలు అవసరమని, ఇవి ఉద్యోగావకాశాలను పెంచుతాయని అభిప్రాయపడ్డారు. గతంలో పాత పెద్ద నోట్ల రద్దును అవినీతి నిర్మూలన ఆయుధంగా పేర్కొన్న ఈయన హైదరాబాద్ ఐఎస్‌బీలో ఆర్థిక అధ్యాపకుడిగా పనిచేసిన విషయం తెలిసిందే. జేపీ మోర్గాన్‌లో కన్సల్టెంట్‌గానూ పనిచేసిన కృష్ణమూర్తి.. దేశ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని ఎలా అభివర్ణిస్తారో చూడాలి.

# ఉద్యోగ కల్పనకు పెద్దపీట వేయాలి

## ఎఫ్‌టాప్సీ ప్రెసిడెంట్ అరుణ్ లుహరుకా



**హైదరాబాద్, జూలై 3:** ప్రస్తుత సంవత్సరానికిగాను ప్రవేశపెడుతున్న బడ్జెట్ వృద్ధికి ఊతమిచ్చేలా ఉండాలని, అప్పుడే 8 శాతం నుంచి 10 శాతానికి చేరుకోవడానికి వీలుంటుందని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టాప్సీ) ప్రెసిడెంట్ అరుణ్ లుహరుకా వెల్లడించారు. వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగు పరుచడానికి అధిక మొత్తంలో నిధులు వెచ్చించాలని సూచించిన ఆయన.. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్, వినిమయం పెరుగాలంటే కోల్డ్ స్టోరేజ్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగ కల్పనకు పెద్దపీట వేయడానికి అనువైన పరిస్థితులు కల్పించడానికి పెట్టుబడులను ప్రోత్సహించడానికి పలు కీలక చర్యలు తీసుకోవాలన్నారు. ఈక్విటీ మార్కెట్లలోకి ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించడానికి పన్ను రాయితీలు ఇవ్వాలని, అలాగే పన్ను చెల్లింపులను మరింత సరళతరం చేయాలని ఆయన సూచించారు. గత బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో వివక్షతకు గురైన తెలంగాణకు ఈసారైన కేటాయింపులు ఉంటాయనుకుంటున్నట్లు చెప్పారు.

# ఏఐలో వాటా విక్రయిస్తాం

## పౌర విమానయాన మంత్రి హర్దీప్ సింగ్

**న్యూఢిల్లీ, జూలై 3:** ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా (ఏఐ)లో వాటా విక్రయానికి కట్టుబడివున్నామని పౌర విమానయాన శాఖ మంత్రి హర్దీప్ సింగ్ రాజ్యసభలో చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఎయిర్ ఇండియా ఆర్థిక పరిస్థితిని మెరుగుపడిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లాభాల్లోకి వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. ప్రతిరోజు విమాన సర్వీసులు అందించడం ద్వారా ఎయిర్ ఇండియాకు రూ.15 కోట్ల ఆదాయం సమకూరుతున్నది. ఎయిర్ ఇండియాను లాభదాయక సంస్థగా తీర్చిదిద్దడానికి కేంద్రం కృషి చేస్తున్నదని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు, ముఖ్యంగా ప్రైవేటీకరణ ప్రతిపాదన కూడా ఉన్నదని, కానీ సంస్థను మూసివేసే అవకాశాలు లేవని ఆయన స్పష్టంచేశారు. విమానయాన సంస్థలు పలు ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్న విష యం వాస్తవమేనని, ముఖ్యంగా అంతర్గత, ఇతర విషయాలు కూడా ఈ ప్రభావాన్ని పెంచుతున్నాయని, ముఖ్యంగా పాకిస్థాన్ గగనతలం మూసివేయడంతో సంస్థలపై అధిక భారం పడుతున్నదన్నారు. ప్రస్తుతం ఎయిర్ ఇండియాకు రూ.59 వేల కోట్ల అప్పు ఉండగా, ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.29 వేల కోట్ల నిధులను కేటాయించాలని గతంలో ప్రతిపాదన వచ్చిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు.

# మైండ్‌ట్రీ ప్రమోటర్‌గా ఎల్ అండ్ టీ



**న్యూఢిల్లీ, జూలై 3:** దేశీయ మధ్యశ్రేణి ఐటీ రంగ సంస్థ మైండ్‌ట్రీ ప్రమోటర్‌గా ఇంజినీరింగ్ దిగ్గజం లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్‌అండ్‌టీ) ఎట్టకేలకు అవతరించింది. ముమ్మర టేకోవర్ ప్రయత్నాల మధ్య మైండ్‌ట్రీలో ఎల్‌అండ్‌టీ చేతికి మెజారిటీ వాటా దక్కింది. ఈ బెంగళూరు ఆధారిత సంస్థలో ఇప్పుడు ఎల్‌అండ్‌టీకి 60.06 శాతం వాటా ఉన్నది. సంస్థ వ్యవస్థాపకులు తొలుత ఎల్‌అండ్‌టీ బలవంతపు టేకోవర్‌ను తీవ్రంగా అడ్డుకున్నా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో మారిన యాజమాన్య వివరాలను బుధవారం మైండ్‌ట్రీ ఓ ప్రకటనలో తెలిపింది.


తెలంగాణ ప్రభుత్వము
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

NIT No. 2318/DB/D2/MBNR/Srinivasa Colony Park/2019, తేది: 17-06-2019 (3వ పిలుపు). పని పేరు: మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో రూరల్ పోలీస్ స్టేషన్ ప్రక్కన మున్సిపల్ ఖాళీ భూమిలో శ్రీనివాసా కాలనీ వద్ద పార్క్ అభివృద్ధి చేయుట. ECV: రూ. 1,02,70,137.00 లక్షలు. బిడ్ దాఖలుకు ముగింపు తేది:11-07-2019న సా.4.30 గం. ఫోన్ నం.040-23399792, 040-23325849. మెయిల్ ఐడి:sephhyd@gmail.com. తదుపరి వివరాల కొరకు https://tender.telangana.gov.in దర్శించండి.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, (PH) వెస్ట్ సర్కిల్, హైదరాబాద్

DIPR R.O.No. 522 DP/CL/Advt/1/2019-20 తేది: 03-07-2019

తెలంగాణ ప్రభుత్వం
ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం, TUFIDC, యూనిట్-IV, రామగుండం

Lr.No. NIT No.26/SE/TUFIDC/ADB-KNR/UNIT-IV/2019-20 తేది: 01-07-2019

సంక్షిప్త టెండరు ప్రకటన

NIT No.26/SE/TUFIDC/ADB-KNR/UNIT-IV/2019-20 పని పేరు: ఆదిలాబాద్ మరియు కరీంనగర్ జిల్లాలలో రోడ్లు, శ్మశానాలు, జంక్షన్ అభివృద్ధి పనులు, పార్కులు వగైరా (TUFIDC క్రింద) (6 పనులు). అంచనా వ్యయం: రూ. 731-03 లక్షలు. టెండరు ప్రక్రియ షెడ్యూల్: బిడ్ దాఖలు ప్రారంభ తేది మరియు సమయం: 04-07-2019, బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం: 15-07-2019న మ. 3.00గం. సాంకేతిక బిడ్ తెరుచు తేది: 15-07-2019న మ.3.30గం. ధర బిడ్ తెరుచు తేది: 15-07-2019న సా. 5.30గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్: https:// tender.telangana.gov.in లో చూడవచ్చును.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, TUFIDC, యూనిట్-IV, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్

DIPR RO No.520-DP/CL/Advt/1/2019-20, Dt: 3/7/2019

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయము
పరిపాలనా కార్యాలయం : రాజేంద్రనగర్ : హైదరాబాద్-500030

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No. 04/PJTSAU/EO/TA/2019-20, తేది: 03-07-2019
18 నం.ల పనులు, ECV-రూ. 141.93 లక్షలు

| | |
|---|---|
| బిడ్ దాఖలు ప్రారంభ తేది మరియు సమయం | : 05-07-2019న మ. 2.30 గం. |
| బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం | : 12-07-2019న సా. 5.00 గం. |
| సాంకేతిక బిడ్ తెరుచు తేది | : 16-07-2019న ఉ. 11.30 గం. (క్ర.సం.18 కొరకు) |
| ధర బిడ్ తెరుచు తేది | : 17-07-2019న ఉ. 11.30 గం. (క్ర.సం.18 కొరకు) |
| ధర బిడ్ తెరుచు తేది | : 16-07-2019న ఉ. 11.30 గం. (క్ర.సం. 01 నుండి 17 కొరకు) |

సంప్రదించు అధికారి & సంప్రదించు వివరాలు:
ఎస్టేట్ అధికారి, 040-24015315 & 040-24015011 Extn:347
తదుపరి వివరాల కొరకు https://tender.telangana.gov.in దర్శించగలరు
సం/ ఎస్టేట్ అధికారి


# రూ. 70 వేల కోట్ల బెయిలవుట్ ప్యాకేజీ!

## బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లకు కేటాయించే అవకాశం

## ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ, జూలై 3:** ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వరంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చినట్లు తెలుస్తున్నది. ప్రైవేట్ టెలికం సంస్థల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడం, రోజు రోజుకు పెరుగుతున్న కష్టాల సుండిగుండం నుంచి బయటపడాలంటే అత్యవసరంగా వేల కోట్ల రూపాయల నిధులు అవసరం. ఈ సంక్షోభ సుడిగుండం నుంచి భయటపడేందుకుగాను కేంద్ర ప్రభుత్వం త్వరలో రూ.70 వేల కోట్ల బెయిలవుట్ ప్యాకేజీ ప్రకటించే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు సంకేతాలిచ్చాయి. ప్రస్తుతం ఆ దిశగా చర్చలు జరుగుతున్నాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌లోనే ఈ ప్యాకేజీ ప్రకటించే అవకాశాలున్నాయని ఆ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. మిగతా ప్రైవేట్ టెలికం సంస్థలు ఇప్పటికే 4జీ సేవలు అందిస్తుండగా, 5జీ సేవలు అందించడానికి సిద్ధమవుతున్న ప్రస్తుత తరుణంలో బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లు 3జీ సేవలకు పరిమితం కావడంతో వినియోగదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. టెక్నాలజీ రంగంలో రోజు రోజుకు వస్తున్న పెను మార్పులను తట్టుకోవడానికి ఈ రెండు సంస్థలు సిద్ధంగా లేకపోవడం, మరోవైపు నిర్వహణ ఖర్చులు తడిసి మోపడు అవుతుండటంతో నిర్వహణ కష్టంగా మారింది. ఈ బెయిలవుట్ ప్యాకేజీలో రూ.20 వేల కోట్లను 4జీ సేవలు అందించడానికి, మరో రూ.40 వేల కోట్లను ఉద్యోగుల స్వచ్ఛంద పదవీ విరమణ, మరో రూ.13 వేల కోట్లను నిర్వహణ కోసం ప్రతిపాదించింది. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌లో 1.76 లక్షల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, వీరి పదవీ విరమణ వయస్సును 60 ఏండ్ల నుంచి 58 ఏండ్లకు కుదించాలనుకుంటున్నది.

**బీఎస్ఎన్ఎల్ నష్టం రూ.14వేల కోట్లు**

బీఎస్ఎన్ఎల్ నష్టాలు అంతకంతకు పెరుగుతున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను




కంపెనీకి రూ.14,202 కోట్ల నష్టం సంభవించినట్లు పార్లమెంట్‌కు కేంద్రం తెలియచేసింది. ఆదాయం కూడా రూ.19,308 కోట్లకు పరిమితమైంది. 2015-16లో రూ.4,859 కోట్ల నష్టం రాగా, ఆ మరుసటి ఏడాదిలో రూ.4,793 కోట్లు, 2017-18లో రూ. 7,993 కోట్లు, గతేడాది రూ.14,202 కోట్ల మేర రావచ్చునని టెలికం మంత్రి రవి శంకర్ ప్రసాద్ లోక్‌సభకు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు.

### మాన్‌సూన్ ఆఫర్ పొడిగింపు

**సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** బీఎస్ఎన్ఎల్ ఇటీవల ప్రకటించిన మాన్‌సూన్ ఆఫర్ గడువును బోనాల పండుగ సందర్భంగా ఈనెల 8వరకు పొడిగించింది. ఈ ఆఫర్‌ను ప్రీపెయిడ్ ప్లాన్-1312కి బదులుగా రూ.201 డిస్కౌంట్‌తో రూ.1,111కే అందిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో పాటు డబుల్ రీఛార్జి ప్లాన్ గడువును సైతం వచ్చే సోమవారం వరకు పొడిగించింది. ఈ ప్లాన్‌లో 1312 ప్లాన్‌కు వర్తించిన విధంగానే అన్‌లిమిటెడ్ కాల్స్, రోజూ 5 జీబీల డేటా, వెయ్యి ఎస్ఎంఎస్‌లు ఉచితంగా అందిస్తున్నది.

# డిజిటల్ అకౌంటింగ్‌పై 5న సదస్సు

## రెండ్రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహణ

**హైదరాబాద్, జూలై 3**: హైదరాబాద్ నగరం మరో జాతీయ సదస్సుకు వేదిక కాబోతున్నది. చార్టెర్ అకౌంటెంట్లకు డిజిటల్ టెక్నాలజీపై మరింత అవగాహన కల్పించడానికి ఈ నెల 5 నుంచి 6 వరకు హైటెక్స్ వేదికగా ఈ సదస్సు జరుగుబోతున్నది. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు దయనివాస్ శర్మ మాట్లాడుతూ..అకౌంటింగ్ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా సీఏలు కూడా నూతన టెక్నాలజీపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, క్లౌడ్ కంప్యూటింగ్, డాటా అనాలటిక్స్‌ల ద్వారా కార్పొరేట్ రంగంలో జరుగుతున్న మోసాలను అరికట్టడానికి ఇవియే ఆయుధాలని ఆయన వివరించారు. బ్లాక్ టెక్నాలజీపై డ్రాఫ్ట్ ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వం తొలుత ప్రవేశపెట్టడం వల్లనే ఇక్కడే ఈ జాతీయ సదస్సు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు శర్మ చెప్పారు. వెయ్యి మంది పాల్గొనున్న ఈ సదస్సుకు ఇప్పటికే 800 మందికి పైగా రిజిస్ట్రార్ చేసుకున్నట్లు ఐసీఏఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ భాను నారాయణ రావు తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో 3 లక్షల మంది సీఏలు ఉండగా, అదే తెలంగాణలో పదివేల మంది ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం డిజిటల్ బాట పట్టడం, ముఖ్యంగా జీఎస్టీ, ఐటీ ఇతర రంగాలు కూడా డిజిటలైజేషన్ కావడంతో ఈ టెక్నాలజీకి భారీగా డిమాండ్ నెలకొందన్నారు.

# బిర్లా గ్రూపు అధినేత బీకే బిర్లా మృతి



**ముంబై, జూలై 3:** బిర్లా గ్రూపు మూలపురుషుడైన బసంత్ కుమార్ బిర్లా(బీకే బిర్లా) బుధవారం ముంబైలో మరణించారు. ఆయన వయస్సు 98 సంవత్సరాలు. దేశీయ పారిశ్రామికవర్గానికి వన్నె తెచ్చిన బిర్లా..వయస్సు సంబంధిత సమస్యలతో మరణించినట్లు కుటుంబ సభ్యులు ఒక ప్రకటనలో వెల్లడించారు. 15 ఏండ్లకే వ్యాపార రంగంలో అడుగుపెట్టిన బిర్లా..సెంచూరి టెక్స్‌టైల్ అండ్ ఇండస్ట్రీస్, కేశోరామ్ ఇండస్ట్రీస్‌లకు చైర్మన్‌గా వ్యవహరించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక్కరు కుమారుడు. ఆయన కుమారుడు ఆదిత్యా విక్రమ్ బిర్లా 1995లోనే మరణించగా, ఆయన భార్య సరళ బిర్లా కూడా 2015లోనే పరమపదించారు. బిర్లా కుమార్తెల్లో మంజుశ్రీ ఖైతాన్, జయశ్రీ మోహతాలు కేశోరామ్ ఇండస్ట్రీస్, జయశ్రీ టీ అండ్ ఇండస్ట్రీలు వ్యాపార విభాగాలను చూసుకుంటున్నారు. గురువారం కోల్‌కతాలోని బిర్లా పార్క్‌లో బిర్లా దహన సంస్కారాలు జరుగనున్నాయి. బీకే బిర్లా పార్థివదేహాన్ని ఆయన మనుమడు కుమార మంగళం బిర్లా నివాళులర్పించారు. బిర్లా మృతితో ముంబైలో ఉన్న బిర్లా బిల్డింగ్‌ను గురువారం మూసివేసివుంచనున్నారు. చిన్నతనంలోనే వ్యాపార రంగంలో అడుగుపెట్టిన బీకే బిర్లా అంచెలంచెలుగా ఎదుగుతూ కేశోరామ్ ఇండస్ట్రీస్‌ను స్థాపించారు.

**రాష్ట్రంతో అవినాభావ సంబంధం..**

బీకే బిర్లాకు రాష్ట్రంతో అవినాభావ సంబంధం ఉన్నది. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలో ఆయన పేరుతో ఏర్పాటైన బసంత్‌కుమార్ గ్రామంలో 1960లోనే రాష్ట్రంలో మొట్టమొదటి సిమెంట్ కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడి సున్నపురాయి నిక్షేపాలతోపాటు, సింగరేణి బొగ్గును కేంద్రంగా చేసుకొని, కేశోరాం సిమెంటు కర్మాగారంతోపాటు, కేశోరాం థర్మల్ కేంద్రాన్ని ఆయన నెలకొల్పారు. ఆయన తండ్రి గన్‌శ్యాందాస్ (జీడీ) బిర్లా పేరిట జీడీనగర్, బసంత్‌కుమార్ బిర్లా పేరిట బసంత్‌నగర్ గ్రామపంచాయతీలుగా ఏర్పడ్డాయి. దీంతో బసంత్‌నగర్‌లో విషాదం నెలకొన్నది. కార్మికులు బాపూజీగా పిలుచుకునే అధినేత మృతిచెందడంపై కర్మాగారం అధికారులు, కార్మికులు, సమీప గ్రామాల ప్రజలు, రిటైర్డు కార్మికులు తీవ్ర విచారం వ్యక్తంచేశారు.

# ప్రారంభోత్సవ ఆఫర్!

## కూకట్‌పల్లి మరియు సోమాజిగూడ షోరూంలకు వర్తిస్తుంది.

**ఆఫర్ 4.7.19 నుంచి 7.7.19 వరకు.**

Lalithaa®

**బంగారు నగలపై తరుగులో 1% తగ్గింపు**

**వజ్రాభరణాలపై క్యారెట్‌కు రూ.2000 తగ్గింపు**

మా వద్ద ఉన్న విస్తృతశ్రేణి నగలకు ఇది వర్తిస్తుంది. త్వరపడండి! నాలుగు రోజులు మాత్రమే!

## నాణ్యమైన బంగారం, వజ్రాభరణాలు ఉత్తమ ధరకు కొనడం ఎలా?

దయచేసి దీన్ని పూర్తిగా చదవండి! మీకు అవసరమైనప్పుడు చూసుకునేందుకు ఈ పేపర్‌ని జాగ్రత్తగా దాచిపెట్టుకోండి.
సమయం వచ్చినప్పుడు మీకిది ఉపయోగవంతంగా ఉంటుంది.

### బంగారు నగలు కొనేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

**హాల్‌మార్క్ గురించి**

హాల్‌మార్క్ ముద్ర ఉన్న నగల్లోనే బంగారం నాణ్యత రుజువవుతుంది. అంటే మీరు కొనే నగ, 22 క్యారెటా లేదా 18 క్యారెటా అని హాల్‌మార్క్ నగల్లో వివరంగా ఉంటుంది. ఇది నగల దుకాణం ఇచ్చే గుర్తింపు కాదు. ప్రభుత్వం కింద వచ్చే BIS (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) గుర్తింపు పొందిన హాల్‌మార్క్ సంస్థ ఇచ్చే గుర్తింపు.

**మీకో చిన్న ఉదాహరణ**

నేటి బంగారం ధర గ్రాముకు రూ.3,200 అయితే,
22 క్యారెట్ BIS 916 హాల్‌మార్క్ బంగారానికే ఈ ధర చెల్లించాలి. (సూచన: 916 హాల్‌మార్క్ అంటేనే అది 22 క్యారెట్ బంగారాన్నే సూచిస్తుంది) అదే 18 క్యారెట్ బంగారం అయితే అందుకు చెల్లించాల్సిన ధర రూ.2,618 మాత్రమే.

$\frac{3200}{22} \times 18 = Rs.2618/-$

22 క్యారెట్ = 91.6% బంగారం, 18 క్యారెట్ = 75% బంగారం.

**V.A. గురించి తెలుసుకుందాం**

మార్కెట్‌లో ముడి బంగారం ధరను నిర్ణయించేది గోల్డ్ అసోసియేషన్లు. అందువల్లే మీ ప్రాంతంలోని అన్ని షోరూంలలోనూ బంగారం ధర ఒకే విధంగా ఉంటుంది. అయితే, బంగారాన్ని నగగా మార్చే ధరను ఆయా షోరూంలు నిర్ణయిస్తాయి. ఇందువల్ల తరుగు, వేస్టేజ్,V.A. వంటి పలు పేర్లతో పలు షోరూంలు వసూలు చేస్తాయి. తక్కువ V.A.తో నగను కొనేటప్పుడు మీకు డబ్బు ఎక్కువగా ఆదా అవుతుంది. ఇచ్చే డబ్బుకు అధిక గ్రాముల బంగారం లభిస్తుంది. అందుకు ఓ ఉదాహరణ ఇది...
బంగారం ధర గ్రాముకు రూ.3,200 (వివరణకు మాత్రమే)
నగ బరువు - 48 గ్రాములు
V.A. 8% అయితే బంగారం ధర - రూ.1,65,888
V.A. 16% అయితే బంగారం ధర - రూ.1,78,176
ఈ రెండింటి మధ్య వ్యత్యాసం తెలుస్తోందా?.. ఎక్కువ V.A.కు నగలు కొంటే ఎంత డబ్బు వృదా అవుతుంతో అని మీరే లెక్కగట్టుకోండి.

### వజ్రాభరణాలు కొనేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

**అథెంటిసిటి సర్టిఫికెట్**

వజ్రాభరణాలను ఎంచుకునేటప్పుడు దానికి అదే షోరూం ఇచ్చే 'ఇన్‌హౌస్ సర్టిఫికెట్' కాకుండా అంతర్జాతీయ స్థాయి సంస్థ ఇచ్చే అథెంటిసిటి సర్టిఫికెట్ ఉందా అని సరిచూసుకోండి.
వజ్రాభరణాన్ని వెలకట్టాలంటే దాన్ని ప్రిన్సిపల్‌ను ముందుగా అర్థం చేసుకోవాలి.
అందులో నాలుగు 'సి'లు ఉన్నాయి. అవే కలర్, కట్, క్యారెట్, క్లారిటి.

**క్లారిటి & కలర్‌గ్రేడ్**

వజ్రాభరణాలు కొనేటప్పుడు VVS క్లారిటి, E-F కలర్‌గ్రేడ్ ఉన్నాయా అని చూసుకోవాలి.
G-H కలర్‌గ్రేడ్ వంటి నాణ్యత తక్కువైన ఆభరణాలను కొనకూడదు.

**బైబ్యాక్ పాలసీ**

బైబ్యాక్ పాలసీ మీకు అనుకూలంగా ఉందా అని సరిచూసుకోవాలి.
మార్పిడికైతే 100% బైబ్యాక్, నగదుగా అయితే 85% బైబ్యాక్ ఉండాలి.

నగలు కొనేముందు ఈ పట్టికను ఓ సారి పరిశీలించండి.

| వజ్రపు వ్యాసం (సెంట్లలో) | ఉత్తమ వజ్రపు ధర క్యారెట్‌కి |
|---|---|
| 0 నుంచి 0.0749 | రూ.46000 |
| 0.0750 నుంచి 0.1349 | రూ.66500 |
| 0.1350 నుంచి 0.1749 | రూ.83000 |
| 0.1750 నుంచి 0.2249 | రూ.94000 |

ధరలు సర్వదేశ ఎగుమతి దిగుమతులకు తగినట్లు నిర్ణయించబడతాయి.

వజ్రాభరణాలు V.A. గ్రాముకు రూ.975 మాత్రమే చెల్లించాలి.

## లలితా జ్యూవెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

www.lalithaajewellery.com

నగలు కొనడం ఎలా?.. అన్న విషయంపై రూపొందించిన పుస్తకం మా షోరూంలో ఉచితంగా లభ్యమవుతుంది.

హైదరాబాద్ - కూకట్‌పల్లి : 2-22-298, PNR ఎంపైర్, కళామందిర్ పక్కన, KPHB మెట్రో స్టేషన్ సమీపం.
ఫోన్: 040 - 2384 2277 / 2384 2200 / 2384 2299.
సోమాజిగూడ: 6-3-883, SBR సౌక్, రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా. ఫోన్: 040 - 6748 6677.

వైజాగ్ : 29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్, ద్వారకా నగర్. ఫోన్: 0891-6600001. తిరుపతి : 481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, మాస్క్‌రోడ్, (v.v. మహల్‌రోడ్) ఫోన్: 0877-666 0505 / 0606 / 7888.
విజయవాడ : 60-9-10, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్, సిద్ధార్థ నగర్, సిద్ధార్థ క్యాటరింగ్ కాలేజ్ ఎదురుగా. ఫోన్: 0866-2481133.
రాజమహేంద్రవరం : 20-25-3, కోరుకొండ రోడ్, కంబాల చెరువు, మహాత్మాగాంధీ విగ్రహం దగ్గర, దేవిచౌక్ సమీపంలో. ఫోన్: 0883-2020300.
చెన్నై • తిరువళ్లూరు • గుడియాత్తం • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్

## వెండి వస్తువులు

కనువిందు చేసే సంప్రదాయ మరియు వినూత్నమైన వెండిసామగ్రి.
మార్కెట్‌లో కంటే అతి తక్కువ ధరకు అందిస్తున్నాం!



నమస్తే తెలంగాణ
జిందగీ
గురువారం 4 జూలై 2019
WWW.NTNEWS.COM
/nt.zindagi



## వైరల్ వధువు!

**జీవితంలో ప్రతి ఒక్కరికీ ముఖ్యమైన రోజు, గుర్తుండిపోయే రోజు పెండ్లి రోజు. పెండ్లి సందర్భంగా ఓ వధువు తన పెంపుడు కుక్కతో కలిసి నృత్యం చేసింది. ఆ మధుర సన్నివేశాల్ని ఆమె సోషల్ మీడియాలో పెట్టింది. ప్రస్తుతం ఆమె పోస్టును వేలమంది షేర్లు చేస్తున్నారు.**

అమెరికాకు చెందిన సారా కర్సన్ డివైన్ పెంపుడు జంతువుల ట్రైనర్. ఇటీవల ఆమె వివాహం చేసుకున్నది. ఆ సందర్భంగా తనకిష్టమైన పెంపుడు కుక్క (హీరో)తో కలిసి పదినిమిషాలు నృత్యం చేసింది. సాధారణంగా వివాహ వేడుకల్లో అనేక లాంఛనాలుంటాయి. ఈ కార్యక్రమాలన్నింటిలో వధువు చాలా బిజీగా ఉంటుంది. ఎంత బిజీగా ఉన్నప్పటికీ సారా కర్సన్ మాత్రం వివాహ వేడుకల సమయంలో స్టేజీపై తన పెంపుడు జంతువుతో కలిసి పది నిమిషాలు నృత్యం చేసింది. దీంతో పెండ్లికి వచ్చిన వారంతా ఆశ్చర్యంతో చూశారు. అయితే ఎంత బిజీగా ఉన్నప్పటికీ తనకు జీవితాంతం పెండ్లి రోజు తీపి గుర్తుగానే మిగిలిపోవాలని సారా కర్సన్ నిర్ణయించుకున్నది. ఇందుకు తనకు ఇష్టమైన పెంపుడు జంతువుతో నృత్యం చేసి.. ఆ మధురానుభూతిని ఆరోజు తన హృదయంలో పదిలం చేసుకున్నది. ఆకట్టుకునే తెల్ల గౌనులో వేదికపై సారా నృత్యం చేస్తుంటే అతిథులంతా కాళ్లు కదిపారు. అయితే సారాకు దీటుగా తన పెంపుడు శునకం హీరో కూడా నృత్యం చేయడం అక్కడున్నవారందరినీ ఆకట్టుకున్నది. ఈ వీడియోను ఎవరో సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది.

**చిరుజల్లులు పలుకరించాయి.. హృదయం కూడా పులకరిస్తుంది కదా!
చల్లని సాయంత్రాన.. గరం.. గరం చాయ్‌తో పాటు..
వేడి.. వేడి.. పకోడి ఉంటే ఆ టేస్టే వేరు! అందుకే కరకరలాడే వెరైటీ పకోడీలు..
వెజ్.. నాన్‌వెజ్ అనే భేదం లేకుండా..
ఈ వారం వంటకాల్లో మీకోసం సిద్ధం చేశాం..**

# వేడి.. వేడి.. పకోడి!





### పాలక్ పన్నీర్ పకోడి

**కావాల్సినవి :**

**పన్నీర్** : 200 గ్రా., **పాలకూర** : 1 కట్ట, **పచ్చిమిర్చి** : 5, **శనగపిండి** : ఒక కప్పు, **కారం** : ఒక టేబుల్ స్పూన్, **ధనియాలపొడి** : ఒక టేబుల్ స్పూన్, **పసుపు** : అర టేబుల్ స్పూన్, **ఓమా** : చిటికెడు, **కొత్తిమీర** : చిన్న కట్ట, **ఉప్పు, నూనె** : తగినంత

**తయారీ :**

ముందుగా పన్నీర్‌ని చిన్నగా కట్ చేసుకోవాలి. ఆ తర్వాత పచ్చిమిర్చి, పాలకూర, కొత్తిమీర కలిపి మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. దీన్ని ఒక గిన్నెలో వేయాలి. అందులో పన్నీర్, శనగపిండి, కారం, ధనియాల పొడి, పసుపు, ఉప్పు, ఓమా, కొన్ని నీళ్లు పోసి మరీ వదులుగా కాకుండా కలుపాలి. ఇప్పుడు కడాయి పెట్టి నూనె ఎక్కువ పోసి కాగనివ్వాలి. ఒక్కొక్క ముక్కను నూనెలో వేసి డీప్ ఫ్రై చేయాలి. అంతే.. రుచికరమైన పాలక్ పన్నీర్ పకోడి రెడీ!



### జీడిపప్పు చేప పకోడి

**కావాల్సినవి :**

**బోన్‌లెస్ చేప** : 250 గ్రా., **కారం పొడి** : 2 టేబుల్ స్పూన్, **పసుపు** : పావు టేబుల్ స్పూన్, **మెంతుల పొడి** : అర టేబుల్ స్పూన్, **జీడిపప్పు** : 100 గ్రా., **కరివేపాకు** : 2 రెమ్మలు, **జీలకర్ర పొడి** : అర టేబుల్ స్పూన్, **బియ్యంపిండి** : 50 గ్రా., **శనగపిండి** : 50 గ్రా., **ఉప్పు, నూనె** : తగినంత

**తయారీ :**

చేపను ఫింగర్ టిప్‌లా కట్ చేసుకోవాలి. తర్వాత కరివేపాకును ముక్కలుగా కట్ చేసుకోవాలి. స్టౌ వెలిగించి కడాయిలో కొద్దిగా నూనె పోసి కాగిన తర్వాత చేప వేసి అందులో ఉప్పు, కారం, జీలకర్ర పొడి, కరివేపాకు, పసుపు, మెంతుల పొడి వేసి బాగా కలుపాలి. ఇవి కాస్త వేగాక బయట గిన్నెలో వేయాలి. ఆ తర్వాత దీంట్లో జీడిపప్పు, బియ్యం పిండి, శనగపిండి వేసి కలుపుకోవాలి. ఆ తర్వాత మరుగుతున్న నూనెలో ఈ ముక్కలను వేసి దోరగా వేయిస్తే జీడిపప్పు చేప పకోడి మీ నోరూరిస్తుంది.



### నువ్వుల రొయ్యల పకోడి

**కావాల్సినవి :**

**రొయ్యలు** : 250 గ్రా.
**నువ్వులు** : 50 గ్రా.
**బియ్యం పిండి** : 50 గ్రా.
**శనగపిండి** : 50 గ్రా.
**ఉప్పు** : తగినంత
**అల్లం, వెల్లుల్లి పేస్ట్** : 20 గ్రా.
**జీలకర్ర** : 5 గ్రా., **పచ్చిమిర్చి** : 5
**చాట్‌మసాలా** : 10 గ్రా., **నూనె, ఉప్పు** : తగినంత

**తయారీ :**

ఒక గిన్నెలో రొయ్యలు వేసి కొద్దిగా ఉప్పు కలుపుకోవాలి. కాసేపటి తర్వాత రొయ్యలలో నువ్వులు, బియ్యం పిండి, శనగపిండి, అల్లం, వెల్లుల్లి పేస్ట్, జీలకర్ర, పచ్చిమిర్చి ముక్కలు, కొద్దిగా నీళ్లు పోసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు నూనె పోసి ఒక్కొక్క ముక్కను నూనెలో బాగా వేయించుకోవాలి. బాగా డీప్ ఫ్రై అయిన ఈ ముక్కలను ప్లేట్‌లోకి తీసుకోవాలి. పై నుంచి చాట్‌మసాలా చల్లి వేడి వేడిగా ఆరగిస్తే ఆ టేస్టే వేరు.



### క్రిస్పీ చికెన్ పకోడి

**కావాల్సినవి :**

**చికెన్ బోన్‌లెస్** : 250 గ్రా., **అల్లం, వెల్లుల్లి పేస్ట్** : 50 గ్రా., **గ్రీన్ చిల్లీసాస్** : 10 గ్రా., **శనగపిండి** : 150 గ్రా., **బియ్యంపిండి** : 150 గ్రా., **ఓమా** : 5 గ్రా., **నిమ్మరసం** : అర టేబుల్‌స్పూన్, **కార్న్‌ఫ్లేక్స్** : 200 గ్రా., **టమాటా సాస్** : 100 గ్రా., **నూనె, ఉప్పు** : తగినంత

**తయారీ :**

గిన్నె తీసుకొని దానిలో చికెన్, అల్లంవెల్లుల్లి పేస్ట్, గ్రీన్‌చిల్లి పేస్ట్, ఉప్పు, శనగపిండి, బియ్యంపిండి, ఓమా, నిమ్మరసం వేసి బాగా కలుపాలి. తర్వాత కార్న్‌ఫ్లేక్స్ తీసుకొని ముందుగా కలుపుకున్న చికెన్ ముక్కలను ఇందులో వేసి కలుపాలి. ఈ ముక్కలను మరుగుతున్న నూనెలో వేసి దోరగా వేయించాలి. వేగిన తర్వాత ప్లేట్‌లోకి తీసుకొని గార్నిష్ చేసుకోవాలి. క్రిస్పీ చికెన్ పకోడకి టమాటా సాస్ జోడిస్తే టేస్టీగా ఉంటుంది.



### పొనగంటి చికెన్ పకోడి

**కావాల్సినవి :**

**పొనగంటి ఆకు** : ఒక కట్ట
**చికెన్ బోన్‌లెస్** : 250 గ్రా.
**పచ్చిమిర్చి** : 5
**ఉప్పు** : తగినంత
**పసుపు** : పావు టేబుల్‌స్పూన్
**జీలకర్ర పొడి** : ఒక టేబుల్ స్పూన్
**నిమ్మరసం** : ఒక టేబుల్‌స్పూన్
**బియ్యంపిండి** : 50 గ్రా.
**మైదా** : 50 గ్రా.
**శనగపిండి** : 25 గ్రా.
**నూనె, ఉప్పు** : తగినంత

**తయారీ :**

పొనగంటి ఆకు, పచ్చిమిర్చి కలిపి పేస్ట్ చేయాలి. ఇందులో కొద్దిగా ఉప్పు వేసి కలుపాలి. తర్వాత చికెన్‌ని కడిగి ఒక గిన్నెలో వేయాలి. అందులో పొనగంటి ఆకు పేస్ట్, పసుపు, జీలకర్రపొడి, నిమ్మరసం, బియ్యంపిండి, శనగపిండి, మైదాపిండి వేసి బాగా కలుపాలి. ఆ తర్వాత కడాయిలో నూనె పోసి స్టవ్ వెలిగించాలి. నూనె మరిగిన తర్వాత కలిపి పెట్టిన చికెన్ ముక్కలను నూనెలో వేయించాలి. దోరగా వేగిన తర్వాత చికెన్‌ను ఒక ప్లేట్‌లోకి తీసుకుంటే పొనగంటి చికెన్ పకోడి తయారయినట్లే!



**జి.యాదగిరి**
కార్పొరేట్ చెఫ్
వివాహభోజనంబు రెస్టారెంట్
జూబ్లీహిల్స్, హైదరాబాద్
పార్క్‌లైన్, సికింద్రాబాద్

## అన్నింటికీ ఒకే షూ వాడుతున్నారా?



**చాలామంది ఆటలు ఆడేటప్పుడు, వ్యాయామ సమయంలో ఒకే షూ వాడుతుంటారు. కానీ, చేసే వ్యాయామాన్ని బట్టి కూడా షూ ఎంపిక మారుతుందనే విషయాన్ని గ్రహించరు. ఏ వ్యాయామానికి ఏ షూ ఎంపిక చేయాలంటే..**

- టెన్నిస్ ఆడేవారు పాదాల్ని తరచూ వంచాల్సి ఉంటుంది. కోరిన రీతిగా పాదాల్ని వంచేందుకు వీలుగా ఉండే షూ ఎంపిక చేసుకోవాలి. రన్నింగ్ షూ కుషన్, బౌన్స్ ఎక్కువగా అందేవిగా ఉండేలా ఎంపిక చేసుకోవాలి.
- వాకింగ్, జాగింగ్ చేసేవారు గట్టి బేస్ ఉన్న షూ వాడితే మంచిది. వారానికి కనీసం 5 రోజులు రన్నింగ్ చేసేవారు 9 నెలలకు ఒకసారి షూ మార్చాలి. రోజూ వాకింగ్ చేసేవారు ఏడాదికోసారి షూ మార్చితే మంచిది.
- రోజూవారీ విధులకు ఉపయోగించే వాటిలో నాసిరకం షూ కంటే కాస్త ధర ఎక్కువైనా మంచివి తీసుకుంటేనే ఎక్కువ కాలం మన్నుతాయి. కొన్నాళ్లు వాడిన తర్వాత కూడా చూడడానికి హుందాగానే కనిపిస్తాయి.
- కొత్త షూ కొనేటప్పుడు పాదం సైజులో వచ్చిన మార్పులను పరిగణనలోకి తీసుకోవాలి. ఎంపిక చేసిన షూ వ్యాయామ సమయంలో పాదానికి పట్టే చెమటను ఎప్పటికప్పుడు పీల్చుకునేలా ఉంటే మంచిది.
- షూ లేస్ విప్పగానే పాదాన్ని సులభంగా బయటికి తీసేంత వెసులుబాటు ఉన్న షూ సరైనవిగా భావించాలి. అలాగని వేళ్ల భాగంలో ఇరుకుగా ఉండే షూ తీసుకోవద్దు. సాక్సులు లేకుండా షూ వాడితే త్వరగా పాడైపోయే అవకాశం ఉన్నది.

## ఐపీఎస్ అపర్ణ మరో ఘనత!



**ఇటీవలే ధ్రువాల వైపు ప్రయాణించి అరుదైన ఘనత సాధించిన ఐపీఎస్ అపర్ణ తాజాగా మరో ఘనత సాధించారు. ఉత్తర అమెరికాలోని అత్యంత ఎత్తయిన పర్వతం 'దేనాలి'ని అధిరోహించారు.**

2016లో ఎవరెస్ట్ పర్వతం మీద భారత జాతీయ జెండాను ఎగురవేసిన తొలి సివిల్ సర్వెంట్‌గా అపర్ణ రికార్డు సృష్టించారు. 2017లో నేపాల్‌లోని 'మాసూలా' పర్వతాన్ని అధిరోహించారు. అక్కడి నుంచి ప్రారంభమైన ఆమె రికార్డుల పరంపర ఇంకా కొనసాగుతున్నది. ఏడు దేశాల్లో ఏడు ఎత్తయిన పర్వతాలను చేరుకోవడమే ఆమె లక్ష్యంగా సాగుతున్నది. దేనాలి పర్వతాన్ని అధిరోహించడంతో ఆమె లక్ష్యం పూర్తయింది. 20,310 అడుగుల ఎత్తున్న ఈ పర్వతాన్ని ఆమె అధిరోహించి రికార్డు సృష్టించారు. అపర్ణకుమార్ ఇండియా-టిబెట్ బార్డర్లో డీఐజీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆమె దక్షిణ ధ్రువం వరకూ వెళ్లారు. తాజాగా ఈ రికార్డు పూర్తి చేసి మళ్లీ ఇప్పుడు ఉత్తర ధ్రువాన్ని చేరుకోవాలనుకుంటున్నారు. 2020 వరకు ఉత్తర ధ్రువాన్ని చేరుకుంటానని చెప్తున్నారు. సుమారు 111 మైళ్లు పూర్తి మంచు ప్రాంతంలో నడుస్తూ ఆమె దక్షిణ ధ్రువాన్ని చేరుకున్నారు. ఇలా ధ్రువాన్ని చేరిన మొదటి ఐపీఎస్ ఘనత కూడా అపర్ణదే!. మైనస్ 40 డిగ్రీల ఉష్ణోగ్రతలో రోజుకు ఎనిమిది గంటలు ప్రయాణించి అక్కడికి చేరుకున్నారు. 34 కిలోల బరువున్న బ్యాగ్‌ను తగిలించుకొని మంచులో నడిచారు. ఈ అనుభూతి మరిచిపోలేనిది అని అపర్ణ అంటున్నారు. పర్వత ప్రాంతాల్లో రోజు రోజుకూ వాతావరణంలో మార్పులు ఉంటాయనీ, విపత్కర పరిస్థితులను ఎదుర్కొని ముందుకు సాగినట్టు ఆమె తెలిపారు. మేఘాలు కమ్మేసి, చలిగాలులతో నిత్యం అడ్డంకులు ఎదురవుతాయని అంటున్నారు. 'ఈ పరిస్థితుల పట్ల జాగ్రత్తగా ఉండేదాన్ని, మంచు తిమ్మిర్లు వచ్చేవి. చేతులు బిగుసుకొని పోయేవి. ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్తగా ఉండేదాన్ని. ఈ ప్రయాణం నాకు మరిచిపోలేనిది' అంటున్నారు అపర్ణ.

## సంపూర్ణ శరీర సౌందర్యానికి..



**శరీర శుభ్రత కోసం రకరకాల సబ్బులు వాడుతుంటాం. అవసరానికి మించి మార్కెట్‌లో ఎన్నో కంపెనీలు తమ సబ్బుల బ్రాండింగ్‌ను పెంచుకుంటున్నాయి. మరి అలాంటి సబ్బుల్లో మన శరీరానికి కావాల్సినవి ఉన్నాయా? అసలు సబ్బులో ఎలాంటి పదార్థాలుండాలి?**

మనం రోజూ వాడే వివిధ కంపెనీల సబ్బులతో ఎన్నో చర్మ పోషకాలు శరీరంలోకి వస్తాయి. అయితే మంచి పోషకాలతో పాటు, హానికర పదార్థాలు కూడా ప్రవేశిస్తాయి. రసాయనాలు కలిగిన సబ్బులు వాడడం ద్వారా అనూహ్య పరిస్థితులు ఎదురవుతాయి. ప్రస్తుతం ఈ రసాయనాలు సబ్బుల ద్వానే శరీరంలోకి వస్తున్నాయి. పామాయిల్, పరాబెస్, సల్ఫేట్, ట్రిక్లోజన్ లాంటి రసాయనాలు సబ్బుల్లో ఉంటాయి. ఇవి చాలా ప్రమాదకరం. అందుకే మనం వాడే సబ్బుల్లో సహజ సిద్ధమైన మూలికలు ఉన్నాయో లేదో చూసుకోవాలి. ఇప్పుడు చాలా కంపెనీలు సబ్బులను ఉత్పత్తి చేస్తున్నాయి. ఆ సబ్బుల్లో ఎలాంటి పదార్థాలు ఉన్నాయో మనం గమనించాలి. రసాయనాలు కలిసిన సబ్బులు వాడడం అనారోగ్యకరం. సబ్బులు సహజమైన వనమూలికలు, ప్రకృతి సిద్ధమైన పదార్థాలు ఉంటేనే వాడాలి. సంపూర్ణ చర్మ సంరక్షణకు మనం ఉపయోగించే సబ్బుల్లో చందనం, పసుపు, కుంకుమ పువ్వు, కలబంద, బాదంపాలు వంటి సహజ సిద్ధమైన పదార్థాలు ఉంటే చర్మ సౌందర్యం మెరుగవడంతో పాటు ఆరోగ్యం కూడా పెరుగుతుంది.

**చందనం** : చందనం క్రమం తప్పకుండా శరీరానికి అందితే హానికర బ్యాక్టీరియా రాకుండా, చర్మం పొడిబారకుండా ఉంటుంది.

**పసుపు :** ఇది చర్మంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ముఖ్యంగా మొటిమల నివారణకు పసుపు మంచి ఔషధం.

**కుంకుమ పువ్వు:** ఇందులో అద్వితీయమైన విటమిన్లు, యాంటి యాక్సిడెంట్లు ఉంటాయి. శరీరం పొడిబారకుండా ఉండడంతోపాటు స్వచ్ఛంగా, మృధువుగా తయారవుతుంది.

**కలబంద:** శరీరంపై ఒక లేయర్‌లా ఉపయోగపడుతుంది. దీనివల్ల చర్మంపై ఎప్పుడూ తేమ ఉంటుంది. ఇందులో ఉండే విటమిన్లు, ఖనిజాలు చర్మాన్ని కాంతివంతంగా మారుస్తాయి.

**బాదం పాలు :** ఎండ నుంచి చర్మాన్ని రక్షించడంలో కీలకంగా పని చేస్తాయి. చర్మం పొడిబారకుండా ఉండడానికి బాదం పాలు ఎంతో ఉపయోగపడతాయి.

ఈ పదర్థాలు కలిసిన సబ్బును వాడడం వల్ల శరీరం యవ్వనంగా, ప్రకాశవంతంగా, ఆరోగ్యంగా తయారవుతుంది.

# ఈ కారు ధర రూ. 132 కోట్లు!



ప్రపంచంలో ఇప్పటి దాకా ఇంత ఖరీదయిన కారు రాలేదు. లగ్జరీ స్పోర్ట్స్ కార్ల దిగ్గజం బుగాటీ లా వోటుర్ నోయిర్ అనే సంస్థ ఈ కాస్ట్లీ కారును తయారుచేసింది. బుగాటీ లా వోటుర్ నోయిర్ అంటే ఫ్రెంచ్ భాషలో నల్లకారు అని అర్థం. గ్రాండ్‌టూరింగ్‌ను దృష్టిలో పెట్టుకుని విలాసవంతమైన కార్ల విభాగంలో ఈ కారును ప్రత్యేకంగా రూపొందించింది ఆ సంస్థ. ఖరీదుకు తగినట్లే ఇందులో ప్రత్యేకమైన సౌకర్యాలనూ ఏర్పాటు చేశారు. విశేషమేమిటంటే ఈ కారును తయారు చేయడానికి ఎటువంటి మిషన్‌ను ఉపయోగించలేదు. ఇంజిన్ నుంచి పై టాప్ వరకూ అన్నీ చేతులతోనే మలిచారట. ఇటీవల స్విట్జర్లాండ్‌లో 89వ జెనీవా ఇంటర్నేషనల్ ఆటో షో అట్టహాసంగా ప్రారంభమయింది. ఈ ప్రదర్శనలో ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజాలయిన టెస్లా, వోల్వో, ఆడి వంటి కంపెనీలు ఎలక్ట్రిక్ వాహనాలను ఆవిష్కరించాయి. లంబోర్ఘినీ, స్కోడా, బీఎండబ్ల్యూ, రెనో, హోండా, బుగాటీ వంటి సంస్థలు రూపొందించిన సరికొత్త మోడల్ వాహనాలను ప్రదర్శించి తమ ప్రత్యేకతను చాటుకున్నాయి.

## సైకిల్ తొక్కితే పైసలు!



**సైకిల్ తొక్కితే పైసలివ్వడమంటే వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది మాత్రం నిజం. అక్కడ అందరూ ఎక్కువగా సైకిళ్లనే వాడుతుంటారు. సైకిల్ వినియోగాన్ని మరింతగా పెంచేందుకు ఓ దేశంలో వినూత్న విధానాన్ని ప్రవేశపెడుతున్నారు.**

పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రపంచదేశాలు కంకణం కట్టుకున్నాయి. అందుకోసం పలురకాల విధానాలను అనుసరిస్తున్నాయి. నెదర్లాండ్‌లో సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు సరికొత్త పద్ధతిని అమలుచేస్తున్నారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఆ దేశంలో పెట్రల్, డీజిల్‌తో నడిచే వాహనాల వాడకాన్ని తగ్గించి సైకిళ్లను పెంచే పనిలోపడ్డారు. సైకిల్ తొక్కేవారికి కిలోమీటరుకు రూ.16 అందించనున్నారు. ఈ మొత్తాన్ని ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు రూపంలో అందుతుంది. ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు ఏడాది మొత్తంలో వంద కిలోమీటర్లు సైకిల్ తొక్కితే రూ.1600 వరకు మినహాయింపు కల్పిస్తారు. సైకిల్ పై ఆఫీస్‌కు వెళ్లి వచ్చే ఉద్యోగులకు మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుంది. వ్యక్తిగత అవసరాలకు సైకిల్‌పై వెళితే ఇది వర్తించదు. నెదర్లాండ్ ప్రభుత్వం అక్కడ ఉన్న వివిధ కంపెనీలకు సైకిల్ వినియోగాన్ని పెంచేందుకు ప్రత్యేక ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఏయే ఉద్యోగి ఎన్ని కిలోమీటర్లు సైకిల్ తొక్కారో ఆయా లెక్కలన్నీ కంపెనీలే చూసుకోవడమేకాకుండా వారికి ఎంత మొత్తం వెళుతుందో అంత చెల్లిస్తుంది. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి క్లయిమ్ చేసుకుంటుంది. ఇలా ఒక్క నెదర్లాండ్ దేశంలోనే కాకుండా యూరప్‌లోని పలు దేశాలు కూడా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి.

## విదేశాల్లో స్వదేశీ ఘుమఘుమలు!

**రుచికరంగా ఉండాలే గానీ దేశ, విదేశాలయినా దాటుకుంటూ వెళ్లి మరీ ఆరగిస్తుంటారు కొందరు. లేదంటే ఆ పదార్థాన్నే ఆయా దేశాలకు తరలించుకు వెళతారు. భారతదేశానికి చెందిన ఓ వంటకానికి లండన్‌లో రోజు రోజుకీ గిరాకీ పెరుగుతున్నది.**




హైదరాబాద్ బిర్యానీకి, బందరు లడ్డూలకు ఫేమస్. ఒక్కో ప్రాంతానికి ఒక్కో వంటకం ప్రసిద్ధి. ఆయా వంటకాలే ఆ ఊళ్ల బ్రాండ్‌ను మరింతగా పెంచుతుంటాయి. అటువంటి ప్రసిద్ధిగాంచిన వంటకాన్ని ఒక్కసారి తింటే చాలు మరోసారి తినాలనిపిస్తుంది. రుచికరమైన పదార్థానికి ప్రదేశం, ప్రాంతం అనే భేదాలుండవు. టేస్టీగా ఉంటే చాలు. ఎక్కడైనా లొట్టలేసుకుని ఆరగిస్తుంటారు. ఇప్పుడు భారతదేశానికి చెందిన మరమరాల మసాలా విదేశీ వీధుల్లో ఘుమఘుమలాడుతున్నది. బ్రిటన్‌కు చెందిన యాంగస్ దీనోన్ వృత్తిరీత్యా చెఫ్. భారతదేశానికి ఓసారి పర్యటనకు వచ్చిన సందర్భంలో ప్రధాన నగరాల్లో లభించే స్ట్రీట్ ఫుడ్ మెనూ చూశాడు. ఆయన రుచి చూసిన వాటిల్లో కోల్‌కతా వీధుల్లో ఝూల్మూరీకి ఫిదా అయ్యాడు. మరమరాలతో చేసే ఈ రుచికరమైన వంటకాన్ని ఎలా తయారుచేయాలో తెలుసుకున్నాడు. అనంతరం లండన్ వీధుల్లో మరమరాల మసాలాను తయారు చేసి అమ్మడం ప్రారంభించాడు. తన షాప్‌కు ఝూల్మూరీ ఎక్స్‌ప్రెస్ అని పేరు పెట్టాడు. దానికి ఎవ్రీబడి లవ్, లవ్ ఝూల్మూరీ అని ట్యాగ్‌లైన్ పెట్టాడు. లండన్ వాసులంతా మరమరాల మసాలాను ఆరగించేందుకు క్యూ కడుతున్నారట.

# వింత వంతెన!



**వంతెన నిర్మాణానికి సాధారణంగా ఇనుప చువ్వలనో, కట్టెలనో ఉపయోగిస్తారు. కానీ ఈ వంతెనను వింతగా గడ్డితో నిర్మిస్తున్నారు. విశేషమేమిటంటే దీని నిర్మాణాన్ని 600 ఏండ్లుగా అక్కడి ప్రజలు వారసత్వ సంప్రదాయంగా భావిస్తున్నారు.**

దక్షిణ అమెరికాలోని వాయవ్యభాగంలో ఉన్న పెరూ దేశంలో ఓ వింత సంప్రదాయం ఉన్నది. అక్కడి ప్రజలు గడ్డితో వంతెనను నిర్మిస్తారు. ప్రతి ఏటా గడ్డితో తయారుచేసిన తాళ్లను ఉపయోగించి కొత్తగా బ్రిడ్జిని కడతారు. దీనిని వారంతా వారసత్వ సంప్రదాయంగా భావిస్తారు. పెరూలోని కుస్కో ప్రాంతంలో అపురిమక్ నది ఒడ్డున గడ్డి తాళ్లతో అల్లిన వారధి ఒకటుంది. అంతేకాదు ఇటువంటి గడ్డి వంతెనలు ఈ దేశంలోని పలు చోట్ల ఉన్న అపురిమక్ నది ఒడ్డున ఉన్న వంతెన అన్నింటి కంటే చాలా పెద్దది. ప్రతి ఏటా ఆ వంతెనను తొలగించి దాని స్థానంలో కొత్త వంతెనను నిర్మిస్తారు. ఈ సంప్రదాయం 600ఏండ్లుగా కొనసాగుతున్నది. గడ్డితో నిర్మించే ఈ వారధి పెరూలోని పలు నగరాలు, పల్లెటూళ్లను అనుసంధానించడంలో కీలక పాత్ర పోషిస్తున్నది. 2013లో ద యునైటెడ్ నేషనల్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్(యునెస్కో) ఇటువంటి వంతెనల విశిష్టతను గుర్తించి వారసత్వ సంపదగా ప్రకటించింది. తరతరాలుగా ఈ నైపుణ్యాన్ని పెరూ ప్రజలు తమ వారసుల నుంచి వచ్చిన హక్కుగా భావిస్తుంటారు. విశేషమేమిటంటే వంతెన నిర్మాణంలో పురుషులే కీలక పాత్ర పోషించాలి. మహిళలు ఆ వంతెన నిర్మాణ సమయంలో దగ్గరగా కూడా ఉండకూడదట. దూరంగా ఉండి బ్రిడ్జి నిర్మాణానికి కావాల్సిన గడ్డితో తాళ్లను అల్లుతుంటారు. ఆ తాళ్లను తీసుకువచ్చి వారధి నిర్మించే మొదటి రోజున పురుషులంతా కలిసి 120 చిన్న చిన్న తాళ్లను కలిపి పెద్ద పెద్ద తాళ్లను తయారు చేసి వంతెన నిర్మాణానికి ఉపయోగిస్తారు. 'కోయా ఇచు' అనే దృఢమైన గడ్డిని తాళ్ల తయారీకి వినియోగిస్తుంటారు. ఈ గడ్డిని కోసిన తర్వాత నీళ్లలో కొద్ది రోజులు నానబెడతారు. అలా నానబెట్టడం వల్ల తాళ్లు మరింత దృఢంగా తయారవుతాయి. బ్రిడ్జి కూడా పటిష్ఠంగా ఉంటుంది. గడ్డి వంతెనల నిర్మాణ సమయంలో పనిలో నిమగ్నమయ్యేవారందరి కోసం చుట్టు పక్కల ఉన్న ఊళ్ల జనాలు ప్రత్యేక వంటకాలు చేసి తీసుకువస్తారు. ఆయా వంటకాల్లో మాంసాహారం తప్పనిసరిగా ఉండాలి. ఈ పనిలో శ్రమించేవారు అక్కడి ప్రాంతాల్లో లభించే దుంపలతో వండిన కూర



ఖచ్చితంగా ఆరగించాలనే నియమం ఉన్నది. వారు మరింత ఉత్సాహంగా పనిచేయడానికి పంది, కోడి, చేపల మాంసం కూడా వడ్డిస్తారు. బ్రిడ్జి నిర్మాణంలో పనిచేసే వారికి బంధువులున్నా లేకపోయినా కుల, మతాలు, బంధుత్వాలకు అతీతంగా ఆప్యాయంగా వడ్డిస్తారు. వారు చేసేది ప్రజల బాగు కోసం కాబట్టి ఆ పనిలో భాగస్వాములైన వారందిరినీ ఎంతో గౌరవంగా చూస్తారు. వారధి నిర్మాణంలో భాగస్వాములైన వారందరూ కౌబాయ్ దుస్తులనే ధరిస్తారు. తలకు హ్యాట్, కాళ్లకు షూ, శరీరానికి కోటు ధరిస్తారు. ప్రతి ఏటా పాత వంతెనకు సంబంధించిన గడ్డి తాళ్లను అక్కడి నదుల్లో వదిలేయడం ఆనవాయితీగా వస్తున్నది. అందుకే గతేడాది వాడిన వంతెన తాలూకు సామగ్రినంతా నదుల్లో వదిలేస్తారు. కొత్తగా నిర్మించే వారధి కోసం నూతన సామగ్రినే వాడుతారు. వంతెన నిర్మాణంలో ఏమైనా లోపం జరిగినా ఎటువంటి ప్రమాదం జరుగకూడదనే ఉద్దేశంతో పాత సామాగ్రిని అస్సలు ఉపయోగించరు. నదికి ఇరువైపులా ఆరు తాళ్లను ముందే చెక్కిన రాళ్లకు గట్టిగా కడతారు. అలా వంతెన బిగిసేవరకూ ఇరువైపుల నుంచి తాళ్లను లాగుతారు. మరో విశేషమేమిటంటే ఈ వారధి నిర్మాణంలో ఎటువంటి అధునాతన సాధనాలు, ఇనుప చువ్వలు,రేకులు వినియోగించరు. కేవలం మానవ శక్తితోనే గడ్డి తాళ్లను మాత్రమే ఉపయోగిస్తారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లే ఏ వస్తువును గానీ, పదార్థాన్ని గానీ వాడకుండానే వంతెనను నిర్మించాలనే నియమం ఉన్నది. ఇదే విషయం వారి పూర్వీకులు తమ వారసులకు చెప్పడం వల్ల అదే ఆనవాయితీని నేటితరం కూడా కొనసాగిస్తున్నది. ఇక వారధి పూర్తయిన తరువాత వరుసగా నాలుగు రోజుల పాటు బ్రిడ్జి దగ్గర ఘనంగా ఉత్సవాలు జరుపుకుంటారు.

## మూడు కండ్ల పాము

**పాముకు ఎన్ని కండ్లుంటాయి? అన్ని పాములకు ఉన్నట్లుగానే రెండే ఉంటాయి. ఈ సర్పానికి మాత్రం మూడు కండ్లున్నాయి. ఈ అరుదైన సర్పం ఇటీవల ఆస్ట్రేలియాలో దర్శనమిచ్చింది.**



ఇప్పటి దాకా రెండు తలల పామును గురించి విని ఉన్నా. కానీ వింతగా ఓ పాముకు మూడు కండ్లున్నాయి.త్రినేత్రుడి మెడలో ఉండే సర్పానికి కూడా రెండే కండ్లుంటాయేమో. కానీ దీనికి మాత్రం మూడు కండ్లున్నాయి. ఈ అరుదైన త్రినేత్ర సర్పం ఆస్ట్రేలియాలో కనిపించింది. నార్తర్న్ టెరిటరీ పార్క్స్ అండ్ వైల్డ్ లైఫ్ ఈ మూడు కండ్ల పాము ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్ అయింది. పరిశోధకులకు ఈ విషయం చేరడంతో అది చివరకు ఆస్ట్రేలియాలోని అర్న్‌హెమ్ రహదారి దగ్గర ఉన్నట్లు గుర్తించారు. దీనిపై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు ఈ పాముకు 'కార్పెట్ పైథాన్' అని పేరు పెట్టారు. పిండం అభివృద్ధి చెందుతున్న తొలినాళ్లలోనే పాముకు మూడో కన్ను ఏర్పడిందని వారు పేర్కొన్నారు. జన్యు పరివర్తనతోనే ఇలా జన్మించిందని భావిస్తున్నారు. ఆ మూడో కన్ను కూడా రెండు కండ్లలాగే పని చేస్తున్నదని సైంటిస్టులు గుర్తించారు. తల భాగాన్ని ఎక్స్‌రే తీయగా ఒకే పుర్రె ఉన్నట్లు తేలింది.

## ట్వీట్



ప్రొ౹౹ ఘంటా చక్రపాణి
@GhantaC

**న్యాయం జరగడం ఒక్కోసారి ఆలస్యం కావచ్చు. కానీ పక్కాగా జరుగుతుంది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులు సిద్ధంగా ఉండండి.**

చక్రపాణిని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నవారి సంఖ్య
4213

## కామన్‌మ్యాన్ వాయిస్

ఒడిబియ్యం తెలంగాణ సంప్రదాయంలో ఒక భాగం. అలాంటి మా సంస్కృతిని, సంప్రదాయాన్ని అవమానిస్తూ 'ఎన్నడూ తినని కుటుంబాలు కాబట్టి ఒడిబియ్యంతో పండగ చేసుకుంటారు' అంటావా వెంకట క్రిష్ణా?
– Ram Je

దేవుడిని నమ్మాలంటే భక్తి ఉంటే సరిపోతుంది. కానీ మనుషుల్ని నమ్మాలంటే ధైర్యం కావాలి.
– Ramesh Kick

ఆడిపించుకోండయ్యా.. అందర్నీ ఆడిపించుకోండి. ఒక్క అంబటి రాయుడిని తప్ప. మయాంక్ అగర్వాల్.. అదితి అగర్వాల్ అందర్నీ ఆడిపించుకోండి. బీసీసీఐ చీప్ పాలిటిక్స్ చేస్తున్నది!
– పాళీ

## వైరల్ వీడియో




**'ఓ బేబీ' బ్యాక్ టు బ్యాక్ ట్రైలర్స్ యూట్యూబ్‌లో సందడి చేస్తూ ట్రెండింగ్ లిస్ట్‌లో నంబర్ వన్‌గా నిలిచింది.**

Oh Baby Back To Back Trailers | Samantha Akkineni, Mickey J Meyer, Nandini Reddy
Total views : 1,065,418+
Published on Jul 2, 2019

## సుడోకు

**డైలీ సుడోకు 80 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | 5 | 2 | 9 | 3 | 8 | 6 | 1 | 7 |
| 3 | 8 | 1 | 4 | 7 | 6 | 5 | 2 | 9 |
| 7 | 9 | 6 | 1 | 5 | 2 | 3 | 4 | 8 |
| 9 | 2 | 7 | 8 | 1 | 5 | 4 | 3 | 6 |
| 8 | 6 | 4 | 2 | 9 | 3 | 1 | 7 | 5 |
| 5 | 1 | 3 | 6 | 4 | 7 | 8 | 9 | 2 |
| 6 | 4 | 5 | 7 | 2 | 1 | 9 | 8 | 3 |
| 2 | 3 | 9 | 5 | 8 | 4 | 7 | 6 | 1 |
| 1 | 7 | 8 | 3 | 6 | 9 | 2 | 5 | 4 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

**డైలీ సుడోకు -81**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | 6 | | | 4 | | | 8 | |
| | 3 | 2 | 8 | 7 | 5 | | | 6 |
| | | | 1 | 6 | | 2 | | 7 |
| 5 | 1 | | | | | 6 | 7 | 8 |
| | | | | | | | | |
| 2 | 8 | 6 | | | | | 5 | 4 |
| 4 | | 3 | | 5 | 1 | | | |
| 6 | | | 4 | 3 | 2 | 7 | 1 | |
| | 7 | | | 9 | | | 3 | 2 |

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం

## డీటీయూలో 167 ఖాళీలు

**ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ (డీటీయూ)లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**




- **పోస్టు:** అసిస్టెంట్ ప్రొఫెసర్
- **మొత్తం ఖాళీలు:** 167
- **విభాగాల వారీగా ఖాళీలు:** సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్-7, కంప్యూటర్ ఇంజినీరింగ్-32, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-15, మేనేజ్‌మెంట్ (డీఎస్‌ఎం)-15, మేనేజ్‌మెంట్ (యూఎస్ఎంఈ)-19, ఎకనామిక్స్ (యూఎస్ఎంఈ)-3, మ్యాథమెటిక్స్&కంప్యూటింగ్-5, అప్లయిడ్ ఫిజిక్స్-8, ఇంజినీరింగ్ ఫిజిక్స్-11, బయోటెక్నాలజీ-8, ఈసీఈ-26, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్-29 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హతలు:** సంబంధిత బ్రాంచీలో బీఈ/బీటెక్‌తోపాటు ఎంఈ/ఎంటెక్ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత. ఏజీపీ స్కేల్‌ను బట్టి ఆయా పోస్టులకు నెట్/సెట్ లేదా తత్సమాన పరీక్షల్లో వ్యాలిడ్‌స్కోర్ లేదా పీహెచ్‌డీ ఉండాలి. మరికొన్ని పోస్టులకు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత ఉండాలి. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **వయస్సు:** 2019, ఆగస్టు 1 నాటికి 35 ఏండ్లు మించరాదు.
- **పేస్కేల్:** ఏజీపీ రూ.6,000+ పేబ్యాండ్ 3 (15,600-39,100)
- **ఎంపిక:** దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను అర్హత ప్రకారం షార్ట్‌లిస్ట్ చేస్తారు. అనంతరం స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. పీహెచ్‌డీ ఉన్నవారికి నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఫీజు:** జనరల్/ఓబీసీలకు రూ.1,000/- ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు రూ.500/-
- **చివరితేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** http://www.dtu.ac.in

## టీఎఫ్ఆర్ఐలో

**ట్రాపికల్ ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (టీఎఫ్ఆర్ఐ)లో కింది ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

- టెక్నికల్ అసిస్టెంట్ (కేటగిరీ-II)- 4
- **అర్హతలు:** బీఎస్సీ (బాటనీ/బయాలజీ లేదా ఫారెస్ట్రీ) సబ్జెక్టులుగా ఉత్తీర్ణత.
- స్టెనోగ్రాఫర్ (గ్రేడ్-II)-2 పోస్టులు
- **అర్హతలు:** ఇంటర్‌తోపాటు స్టెనోగ్రఫీ ఇంగ్లిష్/హిందీలో నిమిషానికి 80 పదాల వేగం కలిగి ఉండాలి. కంప్యూటర్ అప్లికేషన్స్‌లో సర్టిఫికెట్ కలిగి ఉండాలి. ప్రతి పదానికి 5 కీ డిప్రెషన్ టైపింగ్ స్పీడ్ కలిగి ఉండాలి.
- లోయర్ డివిజన్ క్లర్క్ - 10 పోస్టులు
- **అర్హతలు:** ఇంటర్, టైపింగ్ ఉండాలి.
- టెక్నీషియన్ (పే లెవల్-2)- 3 (ఎలక్ట్రికల్, ప్లంబర్, కార్పెంటర్)
- **అర్హతలు:** పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత.
- డ్రైవర్- 2
- **అర్హతలు:** పదోతరగతితోపాటు వ్యాలిడిటీ ఉన్న మోటార్ కారు డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు డ్రైవింగ్‌లో కనీసం మూడేండ్ల అనుభవం ఉండాలి.
- ఫారెస్ట్ గార్డు-2, మల్టీటాస్కింగ్ స్టాఫ్-13 ఖాళీలు ఉన్నాయి.
- **వయస్సు:** 18- 30 ఏండ్ల మధ్య ఉండాలి. ఆయా పోస్టులకు వేర్వేరుగా ఉన్నాయి.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 9
- **వెబ్‌సైట్:** http://tfri.icfre.gov.in

## ప్రొఫెసర్లు

**రాంచీలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ స్టడీ అండ్ రిసెర్చ్ ఇన్ లా (ఎన్‌యూఎస్ఆర్ఎల్)లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టు:** ప్రొఫెసర్ (లా)-2, అసోసియేట్ ప్రొఫెసర్ (లా)-2, అసిస్టెంట్ ప్రొఫెసర్ (లా)-2
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.nusriranchi.ac.in

## డిప్లొమా కోర్సులు

**భివాడిలోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ప్రకటన విడుదల చేసింది.**



- **కోర్సులు:** అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ టూల్& డై మేకింగ్ (నాలుగేండ్ల కోర్సు), డిప్లొమా ఇన్ మెకట్రానిక్స్ (మూడేండ్లు).
- **అర్హతలు:** కనీసం 50 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణత. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు వస్తే సరిపోతుంది. పదోతరగతిలో సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులుగా చదివి ఉండాలి.
- **వయస్సు:** 2019, ఆగస్టు 1 నాటికి 15-19 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 23
- **వెబ్‌సైట్:** www.msmebhiwadi.org

## ఎన్ఐటీలలో పోస్టులు

**నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) పుదుచ్చేరి, తాడేపల్లిగూడెంలో టీచింగ్, నాన్ టీచింగ్, ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పుదుచ్చేరి నిట్‌లో:** అసిస్టెంట్ లైబ్రేరీ-1, టెక్నికల్ అసిస్టెంట్ (మెకానికల్, ఈసీఈ, ఈఈఈ, సీఎస్ఈ, సివిల్)-5, సూపరింటెండెంట్-2, స్టెనోగ్రాఫర్-1, జూనియర్ అసిస్టెంట్-7, టెక్నీషియన్-6, ఆఫీస్ అటెండెంట్-2 ఖాళీలు ఉన్నాయి.
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** ఆగస్టు 1
- **వెబ్‌సైట్:** http://nitpy.ac.in

- **తాడేపల్లిగూడెం నిట్‌లో:** ఫ్యాకల్టీ పోస్టులు. (అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ (గ్రేడ్-1,2)
- **విభాగాలు:** సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఈసీఈ, మెటలర్జీ అండ్ మెటీరియల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, కెమికల్, మ్యాథ్స్, బయోటెక్నాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ.
- అర్హతలు, ఎంపిక తదితర వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **వెబ్‌సైట్:** http://www.nitandhra.ac.in

## సైంటిఫిక్ ఆఫీసర్లు

**ముంబైలోని టాటా మెమోరియల్ సెంటర్ (టీఎంసీ)లో సైంటిఫిక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టులు:** సైంటిఫిక్ ఆఫీసర్ డీ(కంప్యూటేషనల్ ఇమేజింగ్)-1, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్-1, సైంటిఫిక్ ఆఫీసర్ సీ-1, సైంటిఫిక్ ఆఫీసర్ (హెమటోపాథాలజీ ల్యాబొరేటరీ)-1, నర్స్ -1, సైంటిఫిక్ అసిస్టెంట్ సీ-1, సైంటిఫిక్ అసిస్టెంట్ బీ-1, టెక్నీషియన్ సీ-1 ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.actres.gov.in

నమస్తే తెలంగాణ
# రైతుబడి
[కరీంనగర్]
గురువారం 4 జూలై 2019
raithubadi@ntnews.com

## గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

పశువులు, గొర్రెలు, మేకలు, పందులు మొదలైన చీలుగిట్టలుండే జంతువుల్లో సంక్రమించే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ముఖ్యమైంది. ఈ వ్యాధి సూక్ష్మమైన ఆఫ్తో వైరస్ వల్ల పశువులకు సోకుతుంది. గాలి, ఇతర మార్గాల ద్వారా అతివేగంగా ఇతర పశువులకు వ్యాపించే అంటువ్యాధి.

**ఈవ్యాధి** సోకడం వల్ల మరణాల తక్కువగా ఉంటుంది. అయినప్పటికీ పశువుల్లో ఉత్పాద క శక్తి తగ్గి తీవ్రమైన ఆర్థిక నష్టం కలుగుతుం ది. జబ్బు సోకిన పశువుల పాలు తాగి దూడ లు మరణిస్తాయి. ఈ వ్యాధి నివారణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం **ఈ నెల 5వ తేదీ నుంచి 22 వరకు నివారణ టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖా మంత్రి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. కాబట్టి పాడి రైతులు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.**

**వ్యాధి వ్యాప్తి:** సాధారణంగా వ్యాధి సోకిన పశు వులు ఆరోగ్యవంతమైన పశువుల దగ్గరగా ఉండటం వల్ల వ్యాధి వ్యాప్తికి కారణమౌతా యి. ముఖ్యంగా వ్యాధి సోకిన పశువుల ముక్కు ద్వారా బైటకు వదిలే గాలిలో ఎక్కువ మొత్తంలో వాయురూపంలో వైరస్ ఉంటుం ది. ఈ గాలిని ఆరోగ్యవంతమైన పశువులు నోటి ద్వారా, ముక్కు ద్వారా పీల్చినప్పుడు వ్యాధి సంక్రమణకు కారణమవుతుంది.
అంతేగాకుండా వ్యాధి సోకిన పశువుల నుంచి విడు దలయ్యే అంతస్రావాలలో వైరస్‌ను కలిగి ఉండి వ్యాధికి గురవుతాయి. అలాగే వ్యాధి లక్షణాలు కన బడే నాలుగు రోజుల ముందు వరకు పాలలోనూ వైరస్ ఉంటుంది. వాయురూపమైన వైరస్ వాతావ రణ పరిస్థితులపై ఆధారపడి వ్యాధి వ్యాప్తి ఉంటుంది. కానీ పాల ద్వారా దూడలకు, పాల ట్యాంకుల ద్వారా వేరే పశువుల శాలకు వ్యాధి వ్యాప్తి జరుగుతుంది. అలాగే వ్యాధి సోకిన పశులు తిన్న గడ్డి ద్వారా, వైద్య పరీక్షల ద్వారా వ్యవసాయ పని ముట్ల ద్వారా కూడా వ్యాధి వ్యాప్తి జరుగుతుంది.

**వ్యాధి లక్షణాలు:** శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 106 డిగ్రీల ఫారన్ హీట్ వరకు ఉంటుంది. నోటిలో చర్మపు పొరలు, పండ్ల చిగుళ్లు, నాలు క, ముట్టెలోపలి ప్రాంతాల్లో, బొబ్బలు ఏర్పడుతాయి. అవి 24 గంటల్లో చితికిపోవడం వల్ల పశువులు నొప్పి వల్ల మేత తినవు. నోటి నుంచి విపరీతమైన చొంగ, నురుగులు కారుస్తుంది. గిట్టల మధ్య, గిట్ట పైన వలయంగా ఉండే ప్రాంతంలో బొబ్బలు ఏర్పడి, చితికి, నొప్పితో నడువలేక కుంటుపడు తాయి. అలాగే పాలిచ్చే పశువులు, చనుమొనలపై బొబ్బలు ఏర్పడి పొదుగు వాపు కూడా సంభవి స్తుంది.

**నివారణ:** గాలి కుంటు వ్యాధికి చికిత్స లేదు. నివా రణ మార్గాలపై శ్రద్ధ వహించాలి. గాలికుం టు వ్యాధి టీకాలు మొదటిసారి 2 నెలల వయస్సులో, బూస్టర్ డోసు నెల తర్వాత చేయించా లి. ఆ తర్వాత ప్రతి ఏడాది ఒకసారి క్రమం తప్పకుండా టీకాలు వేయిం చాలి. టీకాలు వేసి న తర్వాత 2–3 వారాల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొంది ఏడాది కాలమంతా పనిచే స్తుంది.
వ్యాధిగ్రస్త పశువుల నోటి చొంగలో వైరస్ అధిక శాతం ఉండి మేత, దాణా, నీరులో సంవత్సరం వరకు దాగి ఉండి అనుకూల పరిస్థితుల్లో వ్యాధిని కలుగజేస్తాయి. అందువల్ల పశువుల శాలలను సాధా రణ క్రిమిసంహారక మందులతో కాకుండా సోడియం హైడ్రాక్సైడ్, 2 శాతం ఫార్మాలిన్, 4 శాతం సోడియం కార్బోనేట్ వంటి మందులతో శుభ్రం చేయ డం వల్ల వైరస్ నశిస్తుంది.



### వ్యాధి చికిత్స:

వ్యాధి సోకిన పశువులను వేరుచేసి సత్వ ర చికిత్స చేయించాలి. నోటిలోని పుండ్ల ను పొటాషియం పర్మాంగనేటు నీళ్లలో శుభ్రం చేసి, వాటికి బోరోగ్లిజరిన్, యాంటిసెప్టిక్ ఆయింట్‌మెంట్ పూత పూ యాలి. అలాగే కాలి పుండ్లకు జింక్ ఆక్సైడ్, లోరాక్సిన్, హిమాక్స్ వంటి ఆయింట్‌మెంట్ పూతగా పూయాలి. ఈగలు వాలకుండా వేపనూనె, లిన మెంట్ వంటి వాటిని వాడాలి. అలాగే నోటిలోని చిగుర్లు, పుండ్ల మీద పొరలు అభివృద్ధికి విటమిన్ సీ కలిగి ఉండే పౌడర్ ఆఫ్థోకేర్ వంటి వాటిని వాడాలి.

**డాక్టర్ కాటం శ్రీధర్**
(ఎంవీఎస్సీ)
ప్రాథమిక పశు వైద్య కేంద్రం,వేలూరు
సిద్దిపేట జిల్లా,
9491547148



రాష్ట్రంలో సాగు చేయబడుతున్న ముఖ్యమైన పంట వంకాయ. ఈ పంటలోనూ సూటి రకాలలో రైతులు సొంతంగా తమస్థాయిలో విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. ప్రస్తుతం రంగును, ఆకారాన్ని బట్టి పలురకాలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో పూసా పర్పుల్ లాంగ్, పూసా క్రాంతి, పూసా పర్పుల్ క్లస్టర్, హిస్సార్ ప్రగతి, హిస్సార్ జమున అలాగే మన స్థానిక రకాలైన శ్యామల, గులాబీ, భాగ్యమతి అందుబాటులో ఉన్నాయి. మన రాష్ట్రంలో సాగు చేయడానికి ఇవి అనుకూలం. కాబట్టి వీటిలో విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. అయితే మేలైన విత్తనోత్పత్తికి కొన్ని అంశాల్లో జాగ్రత్తలు పాటించాలి.

# వంకాయలో విత్తనోత్పత్తి



**వాతావరణం:** వంకాయ ఉష్ణమండలంలో పండే పంట. తీవ్ర చలికి తట్టుకోలేదు. దీర్ఘకాల వేడి వాతా వరణం వంకాయ విత్తనోత్పత్తికి అత్యంత అను కూలం. తక్కువ వేడి, ఎక్కువ చలి వాతావరణం పనికిరాదు. మేలైన మొక్క వృద్ధికి, కాయ దిగుబడికి 13 నుంచి 21 డిగ్రీల సెల్సియస్ సరాసరి ఉష్ణోగ్రత అనుకూలంగా ఉంటుంది. 25 డిగ్రీల ఉష్ణోగ్రతలో విత్తన మొలక శాతం బాగుంటుంది.

**పూత సంబంధిత అంశాలు:** వంకాయలో నాలుగు రకాల పూలు వస్తాయి. అందులో కేవలం దీర్ఘ అండ కోశంతో ఉండి సాధారణ అండాశయం ఉండేవి, మధ్యస్థ అండకోశంతో ఉండే రెండు రకాల పూలలో మాత్రమే విత్తనం కట్టుతుంది. స్వతహాగా వంకాయ స్వపరాగ సంపర్క పంట. అయితే పరపరాగ సంపర్కం 5 శాతంపైనే ఉంటుంది. కాబట్టి దీన్ని తరుచుగా పరపరాగ సంపర్కం చెందే పంట. ఉష్ణో గ్రతను బట్టి పొద్దుగాల 7 గంటల నుంచి 8 గంటల మధ్య పూలు విచ్చుకుంటా యి. తక్కువ ఉష్ణోగ్ర తలు ఉంటే ఆలస్యంగా విచ్చుకుంటాయి. రెండు గంటల వరకు ఇది కొనసాగుతుంది. ఆ తర్వాత పూలు సాయంత్రం వరకు ముడుచుకుంటా యి. ఈ ప్రక్రియ మూడు, 4 రోజులు కొనసాగుతుంది.

**వేర్పాటు దూరం:** వంకాయలో విత్తన నాణ్యత కోసం వేర్పాటు దూరం చాలా కీలకం. ఫౌండేషన్ విత్తనం ఉత్పత్తికి 300 మీటర్లు, ధృవీకరణ విత్తనం ఉత్పత్తికి 150 మీటర్ల వేర్పాటు దూరం పాటించాలి.

**నేలలు:** మురుగు నీరుపోయే సౌకర్యం ఉన్న ఎర్రనే లలు ఈ పంట సాగుకు అనుకూలం. సారవంత మైన, మురుగునీటి సౌకర్యం ఉండి, ఉదజని సూచిక 6.5 కంటే తక్కువ ఉన్న నేలలు ఎంపిక చేసుకోవాలి.

**ఎరువులు:** ఆధునిక రకాలలో విత్తనోత్పత్తికి భారీ గానే ఎరువులు అవసరం. హెక్టారుకు 25 టన్నుల బాగా చివికిన పశువుల ఎరువు లేదా కంపోస్టు వేయాలి. వీటిని నేల దుక్కిలో కలిపి దున్నాలి. ప్రధాన పొలంలో వాడేందుకు 100 కిలోల నత్ర జని, 50 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు ఎకరానికి పడేటట్లు చూసుకోవాలి.



### కల్తీల ఏరివేత:

విత్తనోత్పత్తి అత్యంత కీలకాంశం కల్తీల ఏరివేత. నాణ్యమైన విత్తనోత్పత్తి మొత్తం ఈ అంశంపైనే ఆధారపడి ఉంటుంది. మొక్క భౌతిక లక్షణాల ఆధారంగా కల్తీలను ఏరివేయాలి. కాయలు ఏర్పడే లక్షణాలు, స్వభావం, తెగుళ్లు సోకిన మొక్క భాగాల ఆధారంగా కల్తీలను గుర్తించి ఏరివేయాలి. విత్తనాలను నష్టపరిచే తెగుళ్లు ఆశిస్తే, వాటి నుంచి విత్తనాలు సేకరించరాదు. వెర్రితె గులు ఆశించిన మొక్కలు కాయలు పట్టవు. కాబట్టి వాటిని గుర్తించిన వెంటనే తొలిగించాలి. శాఖీయ దశ, తొలి కాయ దశ, కాయలు పూర్తిగా ఏర్పడిన తర్వాత ఇలా మూడు దశలలో తప్పకుండా కల్తీలను ఏరివే యాలి. ఈ దశలో విత్తన పొలాలలో క్షేత్ర తనిఖీలు తప్పనిసరి.

**విత్తనమోతాదు:** హెక్టారుకు 400–500 గ్రాములు అవసరం.

**విత్తే సమయం:** ఏడాదంతా విత్తుకోవచ్చు. అయితే వర్షాలు వచ్చే సమయంలో ఈ విత్తన పూత రాకుండా చూసుకోవాలి. అప్పుడే మంచి దిగుబడి వస్తుంది. సాధారణ పంటల్లోలాగే విత్తన సమ యాన్ని పాటించాలి.

**నారుమడి:** భూమట్టం నుంచి 15 నుంచి 20 సెం.మీ. ఎత్తులో తయారుచేసిన ఎత్తైన నారుమడు లలో వరుసలలో 8–10 సెం.మీ దూరంలో నారు పోయాలి. బాగా చివికిన పశువుల ఎరువుతో పలు చగా విత్తనాన్ని కప్పాలి. పొద్దుగాల, సాయంత్రం నారుమడులు తడుపాలి. మొక్కలు 4–5 సెం.మీ పొడవు ఉన్నప్పుడు పలుచన చేయాలి.

**కోత, విత్తన సేకరణ:** కల్తీల ఏరివేత తర్వాత ముది రిన, పసుపు రంగులోకి మారిన పండ్లను సేకరించి ముక్కలుగా చేయాలి. తగిన నీటిని చేర్చి పిసకాలి. ఉష్ణోగ్రతను బట్టి 48–96 గంటల పాటు పులియబె ట్టాలి. ఆ తర్వాత విత్తనాలను సేకరించాలి. నీడలో ఆరబెట్టి నిల్వ చేసుకోవాలి.

**విత్తన దిగుబడి:** రకాన్నిబట్టి, పంట పరిస్థితిని బట్టి హెక్టారుకు 4–6 క్వింటాళ్ల విత్తన దిగుబడి వస్తుంది. ధృవీకరణ విత్తనాలు లేదా ట్రూత్‌ఫుల్లీ లెబెల్డ్ విత్త నాలు గా అమ్మేందుకు కావాల్సిన ప్రమాణాలు పాటించాలి.

### ప్రధాన పొలంలో నాటడం

12–15 సెం.మీ ఎత్తు పెరిగిన నారును, 4–5 వారాల వయసున్న నారును బాగా దున్ని తయారుచేసిన ప్రధాన పొలంలో నాటాలి. పొడవు కాయలను ఇచ్చే రకాలను 60X60 సెం.మీ. దూరం పాటించి వరుసలు, వరుస లలో మొక్కల మధ్య నాటాలి. గుండ్రటి కాయలను ఇచ్చే రకాలను 75X75 సెం.మీ దూరంలో నాటాలి. సాయంత్రం పూట నాటి, వెంటనే తేలికపాటి నీటి తడులి వ్వాలి. వంకాయలో వేరు వ్యవస్థ నేలపైనే ఉంటుంది. కాబట్టి ఎక్కువసార్లు తడులి వ్వాలి. మొదటి దశలో వంకాయ మొక్కల పెరుగుదల మెల్లగా ఉంటుంది. కాబట్టి కలుపు మొక్కలతో పోటీ పడలేవు. అందు వల్ల మొదటి 25–30 రోజులలోపే కలుపు నివారణ చేపట్టాలి.

**కనీస భౌతిక స్వచ్ఛత:** 97 శాతం
**గరిష్ఠ వ్యర్థ పదార్థం:** 2 శాతం
**కలుపు విత్తనాలు, ఇతర పంట విత్తనాలు (గరిష్ఠంగా):** ఉండకూడదు
**మొలకశాతం:** 70 శాతం
**విత్తన తేమ శాతం:** 8 శాతం (సాధారణ విత్తన సంచి లో); 6 శాతం (తేమ చొచ్చుకుపోని విత్తన సంచిలో)

**డాక్టర్ పిడిగెం సైదయ్య**
శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం
7780509322






# గుండె నిండా అలుముకున్న పండుగ

ఇక్కడ..
పూజకోసం పూలు బయట నుంచి కొననవసరం లేదు
తినడానికి కూరగాయలు బయట నుంచి తేనవసరం లేదు
అవసరమైన పండ్లకు అనవసర ఖర్చే లేదు
చిన్న చిన్న అవసరాల కోసం బయటకు పరిగెత్తనవసరం అంతకన్నా లేదు.
ఆహారం, ఆరోగ్యం, ఆనందం అంతా ఒక్కచోటే.
ఇంట్లో సగం అవసరాలకు ఇళ్లు దాటనవసరం లేనిప్రకృతి ఆధారిత జీవనం.
నాలుగు గోడలు, కిటికీలు, తలుపులు కాదు
ఇల్లంటే.. గూడంటే ఇలాగే ఉండాలి.
నిండుగా, గుండె నిండా
అలుముకున్న పండుగలా..

**షణ్ముఖ** తండ్రి గారికి గులాబీ మొక్కలంటేచాలా ఇష్టం. ఎంతం టే, ఇంట్లో రకరకాల రంగుల గులాబీ మొక్కలతో ఒక తోట పెంచేం త. ఆ ప్రభావం షణ్ముఖ మనసులో అలాగే ఉండిపోయింది. పెళ్ల య్యాక ఊరి నుంచి తెచ్చుకున్న చామంతులు, గులాబీలతో అమీ ర్‌పేట ఇంట్లో రెండో అంతస్థు నింపేసారు. అదీ పగిలిపోయిన నీటి తొట్లలో. అలా చేస్తూనే నేరేడ్‌మెట్‌లో ఉన్న తమ 300 గజాల ఖాళీ స్థలంలో 40 రకాల గులాబీలు, కొన్ని కొబ్బరి మొక్కలు, నిమ్మ మొక్కలు ఊరి నుంచి తెచ్చి నాటారు.తరువాత 1990వ దశకంలో అదే స్థలంలో 100 గజాల్లో ఇళ్లు కట్టుకున్నారు. 200 గజాల్ల చెట్లకు వదిలేసారు. ఇంటి ముందు పందిరి వేసి తీగజాతి కూరగాయలు, మిద్దెమీద పూల మొక్కలు పెంచారు. షణ్ముఖ సుబ్ర హ్మణ్యం దంపతులు పదేళ్ల క్రితం బి.హెచ్. ఇ.ఎల్‌లో ఇళ్లు కట్టుకో వడంతో ఇక్కడ తన ఆలోచనలను అమలు చేసారు. ముందు ఖాళీ స్థలంలో 50 రకాల వివిధ గులాబీలు వేసుకున్నారు. ఇంటిమీద కుండీల్లో చామంతులు, టమాటా, వంగ, బీర, కాకర పెట్టుకు న్నారు. మూడేళ్ల పాటు అలాగే పెంచుకున్నారు. తోటను విస్తరించి మెల్లగా అన్నిరకాల ఆకుకూరలు, కూరగాయలు పెంచడం మొద లుపెట్టారు.

ఇంటిముందు పందిరివేసి సొరపాదును పాకించారు. దానికి వరు సగా వేలాడే గుండ్రని సొరకాయలు చాలా అందమైన దృశ్యరూపా న్ని మన కళ్లముందు ఆవిష్కరిస్తాయి. అందమే కాదు, ఎండాకా లంలో ఈ సొర తీగ తన చల్లని పందిరిగాలితో ఇళ్లంతా ఆహ్లాదాన్ని నింపిందట. ఇక ఇంటిముందు ఆగాకరకు చక్కని పందిరి వేసారు. ఒక స్టాండ్‌కు అడ్డంగా, నిలువుగా కట్టెలు కట్టి తాళ్లతో రెండు అంత స్థుల్లో చిన్న పందిరి వేసారు. ముచ్చటగొలిపే ఈ మినీ పందిరి ఒక్క క్షణం మనల్ని కట్టిపడేస్తుంది. గోడకు పారే గులాబీరంగు డ్రాగన్ ఫ్రూట్స్ నోరూరిస్తాయి. పెరట్లో చిన్న చిన్న టబ్బుల్లో పెంచే రకరకా ల తామరలను (వాటర్ లిల్లీస్) చూస్తే అచ్చెరువొందాల్సిందే.

ఇక ఈ ఇంట్లో కిందా పైనా ఎటుచూసినా మొక్కలే. కూరగాయలు, ఆకుకూరలు, తీగజాతులు, పండ్లమొక్కలు, ఎడారి మొక్కలు, ఔష ధ మొక్కలు. రోజువారీ జీవితానికి అవసరమైన అన్నిరకాల మొక్క లు ఒకే దగ్గరికి చేర్చిన వైనం ముచ్చటగొలుపుతుంది. ఇంట్లో పచ్చ దనం కాదు, పచ్చదనం మధ్యలో ఇళ్లు కట్టుకున్నట్టుగా ఉంది. వీట న్నిటినీ చూసుకోవడానికి షణ్ముఖ రోజుకు దాదాపు నాలుగు గంట లపాటు మొక్కల మధ్యే గడుపుతారు.

తమ ఇంటిలోని మొక్కలు ఇంత ఆరోగ్యంగా పెరగడానికి పాటింగ్ మిక్స్ దగ్గర నుంచే జాగ్రత్తలు పాటిస్తున్నారు. పాటింగ్‌మిక్స్‌లో 30 శాతం ఎర్రమట్టి, 30 శాతం వర్మికంపోస్ట్, 20 శాతం కోకోపిట్, 10 శాతం నీమ్‌కేక్ లేదా వేపపిండి మిశ్రమంగా ఉండేలా చూసుకు న్నారు. మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి దగ్గరగా ఉన్న గోశాల నుంచి ఆవుపేడ, మూత్రం తీసుకవచ్చి జీవామృతం, ఘన జీవా మృతం తయారుచేసి వాడుతున్నారు. అంతేకాక కూరగాయల వ్యర్థాలను పేస్ట్ చేసి బకెట్‌లో వేసాక, ఘన జీవామృతం కానీ ఎండిన పేడ గానీ దాని పైన పొరగా వేస్తారు. బకెట్‌నిండిన తరు వాత 15 రోజుల్లో ఎరువు తయారవుతుంది. బకెట్ కింద టబ్ పెట్టి, బకెట్ అడుగు రంధ్రంలోంచి పడిన ఎరువు ద్రావణాన్ని 1:10 నిష్పత్తిలో కలిపి వారానికి ఒకసారి మొక్కలకు పిచికారీ చేస్తున్నారు. మొక్కలకు పురుగు పట్టకుండా ఉండేందుకు, ముందు జాగ్రత్త చర్యగా వారానికి ఒకసారి జీవామృతాన్ని పిచికారీ చేస్తున్నారు. తామరకు జీవామృతం వాడటం వల్ల ఆకులు విశాలంగా, పూలు ముదురు రంగులో, పెద్దగా పూస్తున్నాయి. ఒకవేళ మొక్కలకు పేను బంక వస్తే నీమ్‌ఆయిల్ వాడుతున్నారు. 1లీటర్ నీటికి ఒక మూత నీమ్ ఆయిల్, కొంచెం సర్ఫ్ కలిపి పిచికారీ చేస్తారు. అపుడు కూడా తెగులు కంట్రోల్ కాకపోతే వెల్లుల్లి, మిర్చి కలిపి మిక్సీ పట్టి, రాత్రి పూట గిన్నెలో వేసి కొంచెం నీరు పోసి, ఉదయం వడగట్టి 1: 10 నిష్పత్తిలో పిచికారీ చేస్తే పూర్తిగా నియంత్రణలోకి వస్తుందంటారు షణ్ముఖ. ఇక మందారలో పసుపు పురుగు కాండాన్ని పట్టి నెమ్మ దిగా పైకి వ్యాపిస్తుంది. దీనికి వెల్లుల్లి, మిర్చి కషాయం బాగా పని చేస్తుంది. మొదట కాండాన్ని బ్రష్‌తో శుభ్రపరిచి తరువాత ఈ కషా యాన్ని వాడాలంటారు.
ఇన్ని జాగ్రత్తలతో అన్నిరకాల మొక్కలు పెంచడం ఒక ఎత్తైతే, ఆర్కిడ్స్ పూలమొక్కలు పెంచడం కొంచెం కష్టమైనదేనంటారు షణ్ముఖ. ఆర్కిడ్స్‌కు ఎండ తగలకూడదు, నీడలో ఉంచాలి. కొబ్బరి బోండాను కట్‌చేసి నీళ్లలో వారంపాటు నానబెట్టాలి. అది మెత్తగా అయిన తరువాత దానిని కుండీలోపల చుట్టూపెట్టి మధ్యలో మొక్క నాటాలి. మొక్క చుట్టూతా బొగ్గు, ఇటుక ముక్కలు ఉంచాలి. ఇవ న్నీ మొక్క నిలబడేట్టు చుట్టూతా గట్టిగా కూర్చాలి. పొద్దున సాయం త్రం నీటిని పిచికారీ చేయాలి. శ్రమ అనిపించినా, ఒకసారి పూలు పూశాక మొత్తం తోటకే అందం తెస్తాయి ఆర్కిడ్స్. ఈ పూలు ఆ తోటకు అందం తెస్తే,తోట మాత్రం ఆమె జీవితానికే అందం తెచ్చిం ది. ఆ మార్పు గురించి ఆమె చెబుతుంటే ఆమె కళ్లలో కాంతి కని పించింది. 'ఒకప్పుడు పిల్లల ఫోన్‌ల గురించి ఎదురుచూసేదాన్ని. ఇపుడు వాళ్లు ఫోన్ చేస్తే, నేను లిఫ్ట్ చేయడం లేదు. ఎందుకంటే ఆ సమయంలో నేను ఎక్కువ సమయం తోటలో గడుపుతాను. మేడ మీదకు వెళితే నాకెవరూ గుర్తుకురారు. మొక్కలే నా పిల్లలు అన్న ట్లుగా అదో ప్రపంచంలోకి వెళ్లిపోతాను. దీంతో మానసికి ప్రశాంత తతో పాటు ఆరోగ్యం చాలా బాగుంటుంది. కూరగాయల ఖర్చు, హాస్పిటల్ ఖర్చు తగ్గుతుంది. మేమైతే ఐదారేళ్ల నుంచి అసలు హాస్పి టల్‌కు వెళ్లాల్సిన అవసరమే రాలేదంటారు' షణ్ముఖ. అందుకే ఇంటిపంటల్లో ప్రతి ఒక్కరూ తమకున్న పరిధిలో, నిత్యం అవసర మైన అన్నిరకాల మొక్కలు కొన్ని కొన్నిగా నాటుకోవాలంటారు. ముఖ్యంగా ప్రతీ ఆరోగ్య సమస్యకు హాస్పిటల్‌కు పరిగెత్తకుండా మన ఇంట్లోనే తులసి, కలబంద వంటి ఔషధ మొక్కలు పెంచాలం టారు. తిప్పతీగ జ్వరాలు, జలుబులు వచ్చినపుడు చాలా ఉపయో గపడుతుంది. మామిడి అల్లాన్ని నిమ్మరసంలో నానబెట్టి, రెండురో జులపాటు ఎండలో ఉంచి నమిలితే అజీర్తి సమస్య సులువుగా తగ్గు తుంది. వావిలాకు వేడినీటిలో మరగబెట్టి గర్భిణీ స్త్రీలకు స్నానం చేయిస్తే వళ్లునొప్పులు తగ్గుతాయి. ఇన్సులిన్ ఆకును రెండుపూట లా పరిగడుపున వాడితే రక్తంలో చక్కెర శాతం నియంత్రణలో ఉంటుంది. మల్టీవిటమిన్ ఆకులు నమిలితే ప్రత్యేకంగా విటమిన్ ట్యాబెట్స్ అవసరం లేదు. లక్ష్మీతరుణి ఆకులను నీటిలో మరగబెట్టి తాగితే క్యానర్ సమస్యకు, స్త్రీల నెలసరి సమస్యల నియంత్రణకు ఉపయోగపడుతుంది అంటూ తమ ఇంటిలో పెంచుతున్న ఔషధ మొక్కల ప్రాముఖ్యాన్ని ఆమె చెప్పుకుంటూ పోతుంటే, తనకు మొక్కల మీద ఉన్న శ్రద్ధ అర్థం అవుతుంది.

ఇక తోటకు కావలసిన విత్తనాలను ఎప్పటికపుడు పంట చివరలో సొంతంగా కట్టుకుంటున్నారు. కారట్, క్యాబేజి, కాలిఫ్లవర్, బీట్ రూట్ విత్తనాలను మాత్రం బయట కొనవలసిందే అంటారు. విత్త నం తనతోట వరకే పరిమితం చేయకుండా, ఇంటిపంటలు చేసు కునేవారందరికీ అందుబాటులో ఉంచుతున్నారు షణ్ముఖ. మట్టిలో నాటే విత్తనాలే కాదు, తన అనుభవాలను కూడా ఎప్పటికపుడు ఎదుటివారితో పంచుకుంటుంటారు షణ్ముఖ.

- ఇంటిపంటలు పెంచాలనుకునేవారు మొదట ఆకుకూరలతో ప్రారంభించాలి. ఇవి సులువుగా పెంచుకోవచ్చు. ■ రెండోదశ లో టమాటా, వంగ, మిరప, బెండ పెంచుకోవాలి. ■ టమాటా మొక్కలకు బూజు తెగులు వస్తుంది. అది మట్టిలోంచి వేరుకు పట్టేస్తుంది. దీనివల్ల మెల్లగా మొక్క చచ్చిపోయింది.అందుకు మొక్క నాటేటపుడే ట్టి,ఎరువు మిశ్రమంలో వేపపిండి తప్పక కలపాలి. ■ ఎడారి మొక్కలు (కాక్టస్, సకులెంట్స్) మొక్కలకు 20 రోజులపాటు నీరు పోయకపోయినా తట్టుకుంటాయి. ఆకు కూరలకు రోజ్‌క్యాన్‌తో నీరు పోస్తే మంచిది. కూరగాయ మొక్క లకు ఉదయం, సాయంత్రం కొద్దికొద్దిగా నీరు పోయాలి. ■ చలి కాలంలో కారట్, బీట్‌రూట్, క్యాబేజి, కాలిఫ్లవర్ నాటుకోవాలి. ఇవి వర్షాకాలం పెడితే నీరు ఎక్కువై దుంప కుళ్లిపోతుంది. ఎండాకాలం బెండ,దోస,తోటకూర,గంగవావిలి చాలా బాగా వస్తాయి. ■ కంటెయినర్‌లలో నీరు నిలువ ఉంచకూడదు. ఎక్కు వైన నీరు ఎప్పటికపుడు బయటకు వెళ్లేలా ఒకవైపు రంధ్రం (అ వుట్‌లెట్) చేసుకోవాలి. ■ వంగ ఒక్కో రకం కనీసం 5 మొక్కలు నాటుకోవాలి. బెండ 30 మొక్కలు నాటుకోవాలి. వీటిలో పోయేవి పోను, సరిగా కాయనివి మరికొన్ని పోను, మిగిలిన వాటి నుంచి ఒక కుటుంబానికి సరిపోయేన్ని కూరగాయలు వస్తాయి. ■ ఆకు కూరలకు 6–8 ఇంచుల లోతు కుండీ, కూర గాయలకు (వంగ, టమాటా,బెండ) 12 ఇంచుల కుండీ,తీగజా తికి ఒకటిన్నర అడుగులలోతు, పండ్ల మొక్కలకు 2 అడుగులు.. కాక్టస్, సకులెంట్స్‌కి 4–5 ఇంచుల మొక్కలు, పూలమొక్కలకు 1అడుగు లోతు కుండీలు ఉండాలి. ■ గ్రోబ్యాగ్స్‌లో చాలా సులువుగా మొక్కలు పెంచుకోవచ్చు. వీటిని ఎక్కడికైనా సులు వుగా మార్చుకోవచ్చు.

### షణ్ముఖ ఇంటిమీద పెరుగుతున్న మొక్కలు ఆకుకూరలు



చుక్కకూర, తోటకూర, పాలకూర, గోంగూర, పొన్నగంటికూర, మునగ, ముల్లంగి, పుదీనా, కొత్తిమీర, కరివేపాకు

**కూరగాయలు:** ఆనప (2 రకాలు), బీర,చిక్కుడు (4రకాలు), బెండ(2 రకాలు), దొండ, కాకర(3రకాలు), ఆగాకర, టమాటా(4రకాలు), వంగ(5రకాలు),మిర (6రకాలు), దోస, ఉల్లి, వాక్కాయ, కాప్సికం, బీట్ రూట్, నిమ్మ, క్యారట్, కాలిఫ్లవర్, క్యాబేజి, రెడ్ క్యాబేజి.

**ఔషధ మొక్కలు:** తులసి, లక్ష్మీతులసి, లవంగ తులసి, యాలకులు, ఇరి యాలు, వావిలి, కలబంద, వామాకు, నల్లేరు, సరస్వతి ఆకు,బచ్చలి, పొన్నగంటి, ఇన్సులిన్, లక్ష్మీతరుణి, మారేడు, తిప్పతీగ, మరువం, తమలపాకు, మల్టీవిటమిన్, బిళ్లగన్నేరు, ఉసిరి, అల్లం, మామిడిఅల్లం, పసుపు

**పండ్ల మొక్కలు:** మామిడి, జామ, దానిమ్మ, సపోటా, స్ట్రాబెర్రి, మల్బరి, పనస, ద్రాక్ష, డ్రాగన్ ఫ్రూట్

**పూల మొక్కలు:** చామంతి, గులాబీ , తామర, కనకాంబరం,మల్లె, నందివర్ధనం,గరుడ వర్ధనం, నూరవరహాలు, మందారం, లిల్లి, బర్డ్ ఆఫ్ ప్యారడైజ్, బ్రహ్మకమలం, పారిజాతం, శంఖుపుష్పం, ఆర్కిడ్స్, అడేనియం, గ్రౌండ్ ఆర్కిడ్స్, రాఖి ఫ్లవర్, హెల్కోనియా, జాక్విమోంటియా, ఇపోమియా హార్స్‌ఫాలియా, అరిస్టోలోచియా, బోగన్ విల్లియా, క్యాంప్‌సిస్ వీటితోపాటు పలురకాల ఎడారి మొక్కలు (కాక్టస్,సకులెంట్స్) పెంచుతున్నారు.

ఇతర వివరాలకు షణ్ముఖ గారిని సంప్రదించవలసిన నెంబర్ 95054 13131

**కె.క్రాంతికుమార్‌రెడ్డి,** 9603214455
నేచర్స్‌వాయిస్



# విక్రమ్ ‘మిస్టర్ కె.కె’

విభిన్నమైన కథాంశాలు, పాత్రల్ని ఎంచుకుంటూ సినిమాలు చేస్తుంటారు విక్రమ్. ఆయన హీరోగా నటిస్తున్న తమిళ చిత్రం ‘కడరం కొండన్’. రాజేష్ సెల్వ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను పారిజాత మూవీ క్రియేషన్స్ పతాకంపై కమల్‌హాసన్‌తో కలిసి టి. నరేష్‌కుమార్, టి.శ్రీధర్ ‘మిస్టర్ కె.కె. పేరుతో తెలుగులోకి అనువదిస్తున్నారు. తెలుగు ట్రైలర్‌తో పాటు విక్రమ్ లుక్‌ను బుధవారం చిత్రబృందం విడుదలచేసింది. ఇందులో సాల్ట్ అండ్ పెప్పర్‌లుక్, పొడవైన మీసంతో విక్రమ్ వినూత్నంగా కనిపిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విక్రమ్ పోలీస్ అధికారిగా భిన్న పార్శ్వాలతో కూడిన పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. అక్షరహాసన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. తమిళంలో ఈ సినిమాను ఆర్ రవీంద్రన్‌తో కలిసి హీరో కమల్‌హాసన్ నిర్మిస్తున్నారు.



‘ కథా, కథనాలు చాలా ఆసక్తికరంగా అనిపించి చేసిన సినిమా ‘ఓ బేబీ’. ఇందులో సమంత, లక్ష్మిలకు బాయ్ ఫ్రెండ్‌గా నటించాను. నేను చాలా అదృష్టవంతుడిని. కొంత మందితో నటిస్తున్నప్పుడు కొత్తగా, మరింత ఉత్సాహంగా అనిపిస్తుంటుంది. ‘బామ్మబాట బంగారు బాట’లో భానుమతిగారికి మనవడిగా నటిస్తే, ‘బృందావనం’లో అంజలిదేవి నాకు అమ్మగా నటించారు. ఈ చిత్రంలో సీనియర్ నటి లక్ష్మికి జోడీగా బాయ్ ఫ్రెండ్‌గా నటించడం సరికొత్త అనుభూతినిచ్చింది’ అన్నారు రాజేంద్రప్రసాద్. ఆయన నటిస్తున్న తాజా చిత్రం ‘ఓ బేబీ’. సమంత కీలక పాత్రలో నటించింది. నందినిరెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా నటుడు రాజేంద్రప్రసాద్ బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో ముచ్చటించారు.

# ఆ వాస్తవం కొందరికి నచ్చదు!

సీనియర్ నటి లక్ష్మి, నేను ఓ హోటల్‌ని నడుపుతుంటాం. సడన్‌గా లక్ష్మీ మాయమైపోతుంది. ఆ స్థానంలో సమంత వచ్చేస్తుంది. ఆ తరువాత ఏం జరిగింది అన్నదే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. నేను ఇప్పటి వరకు చేసిన ఆ నలుగురు,మీ శ్రేయోభిలాషి, ఓనమాలు చిత్రాలకు పూర్తి భిన్నంగా ఇందులో నా పాత్రని దర్శకురాలు నందినిరెడ్డి అద్భుతంగా మలిచారు. ఇలాంటి పాత్ర నా లాంటి నటుడికి లభిస్తే ఎలా వుంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ మధ్య కాలంలో వచ్చిన మంచి సినిమాల్లో నిలిచే చిత్రమిది. కొరియన్ చిత్రం ‘మిస్ గ్రానీ’ని తీసుకుని తెలుగు నెటివిటీకి అనుగుణంగా మార్పులు చేసి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సమంత చాలా గౌరవంతో అద్భుతంగా ఈ చిత్రంలో నటించిన తీరు నన్నెంతగానో ఆకట్టుకుంది. ఇంత మంచి చిత్రంలో నటించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను.

**వృత్తిపరమైన సంతృప్తినిచ్చింది..**

కొన్ని సినిమాలు జేబు సంతృప్తినిస్తే కొన్ని సినిమాలు మాత్రమే జాబు సంతృప్తినిస్తాయి. అలా ‘ఓ బేబీ’ వృత్తిపరమైన సంతృప్తిని మిగిల్చిన చిత్రం. ‘ఓ బేబీ’ పాత్రకు సమంత ది బెస్ట్ ఇచ్చింది. సినిమాలో ప్రతి పాత్ర నటించినట్టుగా కాకుండా అత్యంత సహజంగా వుంటాయి. దానికి కారణం నందినిరెడ్డి తీర్చి దిద్దిన పాత్రలే. అంత బాగా కుదిరాయి. సమంత ఓ సన్నివేశంలో నన్ను జుట్టు పట్టుకు తంతుంది. ఇలాంటి సరదా సన్నివేశాలు, మా పాత్రల అల్లరి సినిమాలో పతాక స్థాయిలో సాగుతుంది. థియేటర్‌లో ప్రేక్షకులు కొత్త రకం తెలుగు సినిమాని చూస్తారు. ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో నేర్చుకుంది ఈ సినిమాకు బాగా పనికొచ్చింది. దర్శకురాలు నందిని రెడ్డికి ఈ సినిమా ఓ చక్కని అవకాశం. ఆమెకు ఈ సినిమా బిగ్ బ్రేక్ ఇస్తుంది.


రాజేంద్రప్రసాద్

**అలా అంటే కొంత మందికి నచ్చదు..**

హాస్యనటులైన రాజాబాబు, రేలంగి హీరోలుగా అద్భుతమైన చిత్రాలు వచ్చాయి. అయితే హీరో చేసే కామెడీకి హాస్యనటుడు చేసే కామెడీకి చాలా తేడా వుంది. భరించగలిగితే నాలా నిలబడతారు లేదంటే పరిస్థితి మరోలా వుంటుంది. నేను అలా అంటే కొంత మందికి నచ్చదు. కానీ వాస్తవం అదే. కానీ సినిమా విషయంలో ఎప్పుడూ ఎవరినీ తక్కువగా అంచనా వేయకూడదు. ఎందుకంటే ఎవరు ఎప్పుడు ఏమౌతారో చెప్పలేం. ఈ నెలలో నేను నటించిన మూడు చిత్రాలు రీలీజ్ అవుతున్నాయి. ఓ బేబీ, బుర్రకథ, కౌసల్య కృష్ణమూర్తి. ఈ మూడు చిత్రాల్లో నేను పోషించిన పాత్రలు ఒకదానికి మించి ఒకటి పూర్తి భిన్నంగా సాగుతాయి. ఆ తేడా కనిపించకపోతే సినిమా పరిశ్రమనుంచి వెళ్లిపోతాను.

# తండ్రీకూతుళ్ల అనుబంధంతో


మిథాలీరాజ్, ఐశ్వర్యరాజేష్

‘కూతురు కన్న కలలను నేరవేర్చడానికి ఓ తండ్రి పడే తపనను ప్రచార చిత్రాల్లో అద్భుతంగా చూపించారు. మహిళా క్రికెట్ ప్రాధాన్యతను ఆవిష్కరిస్తూనే మరోవైపు రైతుల కష్టాలను చాటిచెప్పే సినిమా ఇది ’ అని అన్నారు భారత మహిళా క్రికెటర్ మిథాలీరాజ్. ఐశ్వర్యరాజేష్, రాజేంద్రప్రసాద్, కార్తిక్‌రాజు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘కౌసల్య కృష్ణమూర్తి’. భీమనేని శ్రీనివాసరావు దర్శకత్వం వహిస్తున్నారు. కె.ఎస్.రామారావు సమర్పణలో క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై కె.ఎ. వల్లభ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి క్రికెటర్ మిథాలీరాజ్ ముఖ్య అతిథిగా హాజరై పాటలను, ప్రచార చిత్రాన్ని విడుదలచేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ‘కథ, కథనాలు వాస్తవికతను ప్రతిబింబిస్తున్నాయి. ఆడ, మగ అనే తారతమ్యాలు లేకుండా అమ్మాయిలకు సమాన అవకాశాలు కల్పించాలి. తమిళ మాతృక మా అమ్మకు చాలా నచ్చింది. తెలుగులో నేను ఈ సినిమా చూస్తాను’ అని తెలిపింది. భీమనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ‘తమిళంలో పెద్ద విజయాన్ని సాధించిన సినిమా ఇది. ఐశ్వర్య రాజేష్ అభినయం చూసి నాకు కన్నీళ్లొచ్చాయి. నేటి తరం ఆలోచనలకు అభిరుచులకు తగినట్లుగా ఉంటుంది’ అని అన్నారు. ‘మహిళా క్రికెట్ గొప్పతనంతో పాటు రైతుల సమస్యలను సహజంగా చూపించే సినిమా ఇది. తమిళంలో మాదిరిగానే తెలుగులో పెద్ద విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉంది’ అని కె.ఎస్.రామారావు చెప్పారు. తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ పి.రామ్‌మోహన్‌రావు మాట్లాడుతూ ‘ట్రైలర్ చూస్తుంటే అందరి హృదయాల్ని హత్తుకునే మంచి సినిమాగా నిలుస్తుందనే నమ్మకం ఉంది’ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీవీజీ రాజు, కార్తిక్‌రాజు, పోకూరిబాబురావు, క్రాంతిమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## వంగవీటి రంగా పాత్రలో..


సురేష్ కొండేటి

దేవినేని నెహ్రూ జీవిత కథ ఆధారంగా శివనాగు రూపొందిస్తున్న చిత్రం ‘దేవినేని’. ‘బెజవాడ సింహం’ ఉపశీర్షిక. తారకరత్న ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. వంగవీటి రంగా పాత్రలో సురేష్ కొండేటి కనిపించనున్నారు. ఆర్‌టిఆర్ ఫిలింస్ పతాకంపై రాము రాథోడ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ దశలో వుంది. కాగా బుధవారం వంగవీటి రంగా జయంతి సందర్భంగా సురేష్ కొండేటి లుక్‌ని చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ‘బెజవాడ రాజకీయాల్లో వంగవీటి రంగా ప్రస్థానం ఎంత గొప్పదో దేవినేని నెహ్రూ ప్రస్థానం అంతే గొప్పది. రంగా, నెహ్రూల స్నేహం శత్రుత్వంగా మారడానికి గల కారణాలు ఎన్నో వున్నాయి. అయితే అవన్నీ చరిత్రలో నిక్షిప్తమై ఉన్న గొప్ప నగ్న సత్యాలు. ఆ నగ్న సత్యాల నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రమే ‘దేవినేని’. ఇద్దరు మహానాయకుల యదార్థ గాథను కళ్లకు కట్టినట్టు చూపించే ప్రయత్నమే ఈ సినిమా’ అన్నారు. నిర్మాత మాట్లాడుతూ ‘దేవినేని, రంగా పాత్రలు పోటాపోటీగా వుంటాయి. రంగా పాత్రలో సురేష్ కొండేటి నటిస్తున్నారు. ఆయనకు సంబంధించిన లుక్‌ను విడుదల చేశాం. సహజత్వానికి దగ్గరగా రూపొందుతున్న ఈ చిత్రం అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుంది’ అన్నారు.

# లేడీ పోలీస్‌గా

పాయల్ రాజ్‌పుత్ పోలీస్ అవతారం ఎత్తింది. ఖాకీ డ్రెస్ పవర్‌ను చూపించడానికి రెడీ అవుతోంది. స్టూవర్టుపురం ప్రాంతానికి చెందిన గజదొంగ, మల్లయోధుడు టైగర్ నాగేశ్వరరావు జీవితం ఆధారంగా తెలుగులో ఓ సినిమా రూపొందుతున్నది. బెల్లంకొండ శ్రీనివాస్ టైటిల్ పాత్రను పోషిస్తున్న ఈ చిత్రానికి వంశీకృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు.ఈ సినిమాలో పాయల్ రాజ్‌పుత్ పోలీస్ పాత్రలో నటిస్తున్నది. ఇటీవలే ఆమె ఈ సినిమా షూటింగ్‌లో అడుగుపెట్టింది. పోలీస్ దుస్తుల్లో క్లాప్ బోర్డ్‌తో కూడిన ఓ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో పంచుకున్నది పాయల్‌రాజ్‌పుత్. సినిమాలో హీరోతో సమానంగా శక్తివంతంగా పాయల్ రాజ్‌పుత్ కనిపిస్తుందని సమాచారం. పూర్తిగా అభినయానికి ఆస్కారం ఉన్న పాత్ర ఇదని తెలిసింది. 1980-90 దశకంలో టైగర్ నాగేశ్వరరావు జీవితంలోని కీలక ఘట్టాలను ఆవిష్కరిస్తూ ఈ చిత్రం రూపొందుతున్నది. ప్రస్తుతం పాయల్ రాజ్‌పుత్ తెలుగులో ‘వెంకీ మామా’, ‘డిస్కోరాజా’తో పాటు మరో రెండు సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నది.


పాయల్ రాజ్‌పుత్



## ఇద్దరికీ హ్యాట్రిక్ అవుతుంది!

ఆది కథానాయకుడిగా నటించిన చిత్రం ‘బుర్రకథ’. డైమండ్ రత్నబాబు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మిస్తీచక్రవర్తి కథానాయిక. దీపాల ఆర్ట్స్ టాప్ ఎండ్ స్టూడియోస్ లిమిటెడ్ పతాకంపై శ్రీకాంత్ దీపాల, కిషోర్, కిరణ్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం బుధవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ ‘హిట్ సినిమాతోనే మీ ముందుకు రాబోతున్నాం అని దర్శకుడు డైమండ్ రత్నబాబు చెప్పాడు. చెప్పినట్టుగానే చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడు. రాజేంద్రప్రసాద్, ఆది కలిసి ఇంతకు ముందు రెండు చిత్రాల్లో నటించారు. ఇది వారిద్దరి కలయికలో వస్తున్న హ్యాట్రిక్ ఫిల్మ్ అవుతుంది. విజయేంద్రప్రసాద్ అన్నట్టు ఈ సినిమాకు అంతా పాజిటివ్ వాతావరణం కనిపిస్తోంది. ఇందులో ఆది నటన బాగుందని అంతా అంటున్నారు. తను సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. అది రేపు తెరపైన కనిపిస్తుంది’ అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ‘ఒక సెల్ ఫోన్‌లో రెండు సిమ్ కార్డ్‌లు, ఒక బుర్రలో రెండు బ్రెయిన్‌లు అన్న ఆలోచనలోంచి పుట్టిన కథ ఇది. రాజేంద్రప్రసాద్, ఆది తండ్రీ కొడుకులుగా నటించారు. వారిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. సినిమాపై మంచి నమ్మకంతో వున్నాం’ అన్నారు. ఆది మాట్లాడుతూ ‘డైమండ్ రత్నబాబు కథ చెప్పినప్పుడు ఆ రోజు రాత్రి నిద్రపట్టలేదు. ఈ కథ విని మంచి సినిమా అవుతుందని రాజేంద్రప్రసాద్ ప్రోత్సహించారు. సినిమాపై నమ్మకంతో వున్నాం’ అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ దీప్యాల,పృథ్వీ, సాయికార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# అబ్బాస్ - మస్తాన్‌లకు కథ చెప్పా!


సాయితేజ్ దేశరాజ్

‘‘కల్కి’ చిత్రానికి నేను అందించిన కథ బాగుందని ప్రతీ ఒక్కరు అభినందించడం ఆనందాన్ని కలిగిస్తోంది. పతాక సన్నివేశాల్లో వచ్చే ట్విస్ట్ గురించి ప్రతి ఒక్కరు అడుగుతున్నారు. కథ రాసుకునే సమయంలోనే ఆ ట్విస్ట్ అందరికి నచ్చుతుందని బలంగా నమ్మాను. పెద్ద నిర్మాణ సంస్థ ద్వారా నా కథ తెరమీదికి రావడం ఆనందాన్ని కలిగించింది’ అన్నారు సాయితేజ్ దేశరాజ్. ఆయన కథ అందించిన తాజా చిత్రం ‘కల్కి’. రాజశేఖర్ హీరోగా ప్రశాంత్‌వర్మ తెరకెక్కించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. ఈ సందర్భంగా రచయిత సాయితేజ్ దేశరాజ్ బుధవారం హైదరాబాద్‌లో మాట్లాడుతూ ‘మాది మహబూబ్‌నగర్. చిన్నతనం నుంచి కథలు రాయడం అంటే చాలా ఇష్టం. ఎన్నో కథలు రాశాను. ‘కహానీ డాట్ కామ్’ ద్వారా దర్శకుడు ప్రశాంత్ వర్మ పరిచయం అయ్యారు. ‘అ!’ సినిమా చిత్రీకరణ సమయంలో ప్రశాంత్‌వర్మకు ‘కల్కి’ కథ వినిపించాను. బాగుందని రాజశేఖర్ దంపతులకు వినిపించమన్నారు. వారికి కథ నచ్చడంతో తెరపైకొచ్చింది. ఈ సినిమా సక్సెస్ సాధించడంతో ముగ్గురు నిర్మాతలు కథ చెప్పమన్నారు. త్వరలో రాజశేఖర్‌కు కాప్ థ్రిల్లర్ నేపథ్యంలో ఓ కథ చెప్పబోతున్నాను. ఇటీవలే ‘రేస్’ చిత్ర దర్శకులు అబ్బాస్, మస్తాన్‌లకు కథ చెప్పాను. వారి నుంచి పిలుపు వస్తుందని ఎదురుచూస్తున్నాను’ అన్నారు.




